జస్టిస్ నాగార్జున పదవీ విరమణ

మద్రాస్ హైకోర్టులో ఘనంగా వీడ్కోలు

చెన్నై, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన తెలంగాణ బిడ్డ జస్టిస్ దేవరాజ్ నాగార్జున బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా బుధవారం మద్రాస్ హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ కృష్ణ కుమార్ అధ్యక్షతన ఇతర న్యాయమూర్తులంతా సమావేశమై జస్టిస్ నాగార్జునకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన వెలువరించిన కీలక తీర్పులను ప్రస్తావిస్తూ.. న్యాయ వ్యవస్థకు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ నాగార్జున కుటుంబసభ్యులతోపాటు హైకోర్టు న్యాయాధికారులు, సీనియర్ న్యాయవాదులు, సిబ్బంది హాజరయ్యారు. 1962 ఆగస్టు 15న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో దేవరాజ్ రామకృష్ణారావు, విమలాదేవి దంపతులకు జన్మించిన నాగార్జున.. ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల విద్య, వనపర్తిలోని ఆర్ఎల్‌డీ కాలేజీలో బీఎస్సీ, గుల్బర్గాలో లా, పీజీ డిప్లొమా, ఉస్మానియా వర్సిటీ నుంచి ఇంటర్నేషనల్ లాలో ఎల్ఎల్ఎం పూర్తి చేశారు.



జస్టిస్ నాగార్జున ప్రస్థానం ఇదీ..

1986లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయిన జస్టిస్ నాగార్జున.. తన తండ్రి రామకృష్ణారావు వద్ద జూనియర్‌గా న్యాయజీవితాన్ని ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ-కోర్టుల్లో పలు కేసులను సమర్థంగా వాదించారు. 1991 మే 1న జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఆయన.. 2004లో సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందే వరకు వివిధ ప్రాంతాల్లో పనిచేయడంతో పాటు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీగా, ఏపీ పోలీస్ అకాడమీలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా సేవలందించారు. కామారెడ్డి, నిజామాబాద్, రంగారెడ్డి మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా పనిచేసిన జస్టిస్ నాగార్జున.. 2010 సెప్టెంబర్ 17న జిల్లా జడ్జిగా పదోన్నతి పొందారు. 2002 నుండి 2004 వరకు ఇంటర్నేషనల్ కాన్‌ఫ్లిక్ట్ రిజల్యూషన్‌లో పరిశోధన చేసిన జస్టిస్ నాగార్జునకు అమెరికా (బర్కిలీ)లోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుంచి ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్ లభించింది. అదే సమయంలో జస్టిస్ నాగార్జున ఎల్ఎల్ఎం (ఇంటర్నేషనల్ లా), ఏషియన్ స్టడీస్‌లో ఎంఏ, 2013లో నల్సార్ యూనివర్సిటీ నుంచి 'ఏ క్రిటికల్ అనాలిసిస్ అఫ్ ఇట్స్ ఇంపాక్ట్స్ ఆన్ ది ఇండియా లీగల్ ప్రొఫెషన్' అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు. 2015 అక్టోబర్ 3 నుంచి 2021 సెప్టెంబర్ 2 వరకు హైకోర్టు రిజిస్ట్రార్‌గా, ఆ తర్వాత హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా పనిచేసిన ఆయన.. 2022 మార్చి 24న హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిరుడు ఏప్రిల్ 6న బదిలీపై మద్రాస్ హైకోర్టుకు వెళ్లారు.

మానవ రహిత సబ్‌స్టేషన్ల ప్రారంభం

- హనుమకొండ, వరంగల్‌లో సేవలు అందుబాటులోకి

హనుమకొండ సబర్బన్, ఆగస్టు 14: ఎన్పీడీసీఎల్‌లో పూర్తి సాంకేతికతను ఉపయోగిస్తూ ఏర్పాటు చేసిన మానవ రహిత సబ్‌స్టేషన్లను విద్యుత్తు శాఖ అధికారులు బుధవారం అందుబాటులోకి తెచ్చారు. హనుమకొండలోని నక్కలగుట్ట, వరంగల్ ఏజే మిల్లు గ్రౌండ్ వద్ద వీటి సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 30 వరకు హనుమకొండ, వరంగల్‌లో దాదాపు 20 సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. సబ్‌స్టేషన్‌కు సంబంధించిన ఏ సమాచారమైనా స్కాడా సెంటర్‌కు వస్తుందని, అక్కడ ఉన్న టెక్నికల్ టీం దీనిని పర్యవేక్షిస్తుందని వివరించారు. ఎలాంటి ట్రిప్పింగ్ జరిగినా వెంటనే అలారంతో కూడిన సమాచారం వస్తుందని, టీం సభ్యులు అప్రమత్తమై ఆన్ చేస్తారని తెలిపారు. ఒకవేళ బ్రేక్ డౌన్ అయినా.. వెంటనే సంబంధిత ఇంజినీర్‌కు, స్కాడా సెంటర్‌కు సమాచారం అందుతుందని చెప్పారు. రోజురోజుకూ మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించడానికి, అంతరాయాలను కనిష్ఠ స్థాయికి తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నట్టు సీఎండీ తెలిపారు.

ట్రావెల్ ప్యాకేజీలతో జాగ్రత్త!

- సైబర్ మోసానికి గురయ్యే అవకాశం:సీఎస్‌బీ

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): వరస సెలవులు ఉండటం వల్ల ప్రయాణాలు చేసేముందు యాత్రికులు, పర్యాటకులు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ విభాగం, పోలీసులు హెచ్చరించారు. ట్రావెల్ ప్యాకేజీ బుక్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. విమాన, హోటల్, రవాణా ప్యాకేజీలు ఆన్‌లైన్‌లో బుక్ చేసేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరించింది. ఆకర్షణీయమైన ఆఫర్లతో సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు, సోషల్‌మీడియాల్లో ప్రలోభపెట్టి.. ఆఖరికి అందినంత లాగేస్తారని, అనుమానాస్పద లింకులు, ప్రకటనలు క్లిక్ చేసి, మోసపోవద్దని సూచించారు.



పంద్రాగస్టు వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. 78వ స్వాతంత్ర్య వేడుకలకు సెక్రటేరియట్‌ను రంగురంగుల లైట్లతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అమరవీరుల స్తూపం, ట్యాంక్‌బండ్ తదితర ప్రదేశాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టి అందంగా తీర్చిదిద్దారు.

ఆరుగురు ఎస్పీలకు పదోన్నతి

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని ఆరుగురు నాన్‌క్యాడర్ ఎస్పీలకు కన్ఫర్డ్ ఐపీఎస్‌లుగా పదోన్నతి కల్పిస్తూ కేంద్ర హోంశాఖ బుధవారం ఉత్తర్వులను జారీచేసింది. సీనియార్టీ ప్రకారం 8 మంది జాబితాను సిద్ధం చేసి పంపగా వై సాయిశేఖర్, సమయ్ జాన్‌రావుకు కొన్ని అభ్యంతరాలతో ఇవ్వలేదు. మిగతా వారైన బీ రామ్‌రెడ్డి, సీహెచ్ శ్రీధర్, ఎస్ చైతన్యకుమార్, ఏ భాస్కర్, కే నరసింహ, కే శిల్పవల్లికి ఐపీఎస్ హోదా ఇచ్చింది.

క్యూఆర్ కోడ్‌తో రైల్వే టికెట్

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): టికెట్ జారీ కోసం దక్షిణ మధ్య రైల్వే జోన్ డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నది. రైల్వే టికెట్ జారీ కోసం ఎస్సీఆర్ ఆధ్వర్యంలో అన్ని రైల్వేస్టేషన్లలో క్యూఆర్ కోడ్ విధానం అమల్లోకి తీసుకువచ్చింది. నగదు రహిత లావాదేవీలను తగ్గించి, డిజిటల్ చెల్లింపులు పెంచడానికి వీలుగా ఈ విధానాన్ని తీసుకువచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు.

శ్రీశైలం జలాశయంలో చేపలవేటపై ఆంక్షలు

హైదరాబాద్, ఆగస్టు (నమస్తే తెలంగాణ) : శ్రీశైలం జలాశయ పరిసరాల్లో చేపల వేటపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. జూలై, ఆగస్టులో చేపల సహజ సంతానోత్పత్తి సమయమని, ఈ సమయంలో శ్రీశైలం జలాశయం, బ్యాక్ వాటర్స్‌లో చేపల వేట వద్దని ఆదేశించింది.



మెట్రో పార్కింగ్‌కు ఫీజుల మోత

- నాగోల్‌లో 25 నుంచి.. మియాపూర్‌లో వచ్చే నెల 1 నుంచి అమలు
- భగ్గుమన్న మెట్రో ప్రయాణికులు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ఇప్పటివరకు నాగోల్, మియాపూర్ మెట్రో రైలు డిపో ప్రాంతాల వద్ద ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించిన మెట్రో రైలు ఇకనుంచి పార్కింగ్ ఫీజులు వసూలు చేయనున్నట్టు ప్రకటించింది. ఈ నెల 25 నుంచి నాగోల్ పార్కింగ్ లాట్‌లో, సెప్టెంబర్ 1 నుంచి మియాపూర్ మెట్రో పార్కింగ్ లాట్‌లో పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తామని ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా నాగోల్ మెట్రోస్టేషన్ పక్కనే ఉన్న పార్కింగ్ లాట్‌లో పెయిడ్ పార్కింగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయడంతో ఆగ్రహానికి గురైన మెట్రో రైలు ప్రయాణికులు బుధవారం ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

నాగోల్, మియాపూర్ పార్కింగ్ లాట్‌ల్లో పార్కింగ్ ఫీజులు (రూపాయల్లో..)

గంటలు	ద్విచక్ర వాహనం	కారు
2 గంటలపాటు	10	30
8 గంటలపాటు	25	75
12 గంటలపాటు	40	120
ఆ తర్వాత ప్రతి గంటకు	5 (అదనం)	15 (అదనం)

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078. Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

గురుకులాల గోస

బీఆర్ఎస్ హయాంలో వికాసానికి చిరునామాగా వెలుగొందిన గురుకులాలు నేడు నిర్లక్ష్యం నీడలో నీల్గుతున్నాయి. ఆత్మహత్యలు, ఫుడ్ పాయిజనింగ్, లైంగిక వేధింపులకు అవి నెలవుగా మారాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన గత 8 నెలల్లోనే 36 మంది విద్యార్థులు మృతిచెందారు. 500 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. ఇంత జరుగుతున్నా ఏమీ జరగలేదన్నట్టుగానే సర్కారు వ్యవహరిస్తున్నది. రాజకీయాలకు పోయి విద్యార్థుల బతుకులను ఆగం చేయొద్దని బీఆర్ఎస్ నేత కేటీఆర్ పదే పదే హెచ్చరిస్తున్నా చెవికెక్కించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకులం విద్యార్థి పాముకాటుకు గురై చనిపోవడం విషాదకరం. బాధిత కుటుంబాన్ని కేటీఆర్ స్వయంగా వెళ్లి ఓదార్చడమే కాకుండా గురుకులాల సమస్యలపై అధ్యయనం చేసేందుకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో కమిటీ వేస్తామని ప్రకటించటంతో సర్కారులో కదలిక వచ్చింది.

కాంగ్రెస్ ప్రభుత్వం తమ పరువును కాపాడుకునేందుకు మంత్రులను తరిమింది. బాధిత కుటుంబాలను కలిసేందుకు వెళ్లిన మంత్రులు హడావుడి చేశారు. కానీ, ఇతర పిల్లల తల్లిదండ్రులు మంత్రులను కలుసుకోవడానికి ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకోవడం సర్కారు చిత్తశుద్ధిని తెలియజేస్తున్నది. అంతేకాదు, గురుకులాల్లో ఏసీబీ, ఫుడ్ సేఫ్టీ తనిఖీలు జరుగుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. అనేక గురుకులాల్లో నాణ్యత లేని, గడువు ముగిసిన ఆహార పదార్థాలు పట్టుబడుతున్నాయి. పెద్దాపూర్ ఘటన రేపిన దుమారం సమసిపోకముందే జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి గురుకుల విద్యార్థులు అస్వస్థతకు గురవడం గమనార్హం. కేసీఆర్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచిన మన గురుకుల వ్యవస్థ నేడు ఏ స్థాయికి దిగజారిపోయిందో ఈ ఘటనలు తెలియజేస్తున్నాయి.


బిడ్డల చదువుకు పేదరికం ఆటంకం కాకూడదని ఆలోచించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకుల వ్యవస్థను పటిష్ఠపరిచారు. అందులో భాగంగానే గురుకులాల సంఖ్యను వెయ్యికి పైగా పెంచారు. గురుకులాల్లో సౌకర్యాలకూ పెద్దపీట వేశారు. వాటిల్లో విద్యనభ్యసిస్తున్న పిల్లలకు సన్నబువ్వతో పాటు పోషకాహారాన్ని అందించారు. ఒక్కో విద్యార్థిపై సగటున ఏడాదికి రూ.1.25 లక్షలు ఖర్చుచేయడమే అందుకు నిదర్శనం.బీఆర్ఎస్ ప్రభుత్వ కృషి, వ్యయం వృథా పోలేదు. గురుకుల విద్యార్థులు చదువుల్లో రాణించడమే కాదు, పోటీ పరీక్షల్లో కార్పొరేట్‌కు దీటుగా ర్యాంకులు తెచ్చుకున్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, మెడిసిన్ సీట్లలోనూ తమ సత్తా చాటారు. కానీ, ఇప్పటి కాంగ్రెస్ పాలకులు గురుకులాల నిర్వహణపై పెద్దగా దృష్టి సారించడం లేదు. ఇతర రంగాల వలె కేసీఆర్ స్థాపించి నిలబెట్టిన గురుకులాలపైనా కాంగ్రెస్ ఏలికలు శీతకన్ను వేశారు. దాని ఫలితంగానే గురుకులాల పతనం మొదలైంది. దీంతో బడుగు బలహీన వర్గాలకు చెందిన పిల్లల భవిష్యత్తు డోలాయమానంలో పడింది. ఇది ఏ మాత్రం క్షమార్హం కాదు. ఇప్పుడు కావాల్సింది కంటితుడుపు చర్యలు కాదు, గురుకులాల వ్యవస్థలో సమూల ప్రక్షాళన. సర్కారు చిత్తశుద్ధితో వ్యవహరించి గురుకులాల పతనాన్ని అడ్డుకోకపోతే బడుగుల చదువులకు తీరని అన్యాయం చేసినట్టవుతుంది.

రిజర్వేషన్లు ఉమ్మడి సంపద

గత లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బలహీనపడిన బీజేపీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ర్టాలు చేజారిపోకూడదని కొన్ని నష్ట నివారణ చర్యలను చేపట్టింది. 'అగ్నివీర్' పథకం నిబంధనల సడలింపు ప్రక్రియ ఇందులో భాగమే. బడ్జెట్‌పై కూడా దీని ప్రభావం కనబడుతున్నది. ఈ నెల ఒకటిన సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీల వర్గీకరణపై ఇచ్చిన అనుకూల తీర్పును కూడా ఈ లెక్కలో వేయవచ్చు.



బి.నర్సన్
94401 28169



కోర్టుల్లో సుదీర్ఘకాలం వాయిదాలు పడే కీలక కేసులన్నీ ప్రభుత్వ కనుసన్నల్లోనే దాగుడుమూతలు ఆడుతుంటాయి. బీజేపీతో మందకృష్ణ చేయి కలిపినందుకు తెలంగాణలో 8 లోక్‌సభ స్థానాలు దక్కాయని ఆ పార్టీ నమ్ముతున్నది. తెలంగాణ, ఏపీ రాష్ర్టాల్లో బీజేపీకి మాదిగల మద్దతును ఈ తీర్పు పెంచుతుంది. జనాభా దృష్ట్యా తెలంగాణలో మాదిగ, మాలల నిష్పత్తి 2:1గా ఉన్నది. ఏపీలో ఇక్కడి కన్నా మాలల జనాభా కాస్త ఎక్కువే. మొత్తంగా ఎస్సీ కులాల జాబితాలో 61 ఉపకులాలున్నాయి. ఇప్పటికీ రిజర్వేషన్ ప్రయోజనాలను ఒక్క తరం కూడా అందుకోని ఉపకులాలు ఆ జాబితాలో ఎన్నో ఉన్నాయి. వీటిలో చాలా ఉపకులాల జనాభా వందలు, వేలల్లో ఉండగా లక్షల సంఖ్యలో ఉన్నవారు మాదిగలు, మాలలు మాత్రమే. వీరి తర్వాత లక్ష లోపు జనాభా గల ఉపకులాలుగా తెలంగాణలో నేతకాని, బుడగ జంగాలు వస్తాయి. బైండ్ల, డక్కలి, చిందు కులాలు కూడా మాదిగల్లోకే వస్తాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం.. దేశ జనాభాలో ఎస్సీలు 7 శాతం ఉండగా, తెలంగాణలో 19 శాతం, ఏపీలో 23 శాతం ఉన్నారు. ఆ లెక్కల ప్రకారం తెలంగాణలో మాదిగలు 32.33 లక్షలు ఉండగా, మాలలు 15.27 లక్షలు ఉన్నారు. 2014లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఎస్సీల జనాభా 63,60,158 అని తేలింది. నిష్పత్తి ప్రకారం చూస్తే మాదిగలు 42 లక్షల మంది ఉండే అవకాశం ఉన్నది.

> **ఉమ్మడి ఏపీలో ఆంధ్రా ప్రాంతంలో మాలలు చదువు, వ్యవసాయంలో మాదిగల కన్నా ముందున్నారని తెలిపే అధ్యయనాలున్నాయి. మాదిగలు తమ కుల, చేతివృత్తులను పట్టుకొనే ఉండగా మాలలు చదువు, వ్యాపారాల్లోకి వెళ్లారని, తద్వారా రిజర్వేషన్ల ఫలాలు వారికే ముందుగా, ఎక్కువగా దక్కుతున్నాయని మాదిగల వేదన, వాదన.**

చదువుల్లో, ఉద్యోగాల్లో, పదవుల్లో న్యాయమైన వాటా దక్కాలంటే తమలో కూడా బీసీల మాదిరి కుల వర్గీకరణ తప్పనిసరి అని నష్టపోతున్నవారు చాలాకాలంగా కోరుకుంటున్నారు. ఎస్సీల వర్గీకరణ కోసం మాదిగల నేతృత్వంలో 1990 నుంచి ఆందోళన కొనసాగుతున్నది. మాలలు ఈ డిమాండ్‌ను వ్యతిరేకించడంతో రెండు కులాల మధ్య కొంత ఎడబాటు కూడా ఏర్పడింది.

20 ఏండ్లుగా సుప్రీంకోర్టులో నానుతున్న కేసులో తమ అభీష్టం మేరకు తీర్పు రావడంతో మాదిగల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నికల సమయంలో మందకృష్ణ మాదిగ ప్రధాని మోదీతో కలిసిపోవడాన్ని విమర్శించిన వారున్నారు. పార్టీ విధానాల పరంగా బీజేపీని వ్యతిరేకిస్తున్న మాదిగ కులస్థుల వర్గం మంద కృష్ణ నిర్ణయాన్ని బహిరంగంగా తప్పుపట్టింది. సొంత భావజాల పరంగా చూస్తే వ్యక్తిగా మంద కృష్ణ కూడా ప్రధాని మోదీ శరణులోకి వెళ్లడం విచిత్రమే. కోర్టులో కేసు కదలడానికి, అనుకూల తీర్పునకు ఇదే అదనుగా భావించిన మంద కృష్ణ ప్రధాని ముందు బహిరంగంగా కన్నీళ్లు పెట్టుకొని సెంటిమెంట్‌తో లొంగదీసుకున్నాడు. అది బహిరంగ ఎన్నిక ప్రచార వేదిక కాబట్టి వర్గీకరణపై కమిటీ వేస్తామని మోదీ సభాముఖంగా ప్రకటించారు. రెండు రాష్ర్టాల్లో ఎన్నికల ఫలితాలు బీజేపీకి శుభకరంగా ఉండటంతో ఈ వర్గీకరణకు కాలం కలిసివచ్చినట్లయింది.

మాల, మాదిగ.. రెండు కులాలు దళిత జాతివే అయినా రెండింటి మధ్య సంస్కృతి, సంప్రదాయాలపరంగా చాలా భేదాలున్నాయి. ఒకరి పిల్లను ఒకరు చేసుకోరు. ఎవరి అయ్యావార్లు వారికున్నారు. మాదిగల కన్నా మేము గొప్ప అనే భావన మాలల్లో అన్ని విషయాల్లోనూ కనబడుతుంది. రెండు భిన్న కులాల్లో ఉండే సహజ వ్యత్యాసాలుగా వీటిని చూడవచ్చు. ఇదంతా కాలమాన జీవన విధానంలో భాగమే తప్ప కోరి విభేదిస్తున్నది కాదు. అయితే, సంఖ్యాపరంగా ఎక్కువున్న ఈ రెండు ఎస్సీ కులాల మధ్య రాజ్యాంగ ప్రయోజనాలు కూడా సమతూకంగా ఉండాలని అందరు కోరుకుంటారు.

నిజానికి ఈ సమస్యను కోర్టులో, ప్రభుత్వాలో తీర్చవలసిన అవసరం లేదు. అంబేద్కర్ ఆలోచనాసారాన్ని దళితులంతా ఆచరణలో చూపవలసిన బాధ్యత వారిపై ఉన్నది. రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీల ఉమ్మడి ఆస్తి. తండ్రి ఆస్తిని పిల్లలు పంచుకునే న్యాయపద్ధతి ఇక్కడ అవసరం. ఒకే కడుపులో పుట్టిన బిడ్డలు తాము సమానంగా ఎదగాలని, ఆర్థికంగా బలహీనంగా ఉన్న తోబుట్టువులకు ఎక్కువ పాలు ఇవ్వాలని కోరుకుంటారు. పెద్దలు చెప్పిన పంపకాన్ని ఒప్పుకుంటారు. ఆస్తి విషయంలో పిల్లలు గొడవకు దిగితే పోయేది కుటుంబ పరువేననే స్పృహ అవసరం. దాయాదులుగా కాకుండా అన్నదమ్ముల్లా ఆలోచించాలి. మాల, మాదిగలు సామరస్యంగా తమ వాటాల నిర్ణయాన్ని ప్రభుత్వం ముందుపెడితే ఇంత కాలహరణ జరిగేది కాదు. రిజర్వేషన్లు మనవి, దాని లెక్కలు మనమే తేల్చుకుందామనే ధోరణి ఇప్పటికైనా అవసరమే.

> **సుప్రీంకోర్టు వర్గీకరణ బాధ్యతను రాష్ర్టాలకే కట్టబెట్టింది. పాలక పార్టీ పెద్దలు స్వలాభం కోసం ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశం ఉన్నది. మళ్లీ ఫలితాలు ఏకపక్షంగా ఉంటే తీర్పు ప్రయోజనం ఒనగూడదు. ఇప్పటికే క్రీమీలేయర్ వర్తింపుని కేంద్ర క్యాబినెట్ వ్యతిరేకించింది. కాంగ్రెస్ కూడా దానికి వత్తాసుగా ప్రకటనలు చేస్తున్నది.**

మేమంటే మేము ముందు వర్గీకరణ చేపడుతామని మన రాష్ట్ర ప్రభుత్వాలు అంటున్నాయి కానీ, చేతికి అందేదెప్పుడో, అందేదేమిటో చెప్పలేం. రాజకీయ ప్రయోజనాలను మాత్రమే కోరుకునే పార్టీలను గుడ్డిగా నమ్మలేం. రెండు, మూడు తరాలుగా ఫలాలను అనుభవిస్తున్న రాజకీయ నేతలకు ఈ తీర్పు మింగుడు పడనిదే. కమిటీలు, రిపోర్టులు అంటూ కాలయాపన చేయవచ్చు. రిజర్వేషన్ల రక్షణ, సమపాళ్ల అమలుకోసం ఎస్సీ, ఎస్టీలు ఇప్పటికైనా విభేదాలు వదిలి ఉమ్మడిగా కృషిచేయాలి. ఒకరి కాలు ఒకరు లాగితే లాభపడేవి రాజకీయ పార్టీలే.



నోరు విప్పి నిజం చెప్పండి!

సెబీ చైర్‌పర్సన్ బుచ్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు బహిరంగ లేఖ

గౌరవనీయులైన మాధవీ పూరి బుచ్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్

విషయం: సెబీకి మూడు ప్రశ్నలు

అదానీ గ్రూప్‌కు సంబంధించిన విషయాలను హిండెన్‌బర్గ్ బహిర్గతం చేసినందున 94 ఏండ్ల జార్జ్ సోరోస్‌ను విమర్శించేందుకు, విదేశీ హస్తం ఉందని నిందించేందుకు బీజేపీని అనుమతించడం ద్వారా భారత దేశ గౌరవనీయ మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ వెర్రివెంగళప్పలా మారుతున్నది. ఇది హాస్యాస్పదమని మీకూ తెలుసు. నాకూ తెలుసు. తర్వాత వారు టేలర్ స్విఫ్ట్‌పైనే ఆరోపణలు చేస్తారు. అనుమానపు వేలు ఇప్పుడు వారి అగ్రనాయకత్వం వైపే చూపెడుతున్నది. అందుకే బీజేపీ ఇప్పుడు ఆందోళనలో పడింది. రామ్‌దేవ్ బాబా ధ్యానాన్ని స్ఫూర్తిగా తీసుకుని, విశ్రాంతి తీసుకోవాలని ఆందోళనలో ఉన్న బీజేపీకి మీరు చెప్పండి. మీలో కొందరు నిపుణులు, బ్యూరోక్రాట్లు ఉన్నారు. మీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు బీజేపీని ఎందుకు అనుమతిస్తున్నారు? అబద్ధాల్లో ఆరితేరిన, బురదజల్లడంలో ప్రావీణ్యం సాధించిన పార్టీ వారిది. ప్రజలకు నిజానిజాలను చెప్పడం మీ కర్తవ్యం.


సెబీ బోర్డుకు మూడు సాదాసీదా ప్రశ్నలు

1. హిండెన్‌బర్గ్‌ను కాసేపు పూర్తిగా పక్కనపెట్టండి. 2014(ఎన్డీయే అధికారంలోకి వచ్చినప్పుడు)లో 4.5 బిలియన్ డాలర్లున్న అదానీ నెట్‌వర్త్.. 2020లో 11 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఆ తర్వాత 2021 నాటికీ అనూహ్యంగా 76 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. 2022లో 150 బిలియన్ డాలర్లకు ఎగబాకింది. ఇదంతా వ్యాపారమేనని మీరు అనుకుంటున్నారా? షేర్ ధరల అవకతవకలను సుమోటోగా తీసుకొని మీరు ఎందుకు దర్యాప్తు చేయడం లేదు? అదానీ గ్రూప్ క్యాపిటలైజేషన్ అబ్బురపరిచే వృద్ధిపై మీరు వివరణ ఇవ్వాలి. ప్రత్యేకించి, మోదీ ప్రభుత్వంతో ఉన్న సంబంధం గురించి.

2. 2022లో కేవలం 7 అదానీ గ్రూప్ కంపెనీలు బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ వృద్ధిలో 80 శాతం వాటాను కలిగి ఉండటం ఆశ్చర్యకరం. ఇదంతా చూస్తే కామర్స్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థి 'అరె! అసలు ఏం జరుగుతున్నది?' అని కనుబొమ్మలు ఎగురవేస్తాడు. కానీ, షేర్ ధర పెరుగుదలలో వారి పాత్రపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలని సెబీ అనుకోలేదు. ఇదేమీ ఆషామాషీ వ్యవహారం కాదు కదా! అసలు దీన్ని ఎవరైనా నమ్ముతారని మీరు అనుకుంటున్నారా? షేరు విలువ/ ఆర్జన నిష్పత్తి గురించి పరిశీలించాలని మీకు అనిపించలేదా? మీరు ఏం విస్మరించారో లేదా కావాలని నిర్లక్ష్యం చేశారో చూద్దాం. (అదానీ పవర్ పీఈ 769 వద్ద ఉన్నప్పుడు టాటా పవర్ 34 వద్ద ట్రేడవుతున్నది. అదానీ గ్యాస్ 747 వద్ద ఉండగా.. దాని ప్రత్యర్థి కంపెనీ ఇంద్రప్రస్థ గ్యాస్ 17 వద్దే ఉంది. దయచేసి వారి వార్షిక నివేదికలను చదవండి. ఎలాంటి ఆర్థిక పరిమితులు దీన్ని సమర్థించవు).

> **కఠినమైన వాస్తవం ఏమిటంటే.. మార్కెట్లతో ఆటలాడుతున్నప్పుడు మీరు మీ బాధ్యతలను విస్మరించి నిద్రమత్తులో జోగుతున్నారు. కేవైసీలు, డిజిటల్ చెల్లింపులు, నగదు బదలాయింపులకు సంబంధించిన శాశ్వత డిజిటల్ సాక్ష్యాధారాలను నమోదు చేస్తున్న యుగంలో మనం ఉన్నాం. హిండెన్‌బర్గ్ అనుమానాలను లేవనెత్తింది. కానీ, ఏడాది పాటు దర్యాప్తు చేసిన తర్వాత కూడా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని సెబీ తేల్చిచెప్పింది. ఇదెలా ఉందంటే.. ఒలింపిక్స్‌కు ప్యారిస్ ఆతిథ్యమిచ్చినట్టు రుజువులు చూపమని అడిగినట్టుగా ఉంది.**

3. అదానీ షేర్లలో విదేశీ ట్యాక్స్ హావెన్స్‌కు సంబంధించి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరుగుతున్న దర్యాప్తు పూర్తయితే పెద్ద తలకాయలు బయటపడతాయి కనుక దర్యాప్తును నిదానంగా, సులభంగా బయటపడేలా లేదా మొత్తంగా దర్యాప్తును ధ్వంసం చేయాలని మీపై ఆర్థిక మంత్రిత్వ శాఖ లేదా పీఎంవో నుంచి ఒత్తిడి వచ్చిందా? మీరేమైనా కీలుబొమ్మలా? అదే కనుక నిజమైతే మీరు నోరు విప్పాలి. పైన పేర్కొన్న వాటికి మీ పారదర్శక ప్రతిస్పందన 'సన్‌లైట్'(ఒకప్పటి ఫేమస్ డిటర్జెంట్ సబ్బు)లా సాయపడుతుంది. అంటే దానర్థం.. సూర్య కాంతి అన్నింటినీ పరిశుద్ధం చేస్తుంది కదా!



సంజయ్ ఝా
రాజకీయ విశ్లేషకులు

కొండెక్కిన న్యాయం ఖరీదు!



ఫిరోజ్ ఖాన్
96404 66464




ఒకరు ఆటో డ్రైవర్. అతడి నెల సంపాదన రూ.10 వేలు. రోజూ పనిచేస్తేనే గాని పూట గడవని పరిస్థితి. మరొకరు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కీలక పోస్టులో ఉన్న వ్యక్తి. లక్షన్నరకు పైగా జీతం. పక్కపక్కనే ఉండే వీరి మధ్య ఇంటి స్థలం విషయంలో వివాదమైంది. మున్సిపల్ కార్యాలయం, కలెక్టరేట్, సీఎంవోల చుట్టూ ఆటోడ్రైవర్ తిరుగగా.. అతని స్థలంతో కొంత భాగాన్ని సదరు పోలీసు కబ్జా చేసినట్టు నిర్ధారణ అయింది. అయితే సదరు పోలీసు ముందుగా జిల్లాలోని సివిల్ కోర్టు, అపై హైకోర్టులో కేసు వేశాడు. దీంతో ఆ ఆటోడ్రైవర్ న్యాయం కోసం కోర్టులు, న్యాయవాదుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. లాయర్ల ఫీజు అతనికి భారంగా మారింది. న్యాయం చేయాల్సిన పురపాలక అధికారులు కేసు కోర్టులో ఉన్నదనే సాకుతో తప్పించుకుంటున్నారు. ఆటోడ్రైవర్ ఆర్థిక పరిస్థితి గురించి పూర్తిగా అవగాహన ఉన్న సదరు పోలీసు అక్రమ నిర్మాణం కొనసాగిస్తున్నాడు. పాపం ఆ ఆటోవాలా న్యాయం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నాడు.

ఇది ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ఓ ఘటన. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి బాధితులు ఎందరో. భూ బకాసురులను ఎదుర్కోలేక.. డబ్బు, అధికార మదంతో విర్రవీగేవారిని నిలువరించలేక చాలామంది పేదలు నిస్సహాయులుగా ఉండిపోతున్నారు. లక్షల్లో ఖర్చుపెట్టి న్యాయం పొందడం పేద ప్రజల వల్ల కావడం లేదు. లా కంపెనీలు రావడం వల్ల యువకులకు అవకాశాలు వస్తున్నాయని, కానీ కార్పొరేట్ ఫీజులను పేదలు భరించలేరని, తద్వారా సామాన్యులకు న్యాయం దూరమవుతుందని రిటైర్డ్ జస్టిస్ ఎన్వీ రమణ గతంలో నొక్కిచెప్పారు.

అంటే.. 'న్యాయం' ఇప్పుడు ఖరీదుగా మారిందనే విషయం అర్థమవుతూనే ఉన్నది. అంతేకాదు, కోర్టు విధానాలు, సేవలపై పేదలకు సరైన అవగాహన ఉండటం లేదు. కేసులు, కోర్టులు అనగానే చాలామంది ప్రజలు భయాందోళనకు గురై వెనుకడుగు వేస్తున్నారు. దీంతో అంగబలం, ధన బలం ఉన్న అక్రమార్కులపై పేద ప్రజలు ఓడిపోతున్నారు. లాయర్‌ను పెట్టుకునే ఆర్థిక స్థోమత లేనివారికి ప్రభుత్వమే ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందనే విషయంపై పేదలకు సమగ్ర అవగాహన కల్పించాలి. న్యాయసహాయం కోసం దరఖాస్తు చేసుకున్నవారికి జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఒక లాయర్‌ను కేటాయిస్తుంది. అంతేకాదు, అవసరమైతే కోర్టు ఫీజులు, సాక్షులకు సంబంధించిన వ్యయాలు, మరే ఇతరత్రా ఖర్చులున్నా ఆ సంస్థ భరిస్తుంది. ఉచిత న్యాయ సేవలు పొందాలనుకునేవారు తమ కేసు ఏ కోర్టు పరిధిలోకి వస్తుందో తెలుసుకుని అక్కడి న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే వీలుంది.

సమయానికి అందని న్యాయం కూడా అన్యాయంతో సమానం. ఒక్కమాటలో చెప్పాలంటే అది కూడా ఒక శిక్ష లాంటిదే. ఏ తప్పు చేయనివారికి, బాధితులకు పడే శిక్ష అది. న్యాయం ఆలస్యమవడమనేది పెద్దల దృష్టిలో చిన్న సమస్యే కావచ్చు. కానీ, పేదలకు మాత్రం అది జీవన్మరణ సమస్య. ఈ నేపథ్యంలో కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అధికారుల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను త్వరితగతిన పరిష్కరించి పేదలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది.



'స్వాతంత్య్రమంటే ఏమిటో నిర్వచించుకోలేని దశలోనే దశాబ్దాలు గడిచిపోవడం నిజంగా విషాదకరం' అని అన్నారు ఆరుద్ర. స్వాతంత్య్ర పోరాటంలో ఆస్తులు, అశువులు కోల్పోయిన యోధులంతా నేడు తిరిగి పుట్టినా (బహుశా) పరిస్థితుల్లో మార్పు రాదేమో! దేశంలో ఎన్నెన్నో మార్పులు, అభివృద్ధి అనివార్యమయ్యాయి.

ఏది నిజమైన స్వాతంత్య్రం?



భమిడిపాటి గౌరీశంకర్
94928 58395



సాంకేతిక రంగంలో వినూత్నమైన ఆవిష్కరణలు జరిగాయి. చంద్రుని మీదికి ప్రయాణాలు విస్తృతమయ్యాయి. ఆర్థికపరమైన వృద్ధి సాధ్యమైంది. దేశం అభివృద్ధిలో అంగలు వేసింది. ప్రతీ రంగంలో ఈ మార్పు కనిపిస్తున్నది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)తో మనుషులను సజీవంగా యాంత్రికతతో నిలుపుతున్నాం. మానవ రహిత వ్యోమనౌకలను అంతరిక్షంలోకి పంపగలుగుతున్నాం. దేశ స్వాతంత్య్రం అంటే ఇంతేనా అనే 'విరుపులు' ఉన్నాయి. ఈ మెరుపులు నాణేనికి ఒకవైపు. మరి రెండోవైపు? 'ఆకాశం అందుకునే ధరలు ఒకవైపు, అంతులేని నిరుద్యోగం ఇంకొక వైపు/ అవినీతి, బంధుప్రీతి చీకటి బజారు' అని శ్రీశ్రీ ఐదు దశాబ్దాల కిందటనే ఆవేదనను వ్యక్తం చేశారు. ఏడున్నర పదుల స్వాతంత్య్రం పూర్తిచేసుకున్న నాటికీ మహాకవి ఆవేదన అక్షర సత్యంగానే మిగలటం ఆవేదన కలిగిస్తున్నది. 'భారతదేశ స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా దేశంలోని ఆసేతు హిమాచల పర్యంత ప్రజలంతా ప్రగతి ఫలాలు అందుకోవాల'ని ఆశించిన నెహ్రూ కలలు 'కల్ల' కావటం శోచనీయం.

నాలుగు వైపులా నీరున్నా 'అన్నదాతకు' బతుకు భరోసా లేదు. పీజీలు చేసినా పిడికెడు బువ్వ కోసం యువత నిరంతరం పోరాడుతూనే ఉన్నది. అటవీ ప్రాంతంలో అభివృద్ధి ఛాయలు పావు వంతు కూడా కనపడటం లేదు. అటవీ సంపద, 'ఆటవిక' జీవనం కింద నలుగుతున్న వైనం దేశ యవనికపై నిత్య దృశ్యం. ఆదివాసుల జీవనం ఎంత దుర్భరంగా మారినా పట్టించుకునే నాయకులు లేరు. కరెంటు, తాగునీరు, రహదారి సౌకర్యం లేని ఆదివాసీల సంఖ్య 12 నుంచి 18కి చేరిందని ప్రభుత్వ గణాంకాలే చెప్తున్నాయి. ఆగస్టు 15న జెండాకు వందనం చేసే నాయకులు సైతం ఏది నిజమైన స్వాతంత్య్రం? నిజంగా దేశానికి స్వాతంత్య్రం వచ్చిందా? అని సందేహం వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగ ప్రవేశికలో భారతదేశం 'లౌకిక దేశమని' పేర్కొన్నారు. ఆ ఛాయలు మాత్రం (మణి)పూర్‌గానే ఉన్నాయి. ఎవరు బాధ్యులంటే అంతటా 'నిశ్శబ్దం' ఆవహిస్తున్నది. భాష, కులం, మతం, ప్రాంతం, వర్గం ఇవి నేడు దేశాన్ని నడిపిస్తున్న తరుణంలో 'పాడవోయి భారతీయుడా ప్రగతి గీతిక'ని ఎలా నినదించాలి. అధికారం ప్రజాపాలనకు, వారి అభివృద్ధికి నాయకులు వినియోగించాలని చెప్పిన రాజ్యాంగ నిర్మాత(ల) ఉపదేశాలు కేవలం నాయకుల ఉపన్యాసాలకే పరిమితం కావటం మరో విషాదం.

స్త్రీ, బాలికల సంరక్షణ అంకెలు ఘనం, ఆచరణ శూన్యం. మండుతున్న ప్రాంతాలు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. దేశంలో అశాంతి పెరిగితే, అది దేశ సమగ్రతకు, సార్వభౌమాధికారానికి చేటు. స్వాతంత్య్రం అనేది కేవలం నామమాత్రపు అంశంగా ఏర్పడే అవకాశం ఉన్నదని బాబు రాజేంద్రప్రసాద్ నాడే హెచ్చరించారు. 'తిలాపాపం తలా పిడికెడు' అన్నట్టు దేశంలో ఉగ్రవాద ఉద్యమ విషసర్పాలకు పాలు పోసి పెంచి పోషించిన పాపం పాలకులదే. తదుపరి ఆ పాము కాట్లకు బలైనది కూడా వారే. మరి వర్తమాన, రాబోయే తరాలకు ఏది నిజమైన స్వాతంత్య్రమో ఎలా వివరించగలం?

విశ్వవిద్యాలయాలు, విద్యాలయాలు సైతం స్వాతంత్య్ర దినోత్సవం కోసం ఆటలు ఆడిస్తున్నాయి. పలురకాల పోటీలు పెట్టి బహుమతులు ఇస్తున్నాయి. కానీ, ఆగస్టు 15 గొప్పతనం, స్వాతంత్య్ర పోరాటాల గురించి వివరించే సిలబస్‌లను మాత్రం దూరం చేస్తున్నాయి. తల్లిదండ్రులకు సైతం ఆగస్టు 15న సెలవే. మరి వారు తమ పిల్లలకు ఏం చెప్తున్నారు? కవులు, కళాకారులు సైతం ప్రభుత్వ సేవలో ఉంటూ వారిచ్చే పురస్కారాల కోసం పరితపిస్తున్నారు. మరి ఏది నిజమైన స్వాతంత్య్రమో యువతకు చెప్పేదెవరు? ఆ దిశగా ఆలోచింపజేసేదెవరు? అభివృద్ధి అంటే సాంకేతికంగా ఎదగడం కాదు. సంపద, ఉత్పత్తి, శ్రమ, పెట్టుబడులకు సమానమైన ఫలితం దక్కటం. సామాన్యుడి నుంచి సంపన్నుల వరకు స్వాతంత్య్ర ఫలాలను, కనీస సౌకర్యాలను పొందగలగటం. భద్రతతో కూడిన బతుకును స్వేచ్ఛగా అనుభవించగలగటం. భ్రమలు లేని వాస్తవ సమాజాన్ని నిర్మించడం కోసమే 1857 నుంచి 1947 వరకు ఉధృతంగా పోరాటాలు చేసి ధన, మాన, ప్రాణాలను తృణంగా సమర్పించిన నిస్వార్థ నాయకుల జీవితం గురించి వివరించాల్సిన అవసరం వర్తమానంలో ఉన్నది. కానీ, ఆ దిశగా 'విద్యా విధానం'లో తగు మార్గదర్శక సూత్రాల్లేవు. ఉన్నా, వాటిని సైతం రాజకీయ, మత ప్రయోజనాల ప్రాతిపదికగా పుస్తకాల నుంచి తీసేయడం ఎటువంటి పునర్నిర్మాణమో పాలకులే చెప్పాలి. 'సమ సమాజమనే కల వాస్తవం కాదని, యాభై ఏండ్ల స్వాతంత్య్రం నాకు చెప్పింది. కానీ, సమన్యాయం, తిండి, విద్య, వైద్యం కూడా అందరికీ అందని ఫలాలని నాకు అర్థమైంది. మరెందుకీ స్వాతంత్య్రమని భవిష్యత్ తరాలు చింతిస్తే ఆ తప్పునకు ఎవరు బాధ్యత తీసుకుంటార'న్న అలిశెట్టి ప్రభాకర్ వ్యాఖ్యానం నేటికీ సత్యం.



కీర+పైనాపిల్ అందం

ఒళ్లంతా నీరూరుతూ నిగనిగలాడే కాయగూర కీరదోస. పైకి ముళ్లున్నా.. తేనె దాచుకున్న పండు పైనాపిల్. ఈ రెండూ శరీరానికి మేలుచేసేవే. రెండి టినీ కలిపి జూస్ చేసి కొడితే.. అందం రెట్టింపు అవుతుంది. ముఖంపై ఉన్న ముడతలు మాయం అవుతాయి. మొటిమల అడ్రస్ గల్లంతవుతుంది.

కీరదోసలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. నీటి శాతం ఎక్కువగా ఉన్నందు వల్ల చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. చర్మంపై ఉండే కణాలు ధ్వంసం కాకుండా కీరలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కాపాడతాయి.

చాలామంది ఇష్టంగా తినే పండు పైనాపిల్. ఇందులో ఉండే బ్రొమెలిన్ అనే ఎంజైమ్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మంపై ఉండే వాపులను తగ్గించడంలో సాయపడుతుంది. ప్రతిరోజూ తినే ఆహారంలో పైనాపిల్ చేర్చుకుంటే చర్మం సహజ కాంతిని సంతరించుకుంటుంది.

పైనాపిల్, కీరదోసతో చేసిన డ్రింక్ తాగడం వల్ల కూడా చర్మ సమస్యలకు చెక్ పెట్టొచ్చు. కీర, పైనాపిల్, తాజా పుదీనా ఆకులు, నిమ్మరసంతో చేసే డ్రింక్ తాగితే ముఖంపై ఉండే మచ్చలు తగ్గుతాయి. చర్మం యవ్వనంగా, కాంతిమంతంగా మారుతుంది.

తయారీ ఇలా..

కీరదోస, పైనాపిల్ ముక్కలు, పుదీనా ఆకులు, నిమ్మరసం కలిపి బ్లెండర్‌లో వేయాలి. మిక్స్ చేసిన తర్వాత ఫిల్టర్ చేయాలి. ఐస్ క్యూబ్స్, పుదీనా ఆకులు వేసుకుని తాగాలి.



నమస్తే తెలంగాణ

జిందగీ

హైదరాబాద్ | గురువారం 15 ఆగస్టు 2024 www.ntnews.com

వందేమాతరం ఉద్భవించిన వంగభూమిలో.. ఆమె తల్లడిల్లుతున్నది. జనగణమన పుట్టినింట.. పుట్టెడు బాధను అనుభవిస్తున్నది. 77 ఏండ్ల స్వతంత్ర దేశాన్ని ఆ ఆవేదన అడుగుతున్న ప్రశ్న... 'స్వతంత్రమా.. నీవెక్కడ?' 'ఆడపిల్ల అర్ధరాత్రి నడిచిన నాడే అసలైన స్వాతంత్ర్యం సిద్ధించినట్టు' అన్న బాపూ ఆకాంక్షను సవాలు చేస్తున్నది.

స్వతంత్రమా నీవెక్కడ?

ఆర్జీకార్ వైద్య కళాశాలలో డాక్టర్‌పై జరిగిన హత్యాచారంపై ఈ వ్యవస్థను ప్రశ్నిస్తున్నది కోల్‌కతాకు చెందిన 29 ఏండ్ల రిమ్‌జిమ్ సిన్హా!


తన సమరానికి స్వతంత్ర దినోత్సవమే సరైన సమయం అని భావించింది. కచ్చితమైన జవాబు కోసం బ్రిటిష్ వాళ్లు భారతాన్ని విడిచి వెళ్లిన ఆగస్టు 14 అర్ధరాత్రి (పంద్రాగస్టు) నడి వీధిలోకి రావాలని పిలుపునిచ్చింది. కోల్‌కతా ఆర్జీకార్ వైద్య కళాశాలలో జరిగిన హత్యాచారంపై.. మువ్వన్నెలు రెపరెపలాడే వేళ యావత్ స్వతంత్ర భారతం స్పందించాలని డిమాండ్ చేసింది. ఎఫ్‌బీ వాల్స్‌పై నినదిస్తే సమాధానం రాదు. ఎక్స్ హ్యాండిల్ వైరల్ చేస్తే జవాబు దొరకదు. అందుకే, నడివీధికొస్తే అయినా.. పాలకుల్లో కదలిక వస్తుందని భావించింది సిన్హా. అదీ అర్ధరాత్రి రోడ్డు ఎక్కితేనే సరి అని నిర్ణయానికొచ్చింది.

> 'భారతదేశం అంతా స్వాతంత్ర్య వేడుకలు జరుపుకొంటున్న తరుణంలో.. ఓ మహిళగా నేనూ నా స్వేచ్ఛను ఆస్వాదించాలని కోరుకుంటున్నా. బాధితుల పక్షాన నిలవకపోగా.. ఈ సమయంలోనూ లింగవివక్ష చూపుతున్న వారిని సవాలు చేయాలనేదే నా ప్రయత్నం. వివక్షకు గురవుతున్న అందరూ ఇందులో పాల్గొనాలని పిలుపునిచ్చాను. ఎందరో స్పందించారు. రాత్రంతా నిరసన కొనసాగించకపోవచ్చు. కానీ, మూడు నాలుగు గంటలైనా.. మా గళం వినిపిస్తాం'
>
> • రిమ్‌జిమ్ సిన్హా



ఎందుకింత నిరసన?

కోల్‌కతా హత్యాచారం ఉదంతంలో నేరస్తుడు పట్టుబడ్డాడు. కేసు సీబీఐకి అప్పగించారు. విచారణ కొనసాగుతున్నది. కోర్టు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నది. అయినా ఎందుకీ పోరాటం? నేరస్తుణ్ని చట్టం గట్టిగా శిక్షిస్తుంది. కానీ, నేరం జరిగిన తర్వాత జరిగిన, జరుగుతున్న పరిణామాలకు బాధ్యులు ఎవరు? రిమ్‌జిమ్ పదేపదే గొంతు చించుకొని ఇదే సవాలు విసురుతున్నది. జరిగిన దుస్సంఘటనపై పెదవి విరిచిన ఆర్జీకార్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ 'అంత అర్ధరాత్రి.. ఆ ఆడకూతురు ఒంటరిగా సెమినార్ హాల్‌కు వెళ్లడం ఎందుకు?' అన్న ప్రశ్నకు సమాధానాన్ని కోరుతున్నది రిమ్‌జిమ్ సిన్హా. 'పెందరాలే ఇంటికి చేరుకోక.. ఏమిటీ పెత్తనాలు' అని నోరుపారేసుకున్న పురుష పుంగవుల మస్తిష్కాలను కడిగేయడానికి అర్ధరాత్రి నిరసనకు పిలుపునిచ్చింది. జరిగిన తప్పిదానికి బేషరతుగా క్షమాపణ చెప్పడానికి సాహసించని కొందరు.. 'ఒంటరిగా ఎక్కడికీ వెళ్లకండి.. గుంపులుగా ఉండండి.. వెలుతురు ఉన్న చోటే గడపండి..' అని స్వతంత్ర దేశంలో మౌఖిక ఆంక్షలు విధించడం ఏంటని నిలదీయడానికి నిరసనకు పూనుకుంది.



సిన్హా పిలుపు సామాజిక మాధ్యమాల్లో జాతీయ గీతంలా మార్మోగింది. ఆమెతో ఎందరో గొంతు కలిపారు. అర్ధరాత్రి నిరసనలో భాగమయ్యేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. 'నేను నా వంతుగా నిరసన తెలపాలని భావించాను. అదే విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాను. ఆ క్షణం నుంచి నా ఫోన్‌కు తీరిక లేకుండా కాల్స్ వస్తూనే ఉన్నాయి. పదహారేండ్ల యువతులు కదం తొక్కుతామని చెబుతున్నారు. అరవై ఏండ్ల అమ్మలు కూడా 'నీ వెంట మేమున్నాం' అంటున్నారు' అని చెప్పుకొచ్చింది సిన్హా. సమాజంలో సింహభాగం ఆమె పక్షాన ప్రశ్నిస్తుంటే.. జవాబు చెప్పాల్సిన పదవిలో ఉన్న ఓ పురుష మంత్రి తన అల్పత్వాన్ని బయటపెట్టుకున్నాడు. 'నిరసన సరే.. ఆడవాళ్లంతా రోడ్డెక్కుతున్నారు మంచిదే! కానీ, మిమ్మల్ని మీ మొగుళ్లు కొడితే మా పూచీ లేదు' అని వ్యాఖ్యానించాడు. జాతిపిత ఆకాంక్షను, పిలుపును తమ ఊకదంపుడు ప్రసంగాల్లో తరచూ ఉటంకించే నేతలు.. రిమ్‌జిమ్ సిన్హా అడిగిన ప్రశ్నకు బదులు చెప్పకపోవచ్చు. చెప్పే ధైర్యం ఈ జన్మకు వాళ్లకు రాకపోవచ్చు. కానీ, ఈ నిరసన మాత్రం స్వతంత్ర భారతాన్ని కొత్త పోరాటానికి సన్నద్ధం చేస్తుందేమో! జై బోలో స్వతంత్ర్ భారత్ కీ.. జై!!

తొడగొట్టిన కట్టబొమ్మన్.. విల్లంబులు ఎక్కుపెట్టిన అల్లూరి.. మీసం మెలేసిన భగత్‌సింగ్.. ఇలా.. వందేమాతరం అన్న మొన్నటి తరంలో మేరునగ మగధీరులు ఎందరో! స్వాతంత్ర్యోద్యమ చరిత్రను పరికిస్తే.. నడుం బిగించి.. పగవాడికి మగవాడి కన్నా ప్రమాదకరం అని నిరూపించిన వీరనాయికలూ కనిపిస్తారు. ఆంగ్లేయుల కుత్తికలు కోసిన వీరమంగై.. నేతాజీ పిలుపు అందుకున్న శివగామి.. బాపూజీకి అండగా నిలిచిన బీ అమ్మ.. ఇలా మరెందరో! భారత స్వతంత్ర దినోత్సవ వేళ ... వారి చరిత్రను తలుచుకుందాం.. త్యాగాలను స్మరించుకుందాం...

వీరనాయికా జయహో!



తెల్లదొరలను ఓడించిన వీరమంగై

బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా రాజులు, సైనికుల పోరాటం అంటే మనకు 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటే గుర్తుకువస్తుంది. నానాసాహెబ్, రాణి లక్ష్మీబాయి లాంటివారి పేర్లే స్ఫూర్తి స్తాయి. కానీ, అంతకంటే చాలా ఏండ్ల ముందే స్వదేశీ రాజ్యాల పాలకులు బ్రిటిష్‌వారిపై పోరాటం చేశారు. రాణి కిత్తూరు చెన్నమ్మ, వీరపాండ్య కట్టబొమ్మన్ లాంటివారు ప్రసిద్ధి చెందారు. రాణి వేలు నాచ్చియార్ కూడా ఈ కోవలోకే వస్తారు. ఆమె 1730 జనవరి 3న తమిళనాడు రాష్ట్రం రామనాథపురంలో జన్మించారు. బ్రిటిష్‌వారిపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన తొలి భారతీయ పాలకురాలు వేలు నాచ్చియార్. అందుకే ఆమెను తమిళులు 'వీరమంగై' అని పిలుచుకుంటారు. బ్రిటిష్‌వారిపై పోరాటం కోసం ఆమె ఆయుధాలు పట్టడం, తమిళ పోరాట కళలైన వలరి, శిలంబం, గుర్రపు స్వారీ, విలువిద్యలను నేర్చుకున్నారు. అంతేకాదు ఆమె తన మాతృభాష తమిళంతోపాటు ఇంగ్లిష్, ఉర్దూ, ఫ్రెంచి కూడా మాట్లాడగలరు. వేలు నాచ్చియార్ వివాహం శివగంగై పాలకుడు ముత్తువడుగనాథపెరియ ఉడైయదేవర్‌తో జరిగింది. భర్త బ్రిటిష్‌వారి చేతుల్లో మరణించడంతో ఆమె స్వయంగా యుద్ధరంగంలో అడుగుపెట్టారు. మైసూరు పాలకుడు హైదర్ అలీ, గోపాల నాయకర్‌తో కలిసి ఆంగ్లేయులతో పోరాడారు. హోరాహోరీ పోరులో బ్రిటిష్ సైన్యంపై రాణి విజయం సాధించారు. అలా శివగంగై సంస్థానాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్నారు. 1780 నుంచి మరుదు సోదరుల సహకారంతో పరిపాలన కొనసాగించారు. దశాబ్దం తర్వాత వేలు నాచ్చియార్ కూతురు వెల్లాచ్చి సంస్థానాధీశురాలు అయింది. 1796 డిసెంబర్ 25న నాచ్చియార్ మరణించారు.

వయసులో చిన్న.. పోరాటంలో మిన్న

భారత స్వరాజ్య సమరంలో నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ ఆధ్వర్యంలో నడిచిన భారత జాతీయ సైన్యం పోరాటం ఆంగ్లేయులకు ముచ్చెమటలు పట్టించింది. సింగపూర్ నుంచి ప్రారంభమైన బోస్ పోరాటం బర్మా మీదుగా భారత దేశ సరిహద్దుల వరకు సాగింది. ఈ నేపథ్యంలో నేతాజీ ఉపన్యాసాలు ఎంతోమందిలో పోరాట స్ఫూర్తిని నూరిపోశాయి. ఆయన మాటలకు తూటాల్లా దూసుకెళ్లిన యోధుల్లో ఒకరు శివగామి అమ్మయ్యార్. ఆమె 1933లో తమిళనాడులోని ధర్మపురి జిల్లా అణ్ణాసాగరం గ్రామంలో జన్మించారు. మారిముత్తు ముదలియార్, చిన్నతాయి ఆమె తల్లిదండ్రులు. తన కుటుంబంతోపాటు శివగామి మలేసియాకు వలసవెళ్లారు. అక్కడ మారిముత్తు ఓ తేయాకు తోటలో పనిచేసేవారు. శివగామి మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో ఉన్న జై హింద్ హిందూ పాఠశాలలో చదువుకున్నారు. అదే సమయంలో భారత జాతీయ సైన్యం పోరాటం మొదలైంది. అప్పుడు సుభాష్ చంద్ర బోస్ ఉపన్యాసంతో స్ఫూర్తిపొందిన శివగామి, పదకొండేండ్ల వయసులోనే భారత జాతీయ సైన్యంలో భాగమైన 'బాలక్ సేన'లో చేరారు. అలా 1942– 1945 మధ్యకాలంలో శివగామి సాంఘిక సంక్షేమ వసతి గృహంలో కేర్‌టేకర్‌గా సేవలందించారు. ఆ సమయంలో ఆమె తన సోదరుడు పరంధామ్‌తో కలిసి 'వీరవనిత' అనే వీధి నాటకం ప్రదర్శించారు. వీధుల్లో ప్రదర్శనలు ఇస్తూ భారత జాతీయ సైన్యం కోసం నిధుల సేకరణ చేపట్టారు. స్థానిక ప్రజల్లో భారత స్వాతంత్ర్య పోరాటం గురించి ప్రచారం చేశారు. ఆమె గురించి తెలుసుకున్న నేతాజీ బర్మా రావాలని శివగామిని అడిగారు. కానీ, ఆమె అందుకు ఒప్పుకోలేదు. కాగా, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బాంబు దాడుల్లో గాయపడ్డవారిని తన సోదరుడితో కలిసి శివగామి కాపాడింది. అయితే, శివగామి ఆధ్వర్యంలో నడుస్తున్న వసతిగృహాన్ని 1943లో బ్రిటిష్ వాళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఆమెను బ్రిటిష్ అధికారుల ముందు డ్యాన్స్ చేయాలని సైనికులు ఒత్తిడి చేశారు. కానీ, ఆమె ధైర్యంగా అందుకు నిరాకరించారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో అతిపిన్న వయసులోనే దేశమాత స్వాతంత్ర్యం కోసం ఆరాటపడిన శివగామిని తమిళనాడు ప్రభుత్వం 1973లో 'త్యాగ చెమ్మాళ్' పురస్కారంతో గౌరవించింది.



స్వరాజ్య సాధనలో అమ్మ పాత్ర

ఇప్పుడు ఎక్కువమందికి ఆబాదీ బానో బేగం పేరు అంతగా తెలియకపోవచ్చు. ఆమె స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీతో కలిసి పోరాడిన అలీ సోదరుల (మౌలానా మహమ్మద్ అలీ, మౌలానా షౌకత్ అలీ) తల్లి. జాతీయోద్యమ చరిత్రలో ఆమె 'బీ అమ్మ'గా ప్రసిద్ధి చెందారు. అంతేకాదు, స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్న తొలి ముస్లిం మహిళగా పేరుగాంచారు. ఆమె 1850లో ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాలో జన్మించారు. రామ్‌పుర్ రాజ్యానికి చెందిన అబ్దుల్ అలీ ఖాన్‌ను పెళ్లి చేసుకున్నారు. అయితే ఆమె భర్త చిన్న వయసులోనే కలరాతో మరణించారు. తర్వాత బేగం తన నగలను పిల్లలు చదువుకోవడానికిగాను ఓ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు విరాళంగా ఇచ్చేశారు. తర్వాత కాలంలో ఆమె తన కొడుకులతో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో ప్రధాన ఘట్టాలైన ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఈ క్రమంలో లాహోర్‌లో జరిగిన ఓ సమావేశంలో ఆబాదీ బానో బేగం స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసం ఇచ్చారు. దేశం బ్రిటిష్ వారి చేతుల్లోకి వెళ్లడానికి భారతీయులు చేసిన పొరపాట్లను అందులో వివరించారు. అనీబిసెంట్, తన కొడుకులను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్ట్ చేసినప్పుడు... దానికి నిరసనగా జరిగిన ఓ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఖద్దరు ప్రాధాన్యం గురించి ప్రచారం చేశారు. హిందువులు ముస్లింల మధ్య ఐక్యతకు కృషిచేశారు. స్వరాజ్య సాధన కోసం భారతీయులంతా కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. గాంధీజీ ఆధ్వర్యంలో జరిగిన సహాయ నిరాకరణ ఉద్యమంలో బేగం పాట్నా, భగల్‌పుర్ మధ్య పర్యటించారు. అదే సమయంలో జరిగిన ఖిలాఫత్ ఉద్యమం కోసం ఆమె అరవైవేల రూపాయలు సేకరించారు. అలా 1924లో తాను మరణించేవరకు ఆబాదీ బానో బేగం దేశ స్వాతంత్ర్యం కోసం కృషిచేశారు. ఆమె స్మారకంగా దిల్లీలోని జామియా మిల్లియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలోని మహిళల వసతి గృహానికి 'బీ అమ్మ' పేరుపెట్టారు.



జెండా ఒంటినిండా...

మేరా ప్యారా తిరంగా జెండా... అని గుండెల నిండా పాడుకునే రోజు పంద్రాగస్టు. అరుణ భాస్కర కోటి కిరణాల కాంతితో ధగధగా మెరిసే మూడు రంగుల పతాకం... భారతావనిని ముద్దాడే రోజూ నేడే. ఆనాడు మువ్వన్నెలు ఎంతో ప్రత్యేకం. స్వతంత్ర పోరాటంలో పాల్గొనకపోయినా, ప్రతి గుండె దాన్ని అనుభూతి చెందే విశిష్ట సందర్భమిది. అందుకే ఈ రోజు మన ఒంటి మీదా మువ్వన్నెలు మెరవాలని ముచ్చట పడతాం. జెండా పండుగ మనలోనూ ప్రతిఫలించాలని ఆశ పడతాం. జనం మనసెరిగిన ఫ్యాషన్ ఈ సమయాన మువ్వన్నెల మువ్వ కడుతుంది. జెండా రంగుల్ని అభినయంగా ఆవిష్కరిస్తుంది. అందుకే దుస్తులు, నగలు త్రివర్ణ రాగాలు పాడతాయి. చుడీదార్, చీర, గౌన్లు మొదలు గాజులు, గొలుసులు, దుద్దులు, బ్రేస్‌లెట్ల దాకా అన్నింటా జెండా రంగులు రంజిల్లుతాయి. ఒక్క జెండా స్తంభానే కాదు, ఊరూవాడా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల్లో కళకళలాడుతూ కనిపిస్తాయి. భరతభూమి మువ్వన్నెల వసంతమాడుతుంది!



వారధి కట్టిన సీత

నిన్న మొన్నటి వరకు ఆమె పేరు దేశంలో చాలామందికి తెలియదు. కానీ ఇప్పుడు ఆ పేరు మహిళలతోపాటు అందరికీ స్ఫూర్తి. వయనాడ్ విపత్తు సమయంలో గంటల వ్యవధిలో వారధి నిర్మించిన జట్టుకు నేతృత్వం వహించారు మేజర్ సీతా షెల్కే. కేరళలో ప్రకృతి సృష్టించిన విధ్వంసంలో దాదాపు 300 మంది ప్రాణాలు కోల్పోయారు. వందలమంది క్షతగాత్రులయ్యారు. కొండచరియల కింద చిక్కుకున్నవారిని కాపాడేందుకు ఆర్మీ, నేవీ రంగంలోకి దిగాయి. చుట్టంతా బురద పేరుకుపోవడంతో సహాయక చర్యలు ముందుకుసాగలేదు. ఈ పరిస్థితుల్లో అతి తక్కువ సమయంలో 190 అడుగుల వంతెన నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు సీత. 36 గంటల్లో వారధి కట్టి సహాయక చర్యలకు ఆటంకం లేకుండా మార్గం చూపారు. బెంగళూరులోని మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్‌లో మేజర్ సీతా షెల్కే ఏకైక మహిళా అధికారి. ఈ గ్రూప్‌నే మద్రాస్ సాపర్స్ అని పిలుస్తారు. మహారాష్ట్రలోని గాడిల్‌గావ్‌లో ఆమె జన్మించారు. మెకానికల్ ఇంజినీరింగ్ చదివారు. ఐపీఎస్ కావాలన్న లక్ష్యం నెరవేరలేదు. అయినా నిరుత్సాహపడకుండా సైన్యంలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఎస్‌ఎస్‌బీ పరీక్షలో రెండుసార్లు విఫలమైనా.. పట్టుదలతో మూడోసారి ప్రయత్నించి విజయం సాధించారు. శిక్షణ పూర్తిచేసుకొని 2012లో సైన్యంలో చేరారు. సైన్యంలో మగవారికి దీటుగా మహిళలు కూడా రాణించగలరని నిరూపించారు మేజర్ సీతా షెల్కే.





ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న అప్పటి సీఎం కేసీఆర్, అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

ఫాక్స్‌కాన్ తొలిదశ ప్రారంభానికి సిద్ధం

- దీనిద్వారా 20వేల మందికి ఉపాధి
- రెండో దశ పూర్తయితే 80వేల మందికిపైగా అవకాశాలు : ఎక్స్ వేదికగా కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ఫాక్స్‌కాన్ సంస్థ తొలిదశ నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో ఆ కంపెనీ విస్తరణ ప్రణాళికలు ఎంతవరకు వచ్చాయో తెలియవని పేర్కొన్నారు. 1.6 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో మొదటి దశ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయిందని, ఇందులో దాదాపు 20 వేల మందికి పైగా ఉపాధి దొరుకుతుందని వివరించారు. బుధవారం సోషల్ మీడియాలో ముత్తుకృష్ణన్ సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్ చేసిన ట్వీట్‌పై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఫాక్స్‌కాన్ సంస్థ రెండో దశలో 6.8 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో $582 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలనే ఆలోచన ఉన్నదని తనకు తెలిసిందని చెప్పారు. రెండో దశ తర్వాత సంస్థలో మొత్తం 80 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అదనంగా 400 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలనే ఉద్దేశం కూడా ఉన్నదని, కానీ అక్కడ ఏం జరుగుతున్నదో తనకు పూర్తి సమాచారం తెలిదని కేటీఆర్ పేర్కొన్నారు. ఫాక్స్‌కాన్‌కు సంబంధించి 2023లో కేసీఆర్ నాయకత్వంలో అవగాహన ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు.

ప్రజల ప్రాణాలతో సర్కార్ చెలగాటం

- పల్లె ప్రగతికి పాతర.. పట్టణ ప్రగతి మాయం
- నిధులు లేక సంక్షోభంలో చిక్కుకున్న స్థానిక సంస్థలు
- 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన 500 కోట్లు పంచాయతీలకు ఎప్పుడు ఇస్తారు?
- ఉపాధిహామీ, హెల్త్ మిషన్ నుంచి వచ్చిన 2,100 కోట్లు ఎందుకు దారి మళ్లించారు?
- మున్సిపాలిటీలకు 1,200 కోట్లకుపైగా బాకీ
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



> బీఆర్‌ఎస్ హయాంలో పదేండ్లు పచ్చగా కళకళలాడిన పల్లెలు, ప్రగతిపథంలో దూసుకుపోయిన పట్టణాలు.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇది కాంగ్రెస్ అసమర్థతకు, పాలనా వైఫల్యాలకు నిలువెత్తు నిదర్శనం. మీ చేతకానితనాన్ని తెలంగాణ సమాజం గమనిస్తున్నదన్న విషయాన్ని మరచిపోవద్దు. -కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన అంటే గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. నిధులు లేక, పెండింగ్ బిల్లులు రాక పంచాయతీలు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నాయని, పల్లెలు, పట్టణాలు కంపు కొడుతున్నాయని విమర్శించారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందంటూ బుధవారం ఆయన ఎక్స్ వేదికగా ఆరోపించారు. పల్లెలపై ఎందుకింత నిర్లక్ష్యమని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల్లో పాలన పడకేసిందని, పట్టణాల్లో పరిస్థితి అధ్వానంగా మారిందని దుయ్యబట్టారు. పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణను పట్టించుకోకపోవటంతో పల్లెల్లో ప్రజల జీవనం దినదిన గండంలా మారిందని, దోమల మందుకు కూడా నిధులు లేకపోవడంతో డెంగ్యూ, మలేరియా లాంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రం నుంచి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో పంచాయతీల నిర్వహణ తీవ్ర సంక్షోభంలో పడిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

అప్పుల ఊబిలో మాజీ సర్పంచ్‌లు

పంచాయతీల్లో పాత పనుల బిల్లులు చెల్లించడం లేదని, దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన తాజా మాజీ సర్పంచ్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి నెలా పంచాయితీలకు ఠంచన్‌గా రూ.275 కోట్లు విడుదల చేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగిన పాపానికి 1,800 మంది మాజీ సర్పంచ్‌లపై నిర్బంధాలు ప్రయోగిస్తూ, అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. 15వ ఆర్థిక సంఘం నుంచి అందిన రూ.500 కోట్ల నిధులను గ్రామ పంచాయతీలకు ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. ఉపాధి హామీ పథకం, హెల్త్ మిషన్ నుంచి వచ్చిన రూ.2,100 కోట్ల కేంద్ర నిధులను ఎందుకు దారి మళ్లించారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మొత్తం 12,769 పంచాయతీల్లో పేరుకుపోయిన విద్యుత్తు బకాయిలే రూ.4,305 కోట్లు ఉన్నాయని, వాటి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో పల్లెల్లో పాలన పూర్తిగా పడకేస్తే.. పట్టణాలు పెను సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాపాలనలో పల్లెప్రగతికి పాతరేసి.. పట్టణప్రగతిని అడ్రస్ లేకుండా చేసిన మాట నిజం కాదా? అని నిలదీశారు. మున్సిపాలిటీల్లో కనీసం అత్యవసర మరమ్మతులకు కూడా పైసలు లేకపోవడం దుర్మార్గం కాదా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

పట్టణ సంస్థల్లో జీతాలు ఇవ్వలేని దుస్థితి

మున్సిపాలిటీల్లో రూ.1,200 కోట్లకుపైగా ఉన్న పెండింగ్ బిల్లులను ఎప్పుడు విడుదల చేస్తారని కేటీఆర్ నిలదీశారు. ముఖ్యమంత్రే స్వయంగా పర్యవేక్షిస్తున్న మున్సిపల్ శాఖకే ఈస్థాయిలో నిధుల కొరత ఉంటే, ఇతర శాఖల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తంచేశారు. గ్రేటర్‌తోపాటు రాష్ట్రంలోని 12 కార్పొరేషన్లు, 129 మున్సిపాలిటీల్లో కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి ఉన్నదని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీకి అరకొర నిధులు కేటాయించడంతో అభివృద్ధి పనులు పూర్తిగా మూలనపడిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. 'ఆగస్టు 15లోపు బకాయిలు చెల్లించకపోతే ఆందోళనకు సిద్ధమవుతున్న మున్సిపల్ కాంట్రాక్టర్ల కష్టాలను తీర్చే తీరిక ప్రభుత్వానికి ఉన్నదా? కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నుంచి పురపాలక శాఖను ఇప్పటికైనా గట్టెక్కించే ధైర్యం ఉన్నదా? మున్సిపాలిటీల్లో దెబ్బతిన్న రోడ్లు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టే ఆలోచన ఉన్నదా?' అని నిలదీశారు.

లంబాడాలకు మంత్రి పదవి ఇవ్వాలి

- లేదంటే సీఎం ఇంటిని ముట్టడి
- గిరిజన విద్యార్థి సంఘం నేత

ఖైరతాబాద్, ఆగస్టు 14: లంబాడాల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు, వారికి ఒక్క మంత్రి పదవిని కూడా కేటాయించకుండా అవమానిస్తున్నదని, తక్షణమే లంబాడాలకు మంత్రి పదవి ఇవ్వాలని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ బంజారా డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 40 లక్షల మంది లంబాడా జనాభా ఉన్నదని, తమను ఏదో ఉద్ధరిస్తుందని కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపిస్తే ఇప్పుడు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో తండాలను పంచాయతీలుగా మార్చారని, ప్రతి పంచాయతీకి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ఆంధ్రా పెట్టుబడిదారీ విధానం వల్ల ఎస్సీ, ఎస్టీల విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని, దీన్ని నిరసిస్తూ ఈ నెల 29న రెండు కార్పొరేట్ విద్యాసంస్థలను ముట్టడిస్తామని, గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వకుంటే అక్టోబర్ 1న సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర క్యాబినెట్ మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని చెప్పారు.

నందినికి సాయమేది?

- ఏషియన్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన క్రీడాకారిణి
- ఇంటిస్థలం ఇవ్వాలని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ఏషియన్ గేమ్స్‌లో కాంస్యం సాధించిన అగసార నందినికి సాయమెందుకివ్వలేదని రాష్ట్రప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. రెజ్లర్ ఫొగాట్‌కు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ అండగా ఉంటామని చెప్పారని, కానీ రాష్ట్రంలో ఓ అథ్లెట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. అథ్లెట్ అంటే సర్కారుకు చిన్నచూపా? అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ సిరాజ్, ఈషా సింగ్ లాంటి వాళ్లతో పోలిస్తే నందిని పతకాలు తక్కువేం కాదని స్పష్టం చేశారు. కేవలం సంక్షేమ పాఠశాలలో చదివిందని, ఆమె తండ్రి ఇప్పటికీ రజక వృత్తిలో ఉన్నాడనే ఆమె విజయాలు కాంగ్రెస్ సర్కారుకు తక్కువగా కనిపిస్తున్నాయా? అని ప్రశ్నించారు. అందరిలాగానే తనకూ పారితోషికం, హైదరాబాదులో ఇంటిస్థలం కేటాయించమని నందిని సాక్షాత్తు ముఖ్యమంత్రిని కలిసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. క్రీడాకారిణి నందినికి కూడా నగదు బహుమతి ఇవ్వాలని, ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి. చిత్రంలో బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్

పాత గోడకు కొత్త సున్నం

రేవంత్ విదేశీ పర్యటనపై బీఆర్‌ఎస్ నేత వ్యాఖ్య • సీఎం పర్యటనపై శ్వేతపత్రం ప్రకటించాలి: విష్ణువర్ధన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన పాత గోడకు కొత్త సున్నం కొట్టినట్టు ఉన్నదని బీఆర్‌ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రెండేండ్ల క్రితమే కాగ్నిజెంట్ సంస్థ తమ క్యాంపస్ విస్తరణకు ప్రణాళిక వేసిందని, ఆ విషయాన్ని ఆ సంస్థే ట్వీట్ చేసిందని తెలిపారు. సీఎం రేవంత్ యూఎస్ పర్యటనకూ కాగ్నిజెంట్‌లో ఆయన కార్యక్రమానికి సంబంధం లేదని చెప్పారు. తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి విష్ణువర్ధన్ మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనపై శ్వేత పత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. విదేశీ పర్యటనలో వచ్చాయని చెబుతున్న పెట్టుబడులపై అనేక అనుమానాలు ఉన్నాయని ఆయన అన్నారు. గతంలో కేటీఆర్ పర్యటనల సందర్భంగా రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, లక్షల ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. కేటీఆర్ పర్యటనలను బీఆర్‌ఎస్ ఎప్పుడూ పబ్లిసిటీ కోసం వాడుకోలేదని అన్నారు. రేవంత్ పర్యటనలో మంత్రి శ్రీధర్‌బాబు ఉత్సవ విగ్రహంగా మారారని ఎద్దేవాచేశారు. జేఎస్‌డబ్ల్యూ, వెబ్‌వర్క్స్ అనే కంపెనీలతో కేసీఆర్ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంటే వాటినే మళ్లీ రేవంత్ దావోస్‌లో కుదుర్చుకున్నారని తెలిపారు. సీఎం తాజా టూర్‌తో రూ.31,500 కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్తున్నారని, ఆ లెక్క మతలబు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్న వారిలో చంద్రబాబు దోస్తులు ఉన్నారని చెప్పారు. రేవంత్ విదేశీ పర్యటన ద్వారా ఏ ఏ రూపాల్లో ఎన్ని పెట్టుబడులు సమకూరాయో శ్వేత పత్రం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ లోపాలను బయటపెడుతున్న బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలను కాంగ్రెస్ నేతలు, పోలీసులు బెదిరిస్తున్నారని చెప్పారు. రేవంత్ ఇప్పటికైనా గుంపు మేస్త్రీ తీరు ప్రచారాన్ని తగ్గించి ప్రజా సమస్యలపై దృష్టి పెడితే మంచిదని హితవు చెప్పారు.



హెడ్ కానిస్టేబుల్ యాదయ్యకు రాష్ట్రపతి మెడల్

- ఈసారి తెలంగాణకు మాత్రమే పీఎంజీ అవార్డు
- వివిధ విభాగాల్లో రాష్ట్రానికి 29 పతకాలు
- ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్, సీపీ అవినాశ్ మొహంతికి మెడల్స్
- హెచ్‌సీ యాదయ్యను అభినందించిన డీజీపీ
- నాటి వీరోచిత పోరాటానికి దక్కిన గుర్తింపు

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : మాదాపూర్ సీసీఎస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ చదువు యాదయ్యను భారత ప్రభుత్వం ప్రెసిడెంట్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ (పీఎంజీ) అవార్డుతో గౌరవించింది. ఈ మేరకు డీజీపీ జితేందర్ బుధవారం తన కార్యాలయంలో పీఎంజీ మెడల్ పొందిన యాదయ్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఈ ఏడాది దేశంలోనే ఈ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ఏకైక వ్యక్తి హెడ్ కానిస్టేబుల్ యాదయ్య కావడం తెలంగాణ పోలీసులకు గర్వకారణమని కొనియాడారు. పీఎంఎస్ మెడల్ అందుకోబోతున్న ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్‌ను సైతం డీజీపీ అభినందించారు. పోలీసు, ఫైర్, హోంగార్డ్స్ వంటి విభాగాల్లో తెలంగాణకు మొత్తం 29 మెడల్స్ వచ్చాయి. వీటిల్లో తెలంగాణకు ప్రెసిడెంట్స్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ 1, మెడల్ ఫర్ గ్యాలంట్రీ పోలీసు సర్వీసులో 7, ప్రెసిడెంట్స్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ 3, (పోలీసు 2, ఫైర్ 1), మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ 18 (పోలీసు 11, ఫైర్ 2, హోంగార్డ్స్ 5) వచ్చాయి. దేశవ్యాప్తంగా ఒక పీజీఎం, 213 గ్యాలంట్రీ మెడల్స్, 94 పీఎస్‌ఎం, 729 ఎంఎస్‌ఎం మెడల్స్‌ను పోలీసు, ఫైర్, హోంగార్డ్స్ అండ్ సివిల్ డిఫెన్స్, కరెక్షనల్ సర్వీసెస్‌లో ప్రకటించారు. తెలంగాణలో ప్రెసిడెంట్స్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ (పీఎస్‌ఎం) అందుకునే వారిలో టీజీఎస్పీ ఏడీజీ సంజయ్ కుమార్ జైన్, డీసీపీ కటకం మురళీధర్, అగ్నిమాపక శాఖ డ్రైవర్ ఆపరేటర్ కందిమళ్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.



యాదయ్యను అభినందిస్తున్న డీజీపీ జితేందర్

గ్యాలంట్రీ మెడల్ పొందిన వారిలో ఖమ్మం కమిషనర్ సునీల్ దత్ ఐపీఎస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మోర కుమార్, ఆర్‌ఎస్‌ఐ శనిగరపు సంతోష్, కానిస్టేబుళ్లు అమిలి సురేశ్, వేముల వంశీ, కాంపాటి ఉపేందర్, పాయం రమేశ్ ఉన్నారు.

మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీసెస్ మెడల్స్..

మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీసెస్ మెడల్స్ అందుకునే వారిలో పోలీసుశాఖ నుంచి సైబరాబాద్ సీపీ అవినాశ్ మొహంతి, కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా, ఏఎస్పీ పీ కృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ నూతలపాటి జ్ఞానసుందరి, ఎస్సైలు కొమరబత్తిని రాము, అబ్దుల్ రఫీక్, ఇక్రం ఏబీ ఖాన్, శ్రీనివాస మిశ్రా, కుంచాల బాలా కాశయ్య, ఏఎస్సైలు ఏ లక్ష్మయ్య, గుంటి వెంకటేశ్వర్లు ఉన్నారు. అగ్నిమాపకశాఖ విభాగంలో లీడింగ్ ఫైర్‌మెన్లు తెలుగు మాధవరావు, వహీదుద్దీన్ మహ్మద్ ఉన్నారు. హోంగార్డ్స్ అండ్ సివిల్ డిఫెన్స్ నుంచి హోంగార్డులు బందోళ్ల లక్ష్మి, మేడిపల్లి మల్లేశ్, ఇంటూరి కవిత, నామాల గాలయ్య, ఇనుముల సుమలత ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ యాదయ్యను సన్మానించిన కార్యక్రమంలో ఏడీజీలు సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్, ఐజీ ఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదీ యాదయ్య వీరోచిత గాథ..


అది.. 2022 జూలై 25. మాదాపూర్ జోన్‌లో సాయంత్రం ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న కే కాత్యాయని అనే 72 ఏండ్ల మహిళ మెడలోంచి బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. కాత్యాయని స్థానిక సీసీఎస్‌లో చైన్ స్నాచింగ్ జరిగినట్టు ఫిర్యాదు చేసింది. వారిని పట్టుకోవాలనే ఉద్దేశంతో సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ చదువు యాదయ్య తోటి కానిస్టేబుళ్లు ఎం రవి, ఏ దేభాశ్ సహకారంతో సెర్చింగ్ ఆపరేషన్ ప్రారంభించారు. కాత్యాయని చెప్పిన గుర్తుల ఆధారంగా మరుసటి రోజు (2022, జూలై 26)న బొల్లారం క్రాస్‌రోడ్డు వద్ద కానిస్టేబుల్ ఎం కృష్ణ వారి జాడ కనుగొని వెంటనే యాదయ్య టీమ్‌కు సమాచారం ఇచ్చాడు. నిమిషాల్లోనే అక్కడికి చేరుకున్న యాదయ్య బృందం చైన్ స్నాచింగ్‌లో కరుడుగట్టిన ఇషాన్ నిరంజన్, రాహుల్‌ను అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. దీంతో నేరస్తులు కత్తులతో దాడికి తెగబడ్డారు. ఈ క్రమంలో యాదయ్య ఛాతి, వీపు, చెయ్యి, కడుపు భాగాల్లో అనేకచోట్ల గాయాలైనా సర్వశక్తులూ ఒడ్డి పట్టుకున్నాడు. 'యాదయ్య అచంచలమైన స్ఫూర్తి, విధి నిర్వహణ ప్రతిపోలీసుకు ఆదర్శం' అని డీజీపీ జితేందర్ కొనియాడారు.

ఇద్దరు ఆర్‌పీఎఫ్ సిబ్బందికి పోలీస్ మెడల్స్

దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్)కు చెందిన ఇద్దరు సిబ్బంది విశిష్ట సేవలకు గాను పోలీస్ మెడల్స్‌కు ఎంపికయ్యారు. మెడల్స్ అందుకునే వారిలో హైదరాబాద్ డివిజనల్ రైల్వేకు చెందిన కామారెడ్డి ఆర్‌పీఎఫ్ (ఏఎస్‌ఐ) జే సుధాకర్, విజయవాడ డివిజనల్‌కు చెందిన ఏఎస్‌ఐ నయింబాషా షేక్ ఉన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

హిమాయత్‌నగర్, ఆగస్టు 14: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కులగణన చేపట్టిన తర్వాత బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. మహాత్మా జ్యోతిరావు పూలే పేరిట బీసీ సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేసి బీసీ యువతకు రూ.10 లక్షల రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు గిరిగాని భిక్షపతి, దాసరిమూర్తి, సంయుక్త కార్యదర్శి సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరి పాల్గొన్నారు.



ఆ ప్రచారాన్ని నమ్మొద్దు



అగ్ర హీరో ఎన్టీఆర్ జిమ్‌లో వర్కవుట్స్ చేస్తుండగా తీవ్రంగా గాయపడ్డారంటూ బుధవారం మీడియాలో వార్తలొచ్చాయి. ఆయన పెద్దప్రమాదం బారిన పడ్డారని సోషల్ మీడియాలో కూడా ప్రచారం జరిగింది. వీటిపై ఎన్టీఆర్ వ్యక్తిగత బృందం స్పందించింది. మీడియాలో ప్రచారం అయిన వార్తల్లో ఏమాత్రం నిజం లేదని, ఆయన సురక్షితంగా ఉన్నారని స్పష్టం చేసింది. 'రెండు రోజుల క్రితం జిమ్‌లో వర్కవుట్స్ చేస్తుండగా ఎన్టీఆర్ ఎడమచేతికి చిన్న గాయమైంది. ప్రాథమిక చికిత్స తీసుకున్న తర్వాత మంగళవారం ఆయన 'దేవర' షూటింగ్‌లో కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ కోలుకుంటున్నారు. మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని అభిమానులు నమ్మొద్దని కోరుతున్నాం' అని ఎన్టీఆర్ టీమ్ పేర్కొంది. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'దేవర' షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది.



ఎక్కడ చూసినా 'ఆయ్' సందడే..!

'ఈ కథ నా దగ్గరకు వచ్చినప్పుడు 'కొడితే పదిమంది కింద పడే కథ కాదు కదా? అనడిగాను. ఎంత గొప్ప ఫ్యామిలీ నుంచి వచ్చినా ఎవరి కష్టం వారు పడాలని ఎన్టీఆర్ ఓ సందర్భంలో అన్నారు. నార్నే నితిన్ కూడా ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు' అన్నారు అగ్ర నిర్మాత అల్లు అరవింద్. ఆయన సమర్పకుడిగా తెరకెక్కిన చిత్రం 'ఆయ్'. ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటించిన ఈ చిత్రానికి అంజి కే మణిపుత్ర దర్శకుడు. జీఏ2 పిక్చర్స్ పతాకంపై బన్నీవాసు, విద్యా కొప్పినీడు నిర్మించారు. నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. మంగళవారం హీరో నిఖిల్, శ్రీలీల ముఖ్య అతిథులుగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన హీరో నిఖిల్..సోషల్‌మీడియాతో పాటు బయట ఎక్కడ చూసినా 'ఆయ్' సందడే కనిపిస్తున్నదని, ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ కావాలని ఆకాంక్షించారు. 'ఈ కథ విన్నప్పుడు 'జాతిరత్నాలు' సినిమా గుర్తుకొచ్చింది. నార్నే నితిన్ అంకితభావంతో పనిచేశాడు' అని నిర్మాత బన్నీ వాసు తెలిపారు. ఈ కథ విన్న తర్వాత అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి ఎంతగానో ఎంకరేజ్ చేశారని, ఈ ప్రపంచంలో కులాలు, మతాల కంటే స్నేహమే గొప్పదనే అంశాన్ని ఈ సినిమాలో చూపించామని హీరో నార్నే నితిన్ పేర్కొన్నారు.

క్రీడా నేపథ్యంలో..



సీనియర్ నటుడు శివాజీరాజా తనయుడు విజయ్ రాజా హీరోగా నటిస్తున్న చిత్రం 'జీరో'. లక్ష్మీనారాయణ సి దర్శకుడు. ఆర్.లక్ష్మణ్‌రావు, ఆర్.శ్రీను నిర్మిస్తున్నారు. బుధవారం టైటిల్ ప్రకటనతో పాటు గ్లింప్స్‌ని ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి విడుదల చేశారు. లవ్, ఫ్యామిలీఎమోషన్స్ ప్రధానంగా స్పోర్ట్స్ నేపథ్య కథాంశమిదని దర్శకుడు తెలిపారు. జీవితంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక దశలో స్పోర్ట్స్ ఆడే ఉంటారని, వారందరికి స్ఫూర్తినిచ్చే ఇతివృత్తమని నిర్మాతలు పేర్కొన్నారు. స్ఫూర్తివంతమైన కథగా ఆకట్టుకుంటుందని హీరో విజయ్‌రాజా అన్నారు. రాజేంద్రప్రసాద్, ఆమని, శివాజీరాజా, సంపత్‌రాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాయికార్తీక్.

బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధం



అచ్చ తెలుగు అందం శ్రీలీల అనతికాలంలోనే తెలుగు చిత్రసీమలో అగ్ర నాయికగా ఎదిగింది. అయితే ఈ అమ్మడు నటించిన చిత్రాలు ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోవడంతో రేసులో కాస్త వెనకబడింది. అయినా ఈ భామకు మంచి అవకాశాలే వస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం శ్రీలీల బాలీవుడ్ అరంగేట్రానికి రంగం సిద్ధమైనట్లు తెలిసింది. సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా నటించబోతున్న 'మిట్టీ'లో ఆమె కథానాయికగా ఎంపికైందని వార్తలొస్తున్నాయి. బల్వీందర్‌సింగ్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనుల్లో ఉంది. అక్టోబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఈ సినిమా కోసం శ్రీలీలతో సంప్రదింపులు పూర్తయ్యాయని, కథలోని కొత్తదనం నచ్చడంతో ఆమె అంగీకారం తెలిపిందని సమాచారం. శ్రీలీల ప్రస్తుతం తెలుగులో నితిన్‌తో 'రాబిన్‌హుడ్' చిత్రంలో నటిస్తున్నది. రవితేజ 75వ చిత్రంలో కూడా ఆమే కథానాయిక.



ఉమ సందేశం

సుమయా రెడ్డి కథానాయికగా నటిస్తున్న చిత్రం 'డియర్ ఉమ'. ఈ సినిమాకు ఆమె కథనందించడంతో పాటు నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నది. సాయి రాజేష్ మహాదేవ్ దర్శకుడు. పృథ్వీ అంబర్ హీరోగా నటిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ ఇది. ఓ జంట ప్రేమ ప్రయాణానికి అందమైన దృశ్యరూపంగా మెప్పిస్తుంది. మంచి సందేశం కూడా ఉంటుంది ' అన్నారు.

సామాన్యుడి 'పరాక్రమం'

స్వీయ దర్శకత్వంలో బండి సరోజ్‌కుమార్ హీరోగా నటిస్తున్న చిత్రం 'పరాక్రమం' ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం ట్రైలర్‌ను హీరో సందీప్‌కిషన్ ఆవిష్కరించారు. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ 'కామన్ మ్యాన్‌కు కనెక్ట్ అయ్యే కథాంశమిది. ఈ కథ మనల్ని మనం తెరపై చూసుకున్న అనుభూతినిస్తుంది' అన్నారు. బండి సరోజ్‌కుమార్ అద్భుతమైన ప్రతిభావంతుడని, అతని వ్యక్తిత్వం కూడా గొప్పదని సందీప్‌కిషన్ ప్రశంసించారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకట్ ఆర్ ప్రసాద్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, సంగీతం, నిర్మాత, దర్శకుడు: బండి సరోజ్‌కుమార్.



పొల్లాచ్చిలో యాక్షన్ షురూ



అగ్ర హీరో వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఎఫ్-2, ఎఫ్-3 చిత్రాల తర్వాత వీరిద్దరి కలయిలో రాబోతున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కేరళలోని పొల్లాచ్చిలో జరుగుతున్న షూటింగ్‌లో హీరో వెంకటేష్ జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని మాజీ పోలీస్ అధికారిగా పరిచయం చేస్తూ స్పెషల్‌వీడియోను విడుదల చేశారు. నెలరోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో టాకీ పార్ట్‌తో పాటు సాంగ్స్ తెరకెక్కించబోతున్నారు. హీరో, ఆయన భార్య, మాజీ ప్రేయసి మధ్య నడిచే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్ ఇదని, ఆద్యంతం వినోదప్రధానంగా ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్యరాజేష్ కథానాయికలుగా నటిస్తున్నారు.

కెరీర్‌లోనే బెస్ట్‌రోల్ చేశాను

వాణిజ్య పంథాలోనే ప్రయోగాత్మక చిత్రాలు చేయడంలో సిద్ధహస్తుడు అగ్ర హీరో విక్రమ్. శివపుత్రుడు, అపరిచితుడు, నాన్న, ఐ వంటి చిత్రాలు నటుడిగా ఆయన ప్రతిభను చాటిచెప్పాయి. ఆయన తాజా చిత్రం 'తంగలాన్' నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. కోలార్ బంగారు గనుల నేపథ్యంలో పీరియాడిక్ కథాంశంతో తెరకెక్కించారు. పా.రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్‌రాజా నిర్మించారు. చిత్ర విడుదలను పురస్కరించుకొని హీరో విక్రమ్ పంచుకున్న విశేషాలు...



- **'తంగలాన్'** హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో పాటు రా కంటెంట్‌తో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుంది. సాధారణ సినిమా సూత్రాలు, గ్రామర్‌ను పక్కనపెట్టి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాలో ఓ విస్తారమైన జీవితం కనబడుతుంది.
- 'తంగలాన్' అన్నది ఓ తెగ పేరు. ఇందులో బంగారం వేట అన్నది కథలో ప్రధానంగా కనిపించినా..వాస్తవంగా ఇది స్వేచ్ఛ, సమానత్వం కోసం ఆ తెగ చేసిన పోరాటం, త్యాగాలకు అద్దం పడుతుంది. ఆకలి, అసమానతలను మనందరం జీవితంలో ఎప్పుడో ఓసారి ఎదుర్కొనే ఉంటాం. అందుకే ప్రతి ఒక్కరికి ఈ కథ కనెక్ట్ అవుతుంది.
- దర్శకుడు పా.రంజిత్ రా కంటెంట్‌కు తనదైన కళాత్మకతను జోడించి భావోద్వేగభరితంగా చిత్రాన్ని తీర్చిదిద్దాడు. ఈ సినిమాలో అడ్వెంచర్‌తో పాటు అంతర్లీనంగా గొప్ప సందేశం ఉంటుంది. నా కెరీర్‌లో ఇప్పటివరకు చేసిన బెస్ట్‌రోల్ ఇదే అనుకుంటున్నా. భిన్న కోణాలు కలిగిన రెండు పాత్రల్లో చాలా సహజంగా కనిపించేందుకు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నా. ఆహారం లేక చిక్కిశల్యమయ్యే పరిస్థితుల్లో హీరో దృఢంగా కనిపిస్తే పాత్రలో సహజత్వం లోపిస్తుంది. అందుకే ఆ పాత్ర కోసం పూర్తిగా సన్నబడి కనిపించాను.
- షూటింగ్ టైమ్‌లో మేకప్ కోసమే గంటల కొద్ది సమయం పట్టేది. మళ్లీ మేకప్ తొలగించుకునేందుకు రెండు గంటలు అయ్యేది. తీవ్రమైన చలి, వేడిని భరిస్తూ షూటింగ్‌లో పాల్గొన్నా. మనకు ఇష్టమైన పని దొరికినప్పుడు ఆకలి, నిద్ర మరచిపోతాం. మిగతా విషయాలేవీ పట్టించుకోం. ఈ కథలోని ఇంటెన్సిటీ నచ్చడంతో షూటింగ్ పరమైన ప్రతికూలతల గురించి ఏమాత్రం ఆలోచించకుండా పాత్రలో లీనమై నటించా.
- ఇది కేవలం పాన్ ఇండియా సినిమా కాదు. పాన్ వరల్డ్‌కు రీచ్ అయ్యే కథ. ఆ స్థాయిలో దర్శకుడు పా.రంజిత్ ఈ చిత్రాన్ని మలిచాడు. నిర్మాత జ్ఞానవేల్‌రాజా నిర్మాణపరంగా ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. సినిమాలోని ప్రతి సన్నివేశం అద్భుతంగా ఉంటుంది. ప్రేక్షకులను ఓ సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది.



నిజామాబాద్‌లోని జీజీహెచ్‌లో ఆందోళన చేస్తున్న జూడాలు

'కోల్‌కతా' నిందితులను కఠినంగా శిక్షించాలి

- రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల నిరసన
- వైద్యుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్

వరంగల్ చౌరస్తా/ఖలీల్‌వాడి/మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 14: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ హాస్పిటల్ అండ్ మెడికల్ కళాశాల ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. వరంగల్, జనగామ, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో బుధవారం నిరసనలు తెలిపారు. వరంగల్ ఎంజీఎంలోని డాక్టర్లు విధులు బహిష్కరించి దవాఖానలోని గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. జూనియర్ డాక్టర్ల ధర్నాకు ఐఎంఏ సభ్యులు, నర్సింగ్ విద్యార్థులు మద్దతు తెలిపారు. జనగామలోని ఆర్టీసీ చౌరస్తాలో డాక్టర్స్ అసోసియేషన్, జూనియర్ డాక్టర్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నిజామాబాద్‌లోని జీజీహెచ్‌లో వైద్యులు, వైద్య విద్యార్థులకు భద్రత కల్పించాలని జూనియర్ డాక్టర్లు దవాఖాన ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌ను హతమార్చిన ఘటనను నిరసిస్తూ.. మహబూబ్‌నగర్‌లో మెడికోలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో జనరల్ వార్డును పరిశీలించి సూపరింటెండెంట్, వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సర్కారు దవాఖానల్లో కలెక్టర్ల తనిఖీలు

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు దవాఖానల పరిశీలన
- వార్డుల్లో పర్యటన.. మందులు, వైద్య సేవలపై వాకబు

నమస్తే ఎఫెక్ట్

సూర్యాపేట/నీలగిరి/ఆలేరు రూరల్, ఆగస్టు 14: 'సర్కారు దవాఖానలకు సమస్యల సుస్తీ' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో బుధవారం ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కలెక్టర్లు, ఇతర అధికారులు దవాఖానల్లో తనిఖీ చేసి సమస్యలపై ఆరా తీశారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి రోగులకు అందుతున్న వైద్యం, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం వార్డుల్లో తిరిగారు. సూపరింటెండెంట్‌ను అడిగి మందుల వివరాలను తెలుసుకున్నారు. తుంగతుర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లను పరిశీలించి వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.

ముమ్మాటికీ గుడ్డి దర్బారే!

మొదటిపేజీ తరువాయి...

అధికారిక ఉత్తర్వుల్లో అంగీకరించింది. ఏడో తేదీన తమ దృష్టికి వచ్చినట్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో 'అసలు ప్రభుత్వానికి ఈ విషయం తెలియకపోతే మాత్రం అది సిగ్గుచేటు' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పింది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



ఇతర అంశాలను పరిశీలిస్తే..

- రెండో తేదీన సంఘటన జరుగగా ఇంజినీర్లు వాస్తవానికి పంపుహౌస్‌లోకి నీళ్లు వచ్చాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కానీ వాళ్లు ఈ అంశంపై లోతుగా వాకబు చేయలేదు. ముఖ్యంగా సీపేజ్ వాటర్ వచ్చిందంటూ ప్రచారం చేయడంతో ఇతర ఇంజినీర్లు కూడా పెద్దగా పట్టించుకోలేదు. మరి సైట్ ఇంజినీర్లుగాని, ఏజెన్సీగాని ఘటనను ఎందుకు తొక్కిపెట్టి, సీపేజ్ వాటర్ అని ప్రచారం చేశారనేది తేలాల్సి ఉన్నది.
- 'నమస్తే తెలంగాణ' ఈ నెల ఏడో తేదీన ఘటనాస్థలికి వెళ్లి పరిశీలన చేసి ఎనిమిదో తేదీన వీడియో, వివరాలను వెలుగులోకి తెచ్చింది. తర్వాత అటు సర్కారు, ఇటు జలమండలిలో హడావుడి మొదలైంది. కాగా ఈ నెల ఏడో తేదీన ఈ అంశం తమ దృష్టికి వచ్చిందని బుధవారం జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొనడం హాస్యాస్పదంగా ఉన్నదని పలువురు విమర్శిస్తున్నారు.
- సంఘటన వెలుగులోకి వచ్చిన ఈ నెల 8న జలమండలి అధికారికంగా వివరణ ఇచ్చింది. అందులో ఏజెన్సీ ఇన్‌ఫ్లోను సరిగా అంచనా వేయకపోవడమే ఘటనకు ప్రధాన కారణమని పేర్కొన్నది. కానీ జలమండలి పూర్తిస్థాయి బాధ్యులను చేసిన ఏజెన్సీపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నదనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. తౌలుత బోర్డు అధికారిక వాట్సాప్ గ్రూప్‌లో ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. కానీ ఎలాంటి అధికారిక ఉత్తర్వులు వెలువడలేదు. దీంతో ప్రభుత్వం ఈ విషయంలో దోబూచులాడుతున్నదనే విమర్శలు వస్తున్నాయి.
- కమిటీ తన నివేదికలో నాగార్జునసాగర్‌కు ఒక్కసారిగా 4.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో గేటు కొట్టుకుపోయి, గోడ కూలిందని పేర్కొన్నట్టుగా విశ్వసనీయ సమాచారం. కానీ సంఘటన జరిగిన రెండో తేదీ ఉదయం ఆరు గంటలకు నీటిపారుదల శాఖ అధికారికంగా విడుదల చేసిన ప్రాజెక్టుల లెవల్ షీట్స్‌లో నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో 3,36,543 క్యూసెక్కులుగా ఉన్నది. ఒకటో తేదీ సాయంత్రం ఆరు గంటలకు 3,69,866 క్యూసెక్కులుగా ఉన్నది. చివరికి ఘటన వెలుగులోకి వచ్చిన ఎనిమిదో తేదీన కూడా నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో 3,19,408 క్యూసెక్కులుగానే ఉన్నది. అంటే నాలుగు లక్షల క్యూసెక్కులు లేదు. అలాంటిది సుమారు ఐదు లక్షల క్యూసెక్కుల వరకు అంటూ ఇన్‌ఫ్లోను పెంచి చూపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఈ నేపథ్యంలో ఒక్కసారిగా ఇన్‌ఫ్లో పెరగడం అనేది కాకుండా వానకాలంలో అందునా సాగర్ నీటిమట్టం పెరుగుతున్న క్రమంలో సొరంగంలో గేటు ఏర్పాటు చేసి, పనులు పూర్తి కాకముందే సొరంగాన్ని ఓపెన్ చేయడమే ఘటనకు ప్రధాన కారణమని నిపుణులు స్పష్టంచేస్తున్నారు.
- మరోవైపు సుంకిశాల వంటి కీలకమైన ప్రాజెక్టుల వద్ద క్షేత్రస్థాయిలో ఉండే మేనేజర్లు (ఏఈఈ) ప్రధానం. ముఖ్యంగా సివిల్ ఇంజినీర్లను నియమిస్తేనే ప్రయోజనం ఉంటుంది. కానీ బోర్డు ఉన్నతాధికారులు అక్కడ గత నెల 31వరకు విధుల్లో ఉంచిన మేనేజర్ సవేరాం సివిల్ ఇంజినీర్ కాదని, డిప్లొమా పూర్తి చేసినందున ఆయనను సూపర్‌వైజర్‌గానే పరిగణిస్తారని పలువురు ఇంజినీర్లు తెలిపారు. పైగా ఆయన హౌసింగ్‌బోర్డు నుంచి డిప్యూటేషన్‌పై జలమండలికి వచ్చారు. దీంతో పాటు ఆయన బదిలీల్లో భాగంగా వెళ్లిన తర్వాత నియమించిన, ప్రస్తుతం సస్పెన్షన్‌కు గురైన హరీశ్ కూడా సివిల్ ఇంజినీర్ కాదు. ఎలక్ట్రానిక్స్ విభాగానికి చెందిన ఇంజినీర్. అంటే బోర్డు ఉన్నతాధికారులు పనుల పర్యవేక్షణలో ఆదినుంచీ నిర్లక్ష్యంగా ఉన్నారనేందుకు ఇది మరో ఉదాహరణ అని పలువురు పేర్కొంటున్నారు.

ఇప్పుడేమంటరు భట్టిగారూ?

ఈ ఘటనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తొలుత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నెపాన్ని నెట్టేందుకు ప్రయత్నించారు. నాసిరకం పనుల వల్లే ఇలా జరిగిందని దబాయించారు. ఈ ప్రయత్నం విఫలం కావడంతో మరుసటి రోజు మంత్రుల బృందం 'ఇది చిన్న ఘటన' అని చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. కాగా నాసిరకం నిర్మాణమే కారణమైతే పర్యవేక్షణ లోపం కారణంగా ఇంజినీర్లపై చర్యలెందుకు తీసుకున్నారని, ప్రభుత్వ తాజా చర్యలు భట్టి మాటలు వట్టివేనని చెప్పకనే చెప్పాయని పలువురు రాజకీయ విశ్లేషకులు స్పష్టంచేస్తున్నారు.

నలుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు

నల్గొండ జిల్లాలోని సుంకిశాల వద్ద నాగార్జునసాగర్ ఫోర్‌షోర్ నుంచి శాశ్వత ప్రాతిపదికన హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా కోసం చేపట్టిన ప్రాజెక్టులో రిటైనింగ్ వాల్ నిలువునా కుప్పకూలిన ఘటనపై వారం పాటు గోప్యత పాటించడం రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఘటన ఈ నెల రెండో తేదీన జరిగితే 'నమస్తే తెలంగాణ' ఎనిమిదో తేదీ ఎడిషన్ ద్వారా వెలుగులోకి తెచ్చింది. దీంతో ఘటన వివరాలు, వీడియో ఒక్కసారిగా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కిపడింది. జలమండలిలోని ముగ్గురు ఇంజినీర్లతో వేసిన త్రిసభ్య కమిటీ నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి వచ్చిన రోజే పురపాలక శాఖ అందించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలకు ఉపక్రమించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు జలమండలిలోని నలుగురు ఇంజినీర్లపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకున్నట్టుగా స్పష్టం చేసింది. పాజెక్టు డివిజన్ సర్కిల్-3 (సుంకిశాల)లో పనిచేస్తున్న సీజీఎం ఎస్. కిరణ్‌కుమార్, జీఎం బీ మరియరాజ్, డీజీఎం ఎన్ ప్రశాంత్, మేనేజర్ కేవీపీ హరీశ్‌ను సస్పెండ్ చేస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌ను ప్రాధాన్యత లేని పోస్టుకు బదిలీ చేశారు. టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్‌కు ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యతలు అప్పగించారు. ఘటన వెలుగులోకి వచ్చాక సంబంధిత ఇంజినీర్లను ఎండీ అశోక్‌రెడ్డి వివరణ కోరగా వారి సమాధానం సంతృప్తికరంగా లేకపోవడం, ఇంజినీర్ల సాంకేతిక పర్యవేక్షణ లోపాన్ని కమిటీ ఎత్తిచూపినందున ఈ చర్యలు తీసుకున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. జలమండలిలో ఏకకాలంలో నలుగురు ఇంజినీర్లపై ఒకేసారి వేటు పడటం బోర్డులో భారీ కుదుపునకు దారితీసింది.

స్టార్టప్‌లకు సీడీఎఫ్‌డీ ఆహ్వానం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 14(నమస్తే తెలంగాణ): ఆలోచనలను ఆవిష్కరణలుగా తీర్చిదిద్దుకునేందుకు సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ ఇంక్యుబేషన్ సెంటర్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తుంది. మాలిక్యులార్ డయాగ్నోస్టిక్స్, ఇండస్ట్రియల్ బయోటెక్నాలజీ, బయోమెడికల్ డివైజ్, అగ్రికల్చర్ బయోటెక్నాలజీ, థెరపాటిక్స్ అంశాల్లో పనిచేసే స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ సేవలను అందించనుంది. 18లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వ్యవసాయ వర్సిటీకి 37వ ర్యాంక్

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 14: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో 37వ ర్యాంకు సాధించిందని రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. బోధన, పరిశోధన, విస్తరణ విభాగాల్లో జాతీయస్థాయిలో 145 వ్యవసాయ, అనుబంధ సంస్థలు పాల్గొన్నాయని తెలిపారు.

స్కిల్ వర్సిటీపై గెజిట్ జారీ

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తెలంగాణ' గెజిట్ జారీ అయ్యింది. ఈ బిల్లు ఇటీవలే అసెంబ్లీలో ఆమోదం తెలపగా, గవర్నర్ సైతం ఈ వర్సిటీ ఏర్పాటు బిల్లును ఆమోదించారు. దీంతో న్యాయశాఖ సెక్రటరీ ఆర్ తిరుపతి బుధవారం గెజిట్ జారీచేశారు.

పిటిషనర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించాలి

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం స్థానికత నిబంధనను మార్చడాన్ని సవాలు చేసిన కేసుల్లో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. స్థానికతపై నిర్ణయం తీసుకునే వరకు పిటిషనర్ల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 26కి వాయిదా వేసింది.

లక్షకుపైగా దరఖాస్తులు రిజెక్ట్?

క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే తిరస్కరణ

- పై నుంచి వచ్చిన ఒత్తిడి మేరకే చేశామంటున్న అధికారులు
- రాష్ట్రవ్యాప్తంగా ఫీజుల రూపంలో రైతులకు రూ.కోట్ల నష్టం
- సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంటున్న అధికారులు
- దరఖాస్తులపై ఉపముఖ్యమంత్రి, రెవెన్యూమంత్రి విరుద్ధ ప్రకటనలు

కరీంనగర్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేసీఆర్ సర్కారు హయాంలో తెచ్చిన ధరణి పోర్టల్ దశాబ్దాల భూసమస్యలకు దారిచూపింది. దీనిని అభాసుపాలు చేసేందుకు కాంగ్రెస్ సర్కారు తీవ్రంగా కష్టపడుతున్నది. భూ సమస్యల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే తిరస్కరిస్తూ, రైతులపై ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షకుపైగా దరఖాస్తులను తిరస్కరించగా, అందరికీ ఒకే రకమైన కారణాలు చూపటం గమనార్హం. ఉదాహరణకు.. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలానికి చెందిన రైతు గుమ్మడి అంజయ్య.. మిస్సింగ్ సర్వే నంబర్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ అర్జీని గ్రామపంచాయతీ బోర్డుపై అతికించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. గడువులోగా ఎటువంటి అభ్యంతరాలు రాలేదని అధికారులు తెలిపారు. కానీ, భూమిని సాదాబైనామా ద్వారా వేరే వ్యక్తులకు అమ్మారని, మోఖాపై వేరేవాళ్లు ఉన్నారన్న కారణాలను చూపుతూ అప్లికేషన్‌ను తిరస్కరించారు. నిజంగానే సాదాబైనామాపై విక్రయించినా, లేదా మోకాపై వేరేవాళ్లు ఉన్నా పంచాయతీపై నోటీసు బోర్డులో అతికించినప్పుడే అభ్యంతరం చెప్పేవారు కదా? అన్న ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదు. ఇదే ఫార్మాట్‌లో వేల దరఖాస్తులను తిరస్కరించారు.

జూలై 5-10వ తేదీ మధ్యే భారీగా రిజెక్ట్

ధరణి పోర్టల్‌లోని 35 మాడ్యూళ్ల కింద రైతులు తమ రెవెన్యూ భూసమస్యల పరిష్కారం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటారు. ఉదాహరణకు.. టీఎం-33 మాడ్యూల్ కింద మ్యుటేషన్, సక్సేషన్ వంటి సమస్యల పరిష్కారం కోసం మీసేవకు వెళ్లి ఆన్‌లైన్‌లో నిర్ధారిత చార్జీలు చెల్లించి అర్జీ పెట్టుకుంటారు. ఆన్‌లైన్ అయిన తర్వాత రైతు దరఖాస్తు చేసుకున్న కాగితాలతోపాటు తన దగ్గర ఉన్న భూమి ఆధారాలను ఎమ్మార్వో ఆఫీసులో అందజేస్తారు. వాటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలి. వివిధ మాడ్యూళ్ల కింద టెక్నికల్ సమస్యల పరిష్కారానికి, పెండింగ్‌లో ఉన్న నాలా పరిష్కారం కోసం, మాడిఫికేషన్ రిక్వెస్ట్‌కు సంబంధించి మిస్సింగ్ సర్వే నంబర్లు పట్టాదారు పేరు మార్పులు చేర్పులు, విస్తీర్ణంలో తేడాల వాటి సవరణ, ఖాతా మెర్జింగ్, నిషేధిత జాబితా నుంచి తొలగింపు, డూప్లికేట్ పట్టాదారు పాసు పుస్తకాలు.. ఇలా విభిన్న రెవెన్యూ సమస్యల కోసం భూయజమానులు మీసేవ కేంద్రాల్లో ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకుంటారు. ఉదాహరణకు.. మ్యుటేషన్ ఆఫ్ ల్యాండ్‌కు ఒక్కో ఎకరానికి రూ.2,500, పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్‌కు రూ.300 చెల్లించాలి. ల్యాండ్ కన్వర్షన్‌కు బేసిక్ వ్యాల్యూలో 3 శాతం చెల్లింపులు చేయాలి. ఇలా ఒక్కోదానికి ఒక్కో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఒకసారి రిజెక్ట్ చేస్తే తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకోవటమే కాదు.. మళ్లీ నిర్ధారించిన ఫీజులు చెల్లించాలి. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అనర్హత ఉంటేనే కారణం చెప్తూ దరఖాస్తును తిరస్కరించాలి. కానీ, కాంగ్రెస్ సర్కారు హయాంలో ఇవేవీ లేకుండా విచ్చలవిడిగా దరఖాస్తులను రిజెక్ట్ చేశారు. జూలై 5 నుంచి 10 మధ్యే భారీగా దరఖాస్తులను తిరస్కరించినట్టు సమాచారం.



రెండు సార్లు దరఖాస్తును తిరస్కరించారు



కోనరావుపేటలో మా తల్లి చందనగిరి రామలక్ష్మి, తండ్రి రామస్వామి పేరు మీద 0.07 గుంటల భూమి ఉన్నది. ఆమె మరణించగా మా అన్నదమ్ములమంతా కలిసి విరాసత్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాం. ఆ భూమికి పాస్‌బుక్, పాత పహాణీలను జతచేసి ఎమ్మార్వో ఆఫీసులో అందజేశాం. కానీ అధికారులు వాటిని పరిశీలించకుండా ఆన్‌లైన్‌లో భర్త పేరు తప్పుగా ఉందని రిజెక్ట్ చేశారు. ఆరు నెలలుగా రెవెన్యూ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నా.. రెండు సార్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా రెండు సార్లు రిజెక్ట్ చేశారు. దీంతో డబ్బులు నష్టపోవడంతోపాటు భూమి ఆన్‌లైన్ కాకపోవటంతో అన్ని విధాలుగా నష్టపోతున్నాం. అడిగితే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్తున్నారు.

– చందనగిరి రాజేశం, రైతు, కోనరావుపేట, రాజన్న సిరిసిల్ల జిల్లా

సర్కారు ఒత్తిడి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను అభాసుపాలుచేసే కార్యక్రమాన్ని పెట్టుకున్నది. బడ్జెట్ సమావేశాల్లో సమాధానం చెప్పాల్సి వస్తుందని భావించి, జూలై మొదటి వారంలో దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రభుత్వం ఒత్తిడి పెట్టింది. జూలై 10లోగా ఆన్‌లైన్‌లో ఉన్న దరఖాస్తులకు ఏదో ఒక పరిష్కారం చూపాలని పైనుంచి ఒత్తిడి పెరిగింది. ఆమేరకు కలెక్టర్లు సిబ్బందిపై ఒత్తిడి చేయటంతో.. తహసీల్ కార్యాలయంలో ఉన్న సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలించే సామర్థ్యం లేక పైఅధికారులకు అన్నీ క్లియర్ చేశామని చెప్పుకోవడానికి తిరస్కరణ ప్రక్రియ చేపట్టి చేతులు దులుపుకున్నట్టు తెలుస్తున్నది. దీనివల్ల ఫీజులుగా చెల్లించిన రూ.కోట్లను రైతులు నష్టపోయారు.

మంత్రుల ప్రకటనల మధ్య తేడాలు

బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు (జూలై 25న) ఉప ముఖ్యమంత్రి చెప్పిన మాటలు, చేసిన ప్రకటనలకు.. ఇదే అంశంపై ఆగస్టు 2న జరిగిన చర్చలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పిన మాటలకు చాలా వ్యత్యాసం ఉన్నది. బడ్జెట్ ప్రవేశ ప్రసంగం సందర్భంగా భట్టి.. 'ధరణి అమలు వల్ల వచ్చిన సమస్యలను అధ్యయనం చేయడానికి ఒక కమిటీని నియమించాం. ఆ కమిటీ సూచనల మేరకు మొదటి దశలో పెడింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించడానికి మార్చి 1 నుంచి 16 వరకు కలెక్టర్ల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. 2024 మార్చి ఒకటి నాటికి 2,26,740 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, కొత్తగా 1,22,774 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 3,49,514 దరఖాస్తుల్లో మార్చి ఒకటి నుంచి బడ్జెట్ ప్రవేశపెట్టే నాటికి 1,79,143 దరఖాస్తులను పరిష్కరించింది' అని చెప్పారు. ఆగస్టు 2న శాసనసభలో చర్చ జరిగింది. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 'మేం అధికారంలోకి వచ్చేనాటికి ధరణిలో 2.45 లక్షల దరఖాస్తులు పెడింగ్‌లో ఉన్నాయి. వాటిలో 1.19 లక్షలను క్లియర్ చేశాం. మళ్లీ లక్షకుపైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని మూడు వారాల్లోగా పరిష్కరిస్తాం' అని వెల్లడించారు. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే.. మార్చి ఒకటి నాటికి 2,26,740 దరఖాస్తులు వచ్చాయని భట్టి చెప్తే, పొంగులేటి మాత్రం అధికారంలోకి వచ్చే నాటికే 2.45 లక్షల దరఖాస్తులు పెడింగ్‌లో ఉన్నాయన్నారు. దరఖాస్తులు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయని చూపి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బదనాం చేయాలనే పొంగులేటి తప్పులు చెప్పారన్న విమర్శలు అప్పుడే వచ్చాయి. 1.79 లక్షల దరఖాస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించినట్టు బడ్జెట్ ప్రసంగంలో భట్టి చెప్పగా.. 1.19 లక్షల దరఖాస్తులను క్లియర్ చేసినట్టు పొంగులేటి చెప్పటం గమనార్హం.

ధరణితో రైతు భూమికి భద్రత

ధరణి పోర్టల్ రాక ముందు వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగేది. గంటల పాటు పడిగాపులు పడాల్సి వచ్చేది.స్లాట్ బుకింగ్‌ను అమల్లోకి తేవటం వల్ల సమయానికి వెళ్లి గంటలోపు రిజిస్ట్రేషన్ ముగించుకొని వెళ్తున్నారు.

మనస్తాపంతో తల్లీకూతురు ఆత్మహత్య



ఎల్లవ్వ (ఫైల్)



పోచవ్వ (ఫైల్)

చేగుంట, ఆగస్టు 14 : ఒంటరితనం, పక్కవారి నుంచి పలుకరింపులు లేకపోవడంతో మనస్తాపంతో తల్లీకూతురు ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం రెడ్డిపల్లిలో బుధవారం వెలుగుచూసింది. స్థానికులు, చేగుంట పోలీసుల కథనం ప్రకారం.. రెడ్డిపల్లికి చెందిన తలారి ఎల్లవ్వ (70), పోచవ్వ(50) తల్లీకూతుళ్లు. మక్కరాజిపేటకు చెందిన లావణ్యకు రెడ్డిపల్లి వాసి తలారి ముత్యంతో వివాహం జరగ్గా.. కుటుంబ కలహాలతో ఆరు నెలల క్రితం బావిలో పడి లావణ్య అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. లావణ్య మృతికి భర్త, అత్త, ఆడపడుచు కారణమంటూ మృతురాలి బంధువుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భర్త ముత్యం, అత్త తలారి ఎల్లవ్వ, ఆడపడుచు తలారి పోచవ్వపై కేసు నమోదైంది. దీంతోపాటు వారికి ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమిని లావణ్య తల్లి పేరిట రిజిస్ట్రేషన్ చేయించే వరకు మూడు రోజులపాటు మృతదేహానికి దహన సంస్కారాలు జరగనివ్వలేదు. జైలు నుంచి వచ్చిన ముత్యం బతుకుదెరువు కోసం తన పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. తలారి ఎల్లవ్వ, ఆమె కూతురు పోచవ్వ మాత్రం రెడ్డిపల్లిలోని ఇంట్లోనే ఉంటున్నారు. ఇరుగుపొరుగు వారు వీరితో మాట్లాడటం లేదు. ఒంటరితనం భరించలేక తీవ్ర మనోవేదనకు గురైన తల్లీకూతురు మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముత్యం ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గడ్డం గీసే కత్తితో గొంతు కోసి..


పాత కక్షల నేపథ్యంలో దారుణ హత్య

మణికొండ, ఆగస్టు 14: ఓ వ్యక్తిని గడ్డం గీసే కత్తితో గొంతుకోసి హత్య చేసిన నిందితుడు పోలీసులకు లొంగిపోయిన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నార్సింగి సీఐ హరికృష్ణరెడ్డి తెలిపిన ప్రకారం.. నార్సింగి కుమ్మరి బస్తీకి చెందిన కొండ రాజు (48) సెలూన్‌ను నిర్వహిస్తున్నాడు. రాజుకు భార్య వరలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇదే ప్రాంతంలోని సమీప బంధువైన ప్రవీణ్‌కుమార్‌తో రాజుకు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. డిసెంబర్ 31న తమ ఇంటి ఎదుట ముగ్గులు చెరిపేశాడని ప్రవీణ్‌తో గొడవపడి, నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. దీంతో రాజుపై కక్ష పెంచుకున్న ప్రవీణ్ మంగళవారం అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి రాజును గడ్డం చేసే కత్తితో గొంతుకోసి హత్య చేశాడు. బుధవారం ఉదయం నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త మరణాన్ని తట్టుకోలేక గుండెపోటుతో భార్య మృతి

భద్రాద్రి జిల్లా మణుగూరులో విషాదం





సోమయ్య, శంకరమ్మ దంపతులు(ఫైల్)

మణుగూరు టౌన్, ఆగస్టు 14 : పొలం పనులకు వెళ్లిన భర్త గుండెపోటుతో విగతజీవిగా మారాడు. భర్త లేడని తెలుసుకున్న భార్య గుండె బరువెక్కింది. 'నీవు లేక నేనెందుకు' అనుకుందేమో.. భర్తతోపాటు ఆమె కూడా గుండెపోటుతో తనువు చాలించింది. ఈ విషాదకర ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో బుధవారం చోటుచేసుకున్నది. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. బాలాజీనగర్‌లో నివాసం ఉండే రిటైర్డ్ సింగరేణి కార్మికుడు కొమ్ము సోమయ్య (72), శంకరమ్మ (65) భార్యాభర్తలు. వారికి ముగ్గురు పిల్లలు. సోమయ్య బుధవారం పొలం వద్ద పనులు చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో మృతి చెందాడు. గమనించిన తోటి రైతులు అతడి మృతదేహాన్ని ఇంటికి తరలించారు. భర్త మృతదేహాన్ని చూసిన శంకరమ్మ షాక్‌కు గురై గుండెపోటుతో అక్కడికక్కడే తనువు చాలించింది.

ఆఫ్ క్యాంపస్ అనుమతులను పునఃసమీక్షించండి

- ఏదో ఒక కారణం చెప్పి తిరస్కరించడం చెల్లదు
- చట్ట ప్రకారం సరైన నిర్ణయం తీసుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలలో ఆఫ్ క్యాంపస్ అడ్మిషన్లకు అనుమతినిచ్చే విషయమై పునఃసమీక్షించి తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. చట్టంలోని అన్ని అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. ఆఫ్ క్యాంపస్ అడ్మిషన్లకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడాన్ని సమర్థిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ ఎన్ రాజేశ్వరరావుతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆఫ్ క్యాంపస్‌లో బీటెక్ కోర్సుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతించకపోవడాన్ని సమర్థిస్తూ సింగిల్ జడ్జి గతంలో తీర్పు చెప్పారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ, వాహిని ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్వామి వివేకానంద ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కాలేజీలు అప్పీళ్లు దాఖలు చేశాయి. వీటిపై బుధవారం జరిగిన విచారణ సందర్భంగా పిటిషనర్ల తరపున సీనియర్ అడ్వకేట్లు దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్, దాని అనుబంధ కోర్సులు, డాటాసైన్స్, ఏఐఎంఎల్ తదితర కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్ కింద నిర్వహించుకోవడానికి ఏఐసీటీఈ అనుమతి మంజూరు చేసిందని, ప్రభుత్వం మాత్రం నిరాకరిస్తున్నదని తెలిపారు. దీంతో కౌన్సెలింగ్‌లో అడ్మిషన్లు ఇచ్చే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. ప్రభుత్వం పక్షాన ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఆఫ్ క్యాంపస్ కాలేజీల ఏర్పాటు నిమిత్తం మార్గదర్శకాల రూపకల్పనకు ఏర్పాటు చేసిన కమిటీ జూన్ 11న సమావేశం నిర్వహించిందని తెలిపారు. ప్రస్తుతం కౌన్సెలింగ్ ప్రారంభమైన ఈ దశలో ఆఫ్ క్యాంపస్‌లకు అడ్మిషన్లు అనుమతించడం సాధ్యం కాదని స్పష్టంచేశారు. ఈ అంశాన్ని వచ్చే ఏడాది పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కోర్టుకు వచ్చిన కాలేజీలకు మాత్రమే కాకుండా ఏ ఇతర కాలేజీలకు కూడా ఆఫ్ క్యాంపస్‌ల నిర్వహణకు అనుమతి మంజూరు చేయలేదని చెప్పారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ఏఐసీటీఈ అనుమతుల మంజూరు చేయకముందు వివరణ అడిగినప్పుడు సకాలంలో స్పందించవచ్చు కదా అని ప్రశ్నించింది. ఏదో ఒక కారణం చూపుతూ అనుమతులను తిరస్కరించడం చెల్లదని పేర్కొంది. ఏకవాక్య తీర్మానంతో కాలేజీల దరఖాస్తులను తిరస్కరించరాదని, తిరస్కరణకు కారణాలను పేర్కొనాలని స్పష్టంచేసింది. దరఖాస్తులను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించింది.

నలుగురికి కీర్తి చక్ర

- మరణానంతరం ముగ్గురికి
- 18 మందికి శౌర్య చక్ర
- ఆమోదం తెలిపిన రాష్ట్రపతి


మన్‌ప్రీత్


హుమయున్

న్యూఢిల్లీ, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సాయుధ బలగాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన 103 మందికి శౌర్య పురస్కారాలు లభించాయి. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఆమోదం తెలిపారు. ఇందులో నాలుగు కీర్తి చక్ర, 18 శౌర్య చక్ర పురస్కారాలు కాగా, 63 సేనా పతకాలు(శౌర్య), 11 నౌ సేనా పతకాలు, ఆరు వాయు సేనా పతకాలు ఉన్నాయి. మరణానంతరం ముగ్గురికి కీర్తి చక్ర పురస్కారాలు, నలుగురికి శౌర్య చక్ర దక్కనున్నాయి. సైనిక ఆపరేషన్‌లలో విశేష సేవలు అందించినందుకు గానూ 39 మెన్షన్ ఇన్ డిస్పాచ్‌లకు సైతం రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఇందులో మరణించిన సైనిక జాగిలం కెంత్ కూడా ఉంది. పతకాలు, పురస్కారాల స్థాయి కానప్పటికీ ప్రదర్శించిన శౌర్య ప్రతాపాలకు మెన్షన్ ఇన్ డిస్పాచ్ అనే గుర్తింపును ఇస్తారు. కాగా, శౌర్య పురస్కారాల్లో ఎక్కువగా సీఆర్పీఎఫ్ సిబ్బందికే దక్కాయి. సీఆర్పీఎఫ్‌కు సేవలందించిన 52 మంది శౌర్య పురస్కారాలకు ఎంపికయ్యారు.

కీర్తిచక్రధారులు వీరే

శాంతి సమయంలో ఇచ్చే రెండో అత్యున్నత శౌర్య పురస్కారమైన కీర్తి చక్రకు ఆర్మీకి సేవలు అందించిన నలుగురు ఎంపికయ్యారు. రాష్ట్రీయ రైఫిల్స్ 19వ బెటాలియన్‌కు చెందిన కర్నల్ మన్‌ప్రీత్ సింగ్(మరణానంతరం), 56వ బెటాలియన్‌కు చెందిన మేజర్ మల్ల రామగోపాల్ నాయుడు, 63వ బెటాలియన్‌కు చెందిన రైఫిల్‌మ్యాన్ రవికుమార్(మరణానంతరం), జమ్ము కశ్మీర్ పోలీసు శాఖలో డీసీపీగా పని చేసిన హుమయున్ ముజమ్మిల్ భట్(మరణానంతరం)కు కీర్తి చక్ర పురస్కారాలు దక్కాయి.

వీరికి శౌర్య చక్ర

శాంతికాలంలో ఇచ్చే మూడో అత్యున్నత శౌర్య పురస్కారమైన శౌర్య చక్ర పురస్కారం ఆర్మీకి సేవలు అందించిన కర్నల్ పవన్ సింగ్, మేజర్ సీవీఎస్ నిఖిల్, మేజర్ ఆశిష్ ధోన్‌ఛక్(మరణానంతరం), మేజర్ త్రిపాత్‌ప్రీత్ సింగ్, మేజర్ సాహిల్ రంధవా, సుబేదార్ సంజీవ్ సింగ్ జస్రోతియా, నాయబ్ సుబేదార్ పీ పబిన్ సింఘా, సిపాయి ప్రదీప్ సింగ్(మరణానంతరం), అబ్దుల్ లతీఫ్, నేవీకి చెందిన కెప్టెన్ శరద్ సిన్సువాల్, లెఫ్టినెంట్ కమాండర్ కపిల్ యాదవ్, ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన వింగ్ కమాండర్ వెర్నాన్ దెస్మాండ్ కేన్, స్క్వాడ్రన్ లీడర్ దీపక్ కుమార్, సీఆర్పీఎఫ్‌కు చెందిన పవన్ కుమార్(మరణానంతరం), సీ దేవన్(మరణాంతరం), లఖ్‌వీర్, రాజేశ్ పంచల్, మల్కిత్ సింగ్‌కు దక్కాయి.

ఉగ్రవాదులతో పోరులో మరణించిన మన్‌ప్రీత్ సింగ్

పంజాబ్‌కుచెందిన మన్‌ప్రీత్ సింగ్ 17 ఏండ్ల పాటు ఆర్మీలో సేవలందించారు. ఆయన తండ్రి కూడా ఆర్మీలో పని చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 12న జమ్ము కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా కొకెర్‌నాగ్ ప్రాంతంలో ఉగ్రవాదులతో ఆయన వీరోచితంగా పోరాడి మరణించారు. ఇదే ఘటనలో మరణించిన హుమయున్ ముజమ్మిల్ భట్‌కు కూడా మరణాంతరం కీర్తి చక్ర దక్కింది.

1,037 మందికి పోలీస్ మెడల్స్

న్యూఢిల్లీ: కేంద్ర, రాష్ట్ర బలగాల్లో విశిష్ట సేవలందించిన 1,037 మంది పోలీసులకు ప్రభుత్వం బుధవారం సేవా పతకాలను ప్రకటించింది. అత్యున్నత రాష్ట్రపతి గ్యాలంటరీ పతకం (పీఎంజీ) ఈసారి తెలంగాణకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ యాదయ్య దక్కించుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వీరికి ఈ పతకాలను అందజేస్తామని కేంద్ర హోం శాఖ తెలిపింది. రాష్ట్రపతి శౌర్య పతకం సహా 214 మందికి శౌర్య పతకాలు, 231 మందికి పరాక్రమ పతాకాలు ప్రదానం చేస్తారు. మొత్తం పతాకాల్లో 52 శౌర్య పతాకాలు సీఆర్‌పీఎఫ్, 31 జమ్ము-కశ్మీర్ పోలీసు, యూపీ, మహారాష్ట్ర పోలీసులకు 17 చొప్పున, ఛత్తీస్‌గఢ్‌కు 15, మధ్యప్రదేశ్‌కు 12 పతకాలు లభించాయి. ఇక ఇతర వాటిల్లో 94 ప్రెసిడెంట్ పోలీస్ పతాకాలు విశిష్ట సేవలకు, 729 పతకాలు ప్రశంసాపూర్వక సేవలు అందించిన వారికి లభించాయి.

ఆర్థిక సంస్కరణల కొత్త శకానికి పునాది

- *2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే లక్ష్యం*
- *స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము*



న్యూఢిల్లీ, ఆగస్టు 14: భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే లక్ష్యంగా ఆర్థిక సంస్కరణల కొత్త శకానికి పునాది పడిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బుధవారం ఆమె జాతినుద్దేశించి ప్రసంగించారు. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగడం గర్వించాల్సిన విషయమని, మొదటి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగే క్రమంలో దేశం ఉన్నట్టు పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఏఐ, సెమి కండక్టర్లు, పటిష్టమైన బ్యాంకింగ్, ఆర్థిక రంగాలపై ప్రభుత్వం దృష్టిసారించిందని అన్నారు. సామాజిక న్యాయానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతను ఇస్తున్నదని, ఎస్సీ, ఎస్టీలు, ఇతర వెనుకబడిన సమాజాల సంక్షేమం కోసం అపారమైన చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు. విభజిత ధోరణులను తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. గత దశాబ్ద కాలంగా క్రీడా రంగంలో భారత్ అద్భుతంగా పురోగతి సాధించిందని ఆమె పేర్కొన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో భారతీయ క్రీడాకారుల ప్రదర్శనను, టీ20 ప్రపంచ కప్‌లో టీమిండియా విజయాన్ని ఆమె ప్రస్తావించారు.

ఎర్రకోట వేడుకలకు ఒలింపిక్స్ బృందం

రాజధాని ఢిల్లీలో గురువారం జరిగే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎర్రకోట సిద్ధమైంది. ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత బృందం ఈ వేడుకల్లో పాల్గొంటున్నది. వీరే కాక అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం) విద్యార్థులు, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్‌కు చెందిన కార్మికులు సహా మొత్తం 6,000 మంది ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేస్తున్నారు. వికసిత్ భారత్ @2047 పేరిట నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో యువత, గిరిజనులు, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాలకు చెందిన వారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. వీరేకాక మేరా యువభారత్ , ఎన్‌ఎస్‌ఎస్ పథకం కింద చేపట్టిన మేరీ మాతీ, మేరీ దేశీ వాలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు కూడా పాల్గొంటారు.



ఐరాస శాశ్వత ప్రతినిధిగా పర్వతనేని హరీశ్

తెలుగు వ్యక్తికి కీలక పదవి

న్యూఢిల్లీ: న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి తదుపరి భారత శాశ్వత ప్రతినిధిగా తెలుగు వ్యక్తి పర్వతనేని హరీశ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆయన త్వరలోనే ఈ పదవిని చేపడతారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. ఆయన 1990 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి. ప్రస్తుతం జర్మనీకి భారత రాయబారిగా పని చేస్తున్నారు. జీ20, జీ7, బ్రిక్స్ సమావేశాల్లో కీలక పాత్ర పోషించారు. ఉప రాష్ట్రపతికి ఓఎస్‌డీగా కూడా పని చేశారు. రుచిర కాంభోజ్ జూన్‌లో పదవీ విరమణ చేయడంతో హరీశ్‌ను ఈ పదవిలో నియమించారు. రుచిర దాదాపు నాలుగు దశాబ్దాలపాటు దౌత్యవేత్తగా పని చేశారు. పర్వతనేని హరీశ్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. గోల్డ్ మెడల్ కూడా పొందారు.



ఈడీ చీఫ్‌గా రాహుల్ నవీన్

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాత్కాలిక చీఫ్‌గా ఉన్న రాహుల్ నవీన్ పూర్తిస్థాయి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు క్యాబినెట్ నియామకాల కమిటీ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1993 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అయిన నవీన్ ఈడీ డైరెక్టర్‌గా రెండేండ్లు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏది ముందైతే అప్పటివరకు పదవిలో కొనసాగుతారు. 57 ఏండ్ల నవీన్ ఈడీలో 2019 నవంబర్‌లో ప్రత్యేక డైరెక్టర్‌గా నియమితులయ్యారు. గత ఏడాది సెప్టెంబర్ 15న నవీన్ తాత్కాలిక డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈయన హయాంలోనే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్‌లను మనీ లాండరింగ్ కేసుల్లో ఈడీ అరెస్ట్ చేసింది.

థాయ్‌లాండ్ ప్రధాని తొలగింపు

నైతిక ఉల్లంఘనకు పాల్పడినందుకు కోర్టు వేటు

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లో రాజ్యాంగ న్యాయస్థానం తీర్పు ఆ దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది. నైతిక ఉల్లంఘనలకు పాల్పడిన 62 ఏండ్ల ప్రధాని స్రెట్టా థావిసిన్‌ను తక్షణం పదవి నుంచి తొలగిస్తూ న్యాయస్థానం బుధవారం ఆదేశించింది. ప్రధాన ప్రతిపక్షాన్ని వారం రోజుల క్రితమే రద్దు చేసిన రాజ్యాంగ న్యాయస్థానం ఇప్పుడు మరో సంచలన తీర్పును ప్రకటించింది. ఒక కేసులో శిక్షపడిన పిచిట్ అనే వ్యక్తిని స్రెట్టా థావిసిన్ తన క్యాబినెట్ సభ్యుడిగా నియమించడంపై విచారించిన రాజ్యాంగ న్యాయస్థానం 5:4తో ఆయనకు వ్యతిరేకంగా తీర్పును ఇచ్చింది. ఆయన తక్షణం తన కార్యాలయాన్ని వదిలివెళ్లాలని ఆదేశించింది.

ట్రైనీ డాక్టర్‌పై గ్యాంగ్ రేప్?

- ఆమె శరీరంలో అధిక మొత్తంలో వీర్యం
- పోస్టుమార్టం నివేదికలో వెల్లడి


ట్రైనీ డాక్టర్ హత్యాచారంపై హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో వైద్యుల నిరసన

కోల్‌కతా, ఆగస్టు 14: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనలో మరో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. ఆమెపై లైంగిక దాడి చేసింది ఒక్కరు కాదని, అది గ్యాంగ్ రేప్ అని పోస్టుమార్టం నివేదిక వెల్లడించిందని వైద్యులు చెబుతున్నారు. బాధితురాలి శరీరంలో అధిక మొత్తంలో 151 మిల్లీగ్రాముల వీర్యం ఉన్నట్టు తేలిందని డాక్టర్ సువర్ణ గోస్వామి తాజాగా ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ మేరకు బాధితురాలి తల్లిదండ్రులు కలకత్తా హైకోర్టులో వేసిన పిటిషన్‌లో వెల్లడించినట్టు కొన్ని మీడియా సంస్థలు కథనాలు ఇచ్చాయి. 151 ఎంజీ పరిమాణంలో వీర్యం అంటే ఒక్కరి నుంచి రాదని, లైంగిక దాడిలో పలువురి ప్రమేయం ఉన్నట్టు ఇది చెబుతున్నదని ఆఖిల భారత ప్రభుత్వ వైద్యుల సంఘం అదనపు ప్రధాన కార్యదర్శిగా కూడా ఉన్న డాక్టర్ గోస్వామి అన్నారు.

మా కుమార్తెపై జరిగింది గ్యాంగ్ రేప్..

తమ కుమార్తెపై సామూహిక లైంగిక దాడి జరిగిందని బాధితురాలి తల్లిదండ్రులు కలకత్తా హైకోర్టులో వేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. గొంతు పిసికి చంపడం వల్లనే తమ కుమార్తె మరణించినట్టు పోస్టుమార్టం నివేదిక వెల్లడించిందని తెలిపారు. తమ కుమార్తె సామూహిక లైంగిక దాడి, హత్యకు గురైనట్టు స్పష్టమైన ఆధారాలు కనిపిస్తున్నప్పటికీ ఇతర నిందితులను అరెస్టు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కాలేజీ ప్రిన్సిపాల్, ఇతర సంబంధిత వ్యక్తులను ఇప్పటి వరకు అదుపులోకి తీసుకోలేదని పేర్కొన్నారు.కాగా, ఈ ఘటనపై వస్తున్న విమర్శల మీద సీఎం మమతా బెనర్జీ స్పందించారు. సీబీఐకి పూర్తిగా సహకరిస్తున్నా కూడా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో బంగ్లాదేశ్ తరహా అల్లర్లు సృష్టించేందుకు బీజేపీ, సీపీఎం ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

సిల్చార్ కాలేజీ అడ్వైజరీపై విమర్శలు

బెంగాల్ ఘటన నేపథ్యంలో మహిళా సిబ్బంది, విద్యార్థినులకు అస్సాంలోని సిల్చార్ మెడికల్ కాలేజీ చేసిన సూచనలు విమర్శలకు కారణమయ్యాయి. నిర్మానుష్య, చీకటి ప్రదేశాలకు వెళ్లొద్దని, రాత్రి పూట హాస్టల్ బయటకు రావొద్దని, మర్యాదగా మాట్లాడాలని అడ్వైజరీ జారీ చేసింది. దీనిపై విమర్శలు రావడంతో వెనక్కు తీసుకుంది.

యూజీసీ నెట్ షెడ్యూల్‌లో మార్పు

26న జరగాల్సిన పరీక్ష 27కు వాయిదా: ఎన్టీఏ

న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఈనెల 21 నుంచి మొదలవుతున్న యూజీసీ-నెట్ పరీక్షలకు సంబంధించి ఎన్టీఏ చిన్న మార్పు చేసింది. ఆగస్టు 26న 'కృష్ణ జన్మాష్టమి' వచ్చినందున, ఆ రోజు నిర్వహించాల్సిన పరీక్షను ఆగస్టు 27కు వాయిదా వేస్తున్నట్టు ఎన్‌టీఏ ప్రకటించింది. 'యూజీసీ-నెట్ జూన్ 2024 ఎగ్జామ్స్' షెడ్యూల్‌లో మిగతా పరీక్షలన్నీ ఇంతకు ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని పేర్కొన్నది.

కేంద్ర హోం శాఖ కార్యదర్శిగా గోవింద్ మోహన్

న్యూఢిల్లీ, ఆగస్టు 14: కేంద్ర హోం శాఖ తదుపరి కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి గోవింద్ మోహన్ నియమితులయ్యారు. మోహన్‌ను హోం మంత్రిత్వ శాఖలో తక్షణం ఓఎస్‌డీగా నియమించారు. ప్రస్తుతం హోం సెక్రటరీగా పనిచేస్తున్న అజయ్‌కుమార్ భల్లా పదవీ కాలం ఈ నెల 22తో ముగుస్తుంది. తదుపరి ఆయన స్థానంలో మోహన్ బాధ్యతలు చేపడతారు.

కేంద్రం నుంచి పన్నులు వాపస్

- 2005 నుంచి చెల్లించాలని రాష్ట్రాలు అడగొచ్చు
- 12 ఏండ్ల పాటు విడతల వారీగా తీసుకోవచ్చు
- గనుల మీద రాయల్టీపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- సహజ వనరులు ఉన్న రాష్ట్రాలకు భారీ లబ్ధి



న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఖనిజాలు, ఖనిజ నిల్వలు ఉన్న భూములపై 2005 ఏప్రిల్ 1 నుంచి కేంద్రం వసూలు చేసిన పన్నులు, రాయల్టీని వాపస్ చెల్లించమని రాష్ట్రాలు అడగొచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. 2026 ఏప్రిల్ 1 నుంచి 12 ఏండ్ల పాటు విడతలవారీగా ఈ పన్ను బకాయిలను కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి తిరిగి పొందొచ్చని రాష్ట్రాలకు అనుమతిచ్చింది. ఖనిజాలు, ఖనిజ వనరులు ఉన్న భూములపై రాయల్టీ, పన్ను విధించే చట్టబద్ధమైన అధికారం రాష్ట్రాలకు ఉందని జూలై 25న రాజ్యాంగ ధర్మాసనం 8:1 మెజారిటీతో తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. అంతకుముందు ఈ అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉందని 1989లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పక్కకుపెట్టింది. దీంతో తమ రాష్ట్రాల్లోని ఖనిజ వనరులపై 1989 నుంచి కేంద్రం తీసుకున్న రాయల్టీ, పన్నులను తిరిగి చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాల్సిందిగా పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టును కోరాయి. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ తీర్పు ఇచ్చిన జూలై 25 నుంచే అమలులోకి వచ్చేలా చూడాలని కోర్టును కోరింది.

రాష్ట్రాలకు భారీ ప్రయోజనం

గనులు, ఖనిజాలపై 1989 నుంచి వసూలైన రాయల్టీని తిరిగి రాష్ట్రాలకు చెల్లించాలనే వాదనను కేంద్రం వ్యతిరేకించింది. ఇలా చేస్తే ప్రజలు, ప్రభుత్వ రంగ సంస్థల(పీఎస్‌యూ)పై తీవ్ర ప్రభావం పడుతుందని వాదించింది. ప్రాథమిక అంచనాల ప్రకారమే పీఎస్‌యూలు రూ.70 వేల కోట్లు చెల్లించాల్సి ఉంటుందని, దీంతో పీఎస్‌యూల ఖజానా ఖాళీ అవుతుందని పేర్కొన్నది. దీంతో బుధవారం రాజ్యాంగ ధర్మాసనం ఈ విషయమై స్పష్టత ఇచ్చింది. 2005 ఏప్రిల్ 1 నుంచి గనులు, ఖనిజ వనరులపై కేంద్రం తీసుకున్న పన్నులను రాష్ట్రాలు తిరిగి పొందవచ్చని పేర్కొన్నది. కాగా, తొమ్మిది మంది సభ్యులతో కూడిన ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పుపై తనతో సహా ఎనిమిది మంది న్యాయమూర్తులు సంతకం చేస్తారని, జూలై 25న భిన్నమైన తీర్పు ఇచ్చిన జస్టిస్ నాగరత్న మాత్రం సంతకం చేయరని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. కాగా, సుప్రీంకోర్టు తాజా తీర్పుతో గనులు, ఖనిజ వనరులు ఉన్న రాష్ట్రాలకు భారీ మేలు జరగనుంది. ఇప్పటినుంచి వీటిపై పన్ను విధించే అధికారం రాష్ట్రాలకు రానుండటంతో పాటు గత 19 ఏండ్లుగా కేంద్రం వసూలు చేసిన పన్నులను కూడా తిరిగి పొందే అవకాశం రావడంతో భారీగా నిధులు అందనున్నాయి.

ఎస్బీఐ, పీఎన్‌బీతో కటీఫ్

ఖాతాలు మూసేయాలంటూ కర్ణాటక సర్కార్ ఉత్తర్వులు

బెంగళూరు: ప్రభుత్వ ఖాతాల్లో నిధుల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లతో కర్ణాటక ప్రభుత్వం లావాదేవీలను నిలిపివేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన వివిధ విభాగాలకు తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. ఆయా బ్యాంకుల్లోని తమ ఖాతాలను మూసేయటంతో పాటు, డిపాజిట్లను వెనక్కి తీసుకోవాలని, సెప్టెంబర్ 20 కల్లా ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. 'ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, స్థానిక సంస్థలు, వర్సిటీలు, ఇతర విద్యా సంస్థలు ఎస్బీఐ, పీఎన్‌బీ బ్యాంకుల్లో ఖాతాలను రద్దు చేసుకోవాలి. కొత్తగా లావాదేవీలు, డిపాజిట్లు చేయరాదు' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

ఆర్మీ కెప్టెన్ వీరమరణం

- జమ్ముకశ్మీర్‌లో ఎదురుకాల్పులు
- ఉగ్రవాది హతం.. పౌరుడికి గాయాలు
- 4 నెలల్లో 20 మంది జవాన్ల మృతి

జమ్ము : జమ్ముకశ్మీర్‌లోని దోడా జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. ఉగ్రవాదుల ఎదురు కాల్పుల్లో ఆర్మీ కెప్టెన్ దీపక్ సింగ్ వీరమరణం పొందాడు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక పౌరుడికి కూడా గాయాలైనట్టు తెలుస్తున్నది. ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు దోడాలోని శివఘడ్-అస్సార్ బెల్ట్ అటవీ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. తొలుత నలుగురు మరణించినట్టు భావించినప్పటికీ ఒక్క ఉగ్రవాదే హతమైనట్టు అధికారులు నిర్ధారించారు.

అదనపు డీజీపీ ఆనంద్ జైన్ మాట్లాడుతూ ఆపరేషన్ కొనసాగుతున్నదని చెప్పారు. ఆర్మీ కెప్టెన్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు. ఉదంపూర్-దోడా-కిష్త్వార్ రీజియన్‌లో ఇటీవల కాలంలో ఇది నాలుగో ఎన్‌కౌంటర్. గత నాలుగు నెలల్లో జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడుల్లో సుమారు 20 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు.

అయోధ్యలో 50 లక్షల విలువైన లైట్లు చోరీ

అయోధ్య: అత్యంత కట్టుదిట్టమైన భద్రత కలిగిన అయోధ్యలో భారీ చోరీ జరిగింది. రామ మందిరానికి దారితీసే భక్తిపథ్, రామ్‌పథ్ మార్గాల్లో ఏర్పాటు చేసిన లైట్లను దొంగలు ఎత్తుకెళ్లారు. వీటి విలువ రూ. 50 లక్షల పైమాటే. రామ మందిర నిర్మాణం అనంతరం భక్తిపథ్, రామ్‌పథ్‌లో వెదురు లైట్లు, ప్రొజెక్టర్ లైట్లు ఏర్పాటు చేసి అందంగా తీర్చదిద్దారు. ఇప్పుడు వీటిలో 3800 వెదురు లైట్లు, 36 ప్రొజెక్టర్ లైట్లు చోరీకి గురయ్యాయి. ఈ నెల 9నే ఈ ఘటన జరిగింది. తాజాగా వెలుగులోకి వచ్చింది. రామ్‌పథ్‌లో మొత్తం 6400 వెదురు లైట్లు, భక్తిపథ్‌లో 96 ప్రొజెక్టర్ లైట్లు ఏర్పాటు చేశారు. మార్చి 19 వరకు అన్నీ ఉన్నాయి. మే 9న చేసిన తనిఖీల్లో కొన్ని లైట్లు అదృశ్యమైనట్టు గుర్తించారు. ఇప్పటి వరకు మొత్తం 3,800 వెదురు లైట్లు, 36 ప్రొజెక్టర్ లైట్లను దొంగలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. ఆలయ ప్రతినిధుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.





600 నుంచి 60 కిలోలకు

స్వల్ప కాలంలోనే 542 కిలోలు తగ్గిన సౌదీ అరేబియన్

న్యూఢిల్లీ, ఆగస్టు 14: సుమారు 610 కిలోల బరువుతో ప్రపంచంలోనే అత్యంత బరువైన వ్యక్తిగా గుర్తింపు పొందిన సౌదీ అరేబియాకు చెందిన ఖలీద్ బిన్ మోహసేన్ షరీ బరువు ఇప్పుడు 63.5 కేజీలు. అత్యంత భారీ కాయంతో బరువు కారణంగా మూడేండ్లకు పైగా ఖలీద్ మంచానికే పరిమితమయ్యాడు. అతని ఆరోగ్యం రోజురోజుకు క్షీణించడం, వైద్యానికి ఖర్చు ఎక్కువ కావడంతో దానిని భరించలేక పోయాడు. ఈ క్రమంలో అతడి పరిస్థితిపై సౌదీ అరేబియా మాజీ రాజు అబ్దుల్లా స్పందించి అతనికి వైద్య సహాయాన్ని అందించారు. నిపుణులైన 30 మంది వైద్యులను ఏర్పాటు చేశారు. వారి పర్యవేక్షణలో డైట్ నిబంధనలతో పాటు పలు సర్జరీలు చేయడంతో ఆరు నెలల్లోనే తన బరువును సగానికి తగ్గించుకున్నాడు. 2023 నాటికి అతని బరువు 542 కేజీలు తగ్గి 63.5కిలోలకు తగ్గడంతో ఇప్పుడు చలాకీగా తన పనులు చేసుకుంటున్నాడు.




జుట్టు కత్తిరించుకోండి

యుద్ధంతో నీళ్లు, సబ్బులకు తీవ్ర కొరత

గాజాలో అమ్మాయిలకు దయనీయ పరిస్థితి

గాజా, ఆగస్టు 14: ఇజ్రాయిల్ - పాలస్తీనా మధ్య గత పది నెలలుగా కొనసాగుతున్న యుద్ధంతో పాలస్తీనాలోని గాజాలో తీవ్ర సంక్షోభ పరిస్థితులు తలెత్తాయి. గాజాకు రవాణా వ్యవస్థలను ఇజ్రాయిల్ బలగాలు స్తంభింపజేయడంతో గాజాలో అన్ని వస్తువులకు కొరత ఏర్పడింది. ఇక్కడి ప్రజలకు కనీస అవసరాలు కూడా అందడం లేదు. నీళ్ల కొరత వేధిస్తున్నది. చెత్త సేకరణ, మురుగు శుద్ధి సరిగ్గా జరగడం లేదు. శాంపూలు, సబ్బులు, దువ్వెనలు, రుతుక్రమం సమయంలో అవసరమయ్యే వస్తువులు సైతం లేక అమ్మాయిలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జబ్బులు, ఇన్ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దువ్వెనలు కూడా లేకపోతే గాజాలోని ఆడపిల్లలు జుట్టు కత్తిరించుకోవాలని పీడియాట్రిషియన్ డాక్టర్ లోబ్నా అల్ అజైజా సూచించారు. శిబిరాల్లో నివసిస్తున్న ప్రజలకు దద్దుర్లు, ఫంగల్ ఇన్ఫెక్షన్లు వస్తున్నట్టు ఆమె తెలిపారు.

ఉక్రెయిన్ అదుపులో 100 మంది రష్యా సైనికులు!



కీవ్, ఆగస్టు 14: తమ బలగాలు రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలో మరింత ముందుకు చొచ్చుకెళ్తున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ బుధవారం తెలిపారు. ఉక్రెయిన్ మిలిటరీ చీఫ్ ఒలెక్సాండ్ర్ సైర్స్కీతో ఆయన వీడియో కాల్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ బలగాలు రష్యా సరిహద్దు దాటిన తర్వాత కిలోమీటరు నుంచి రెండు కిలోమీటర్ల వరకు రష్యాలోకి తమ బలగాలు ప్రవేశించాయని తెలిపారు. 100 మంది రష్యా సైనికులు తమ అదుపులో ఉన్నారని, ఇది తమ పిల్లలు తిరిగి ఉక్రెయిన్ చేరుకునేందుకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. రష్యాలోని 74 నివాస ప్రాంతాలు తమ ఆధీనంలోకి వచ్చినట్టు ప్రకటించారు.

భారతీయులకు అడ్వైజరీ

రష్యా ఆధీనంలో ఉన్న ప్రాంతాలకు ఉక్రెయిన్ బలగాలు చేరాయనే వార్తల నేపథ్యంలో రష్యాలో ఉన్న భారతీయులకు భారత రాయబార కార్యాలయం అడ్వైజరీ జారీ చేసింది. బ్రయాన్స్క్, బెల్గొరొడ్, కుర్స్క్ ప్రాంతాల్లో నివసించే భారతీయులు ఇటీవలి భద్రతా సంఘటనల దృష్ట్యా తాత్కాలికంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది.

కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. ఢిల్లీ మద్యం పాలసీపై సీబీఐ నమోదు చేసిన కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు చేసేందుకు న్యాయస్థానం బుధవారం తిరస్కరించింది. మరోవైపు తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం సీబీఐని ఆదేశించింది.

అయోధ్య రాముని విగ్రహ శిల్పికి అమెరికా వీసా తిరస్కరణ

న్యూఢిల్లీ: అయోధ్య ఆలయంలోని బాలక్ రామ్ విగ్రహ శిల్పి అరుణ్ యోగిరాజ్‌కు వీసాను అమెరికా నిరాకరించినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 1 వరకు వర్జీనియాలో జరిగే ప్రపంచ కన్నడ మహా సభలకు ఆయన హాజరుకావలసి ఉంది. ఇటీవల ఆయనకు ప్రపంచ గుర్తింపు లభించిన నేపథ్యంలో వీసా నిరాకరణకు గురికావడం పట్ల కుటుంబ సభ్యులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.



ప్రిస్కిల్లాకు ప్రేమతో..

భార్య నిలువెత్తు విగ్రహాన్ని చెక్కించిన జుకర్‌బర్గ్

న్యూఢిల్లీ: ప్రేమను ప్రదర్శించేందుకు మాటలే అక్కర్లేదు.. చేతల ద్వారానూ దానిని బయటపెట్టొచ్చు. సరిగ్గా అదే చేశారు ఫేస్‌బుక్ బాస్, మెటా బిలియనీర్ మార్క్ జుకర్‌బర్గ్. భార్య ప్రిస్కిల్లా చాన్ విగ్రహాన్ని చెక్కించి ఇంటి పెరట్లో ప్రతిష్ఠించి ఆమెపై తనకున్న ప్రేమను చాటిచెప్పారు. పూర్తి నీలం రంగులో ఉన్న విగ్రహం ఒంటిపై వెండి రంగులో ఉన్న వస్త్రం గాల్లో ఎగురుతున్నట్టుగా ఉంది. అత్యద్భుతంగా ఉన్న ఈ విగ్రహాన్ని న్యూయార్క్‌కు చెందిన డేనియల్ అర్షమ్ రూపొందించారు. ఈ విగ్రహం చెంత నిల్చుని కాఫీ తాగుతున్న ప్రిస్కిల్లా ఫొటో, విగ్రహం వీడియోను జుకర్‌బర్గ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. 'భార్య విగ్రహాన్ని చెక్కే రోమన్ సంస్కృతిని తిరిగి తీసుకొచ్చాం. థ్యాంక్యూ డేనియల్ అర్షమ్' అని దానికి క్యాప్షన్ తగిలించారు. హార్వర్డ్‌లోని ఓ కాలేజీ పార్టీలో 2003లో కలుసుకున్న జుకర్‌బర్గ్-ప్రిస్కిల్లా 12 ఏండ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పూడికతీతపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం

- ఇప్పటికే ప్రభుత్వానికి ఇరిగేషన్‌శాఖ నివేదిక

హైదరాబాద్, ఆగస్టు 14(నమస్తే తెలంగాణ): ప్రాజెక్టుల్లో పూడికతీతకు ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న మార్గదర్శకాలపై అధ్యయనం చేయాలని నీటిపారుదల శాఖ భావిస్తున్నది. సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని క్యాబినెట్ సబ్ కమిటీకి ఇటీవల నివేదిక అందజేసింది. దేశవ్యాప్తంగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ మాత్రమే పూడికతీత పాలసీలను అమలు చేస్తున్నాయని నీటిపారుదల శాఖ తెలిపింది. ఆయా రాష్ట్రాలు అమలుచేస్తున్న పాలసీల్లోని అంశాలను నివేదికలో పొందుపరిచింది. ఇప్పటికే రాజస్థాన్ సందర్శించామని, మిగిలిన రాష్ట్రాల్లోనూ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని పేర్కొన్నది. తద్వారా సమగ్రమైన విధానాలను రూపొందించుకునే అవకాశం ఉంటుందని తెలిపింది.

ముగిసిన రాష్ట్ర బృందం విదేశీ పర్యటన

- రెండు దేశాల నుంచి 36 వేల కోట్ల పెట్టుబడులు
- 25 కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర బృందం అమెరికా, దక్షిణ కొరియా ముగించుకొని బుధవారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ పర్యటనల సందర్భంగా రూ.36 వేల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు ప్రభుత్వం ప్రకటించింది. అమెరికా పర్యటనలో రూ.31,502 కోట్ల పెట్టుబడులు, దక్షిణ కొరియా పర్యటనలో రూ. 4,500 కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు తెలిపింది. రెండు దేశాల్లో మొత్తం 25 కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. జేఐ టెక్ కంపెనీ రూ. 100 కోట్లతో ఎల్‌ఈడీ మెటీరియల్ తయారీ ప్లాంట్, చావి కంపెనీ ఈవీ చార్జింగ్ ఇన్‌ఫ్రాను తయారు చేయనున్నట్టు ప్రకటించింది. ఎల్‌ఎస్ గ్రూప్, పోస్కో, తదితర కంపెనీల ప్రతినిధులతోనూ బృందం చర్చలు జరిపింది.

ప్రపంచంతోనే మా పోటీ


కోకాపేటలో కాగ్నిజెంట్ నూతన ప్రాంగణాన్ని ప్రారంభించిన సందర్భంగా కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

మొదటిపేజీ తరువాయి...

బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..హైదరాబాద్‌కు 430 సంవత్సరాల చరిత్ర ఉన్నదని, ఎన్ని వ్యవస్థలు మారినా ప్రతి ఒక్కరూ హైదరాబాద్ అభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు. ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్టు హైదరాబాద్‌ను నాలుగో ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనుకుంటున్నట్టు వెల్లడించారు. చైనా ప్లస్ వన్ కంట్రీ కోసం అమెరికా, సౌత్‌కోరియా తదితర దేశాలు ఎదురుచూస్తున్నాయని వాటన్నింటికి ఫ్యూచర్ సిటీ హైదరాబాద్ సమాధానం చెప్తుందని అన్నారు. తమ పర్యటనల ద్వారా రాష్ట్రానికి రూ.31,500 కోట్ల పెట్టుబడులు తెచ్చామని, 30,750కి పైగా ఉద్యోగాలు లభించనున్నాయని సీఎం తెలిపారు. త్వరలోనే మరిన్ని ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్టు చెప్పారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రపంచంలో ప్రతి ఒక్కరూ హైదరాబాద్ గురించే మాట్లాడుతున్నారని అన్నారు. ఒక్క రోజులోనే ఇక్కడ ఐటీ రంగం అభివృద్ధి చెందలేదని, 1992లో ప్రారంభమైన ఐటీ పరిశ్రమను ఎంతో మంది ముఖ్యమంత్రులు అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కాగ్నిజెంట్ అమెరికన్ ప్రెసిడెంట్ సూర్యగుమ్మడి మాట్లాడుతూ.. తమ నెట్‌వర్క్‌లో హైదరాబాద్ కీలకమైన హబ్ అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా కాగ్నిజెంట్‌కు 3.46 లక్షల మంది ఉద్యోగులు ఉంటే అందులో భారతదేశంలోనే 2.40 లక్షల మంది, వారిలో 57వేల మంది హైదరాబాద్‌లోనే ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేశ్‌రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి వేముల శ్రీనివాసులు, కాగ్నిజెంట్ ప్రతినిధులు క్యాథీ, జాన్‌కిమ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందాలతో ఒరిగేదేంటి?

- కంపెనీలు ప్రారంభిస్తేనే ఉద్యోగాలు వచ్చేది
- ఎంవోయూలకు ఎటువంటి చట్టబద్ధత లేదు
- బీఆర్‌ఎస్ హయాంలో వచ్చిన దిగ్గజ కంపెనీలు


విదేశీ పర్యటనలో భాగంగా వివిధ కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర బృందం (ఫైల్)

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ఇల్లు అలకగానే పండుగ అయిపోయినట్టుంది రాష్ట్ర ప్రభుత్వ వైఖరి. అమెరికా, దక్షిణ కొరియా దేశాల పర్యటన సందర్భంగా రూ.36 వేల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెబుతుండగా, ఇందులో కార్యరూపం దాల్చేదెంత అన్నది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. గత జనవరిలోనూ ఇలాగే ప్రభుత్వం దావోస్‌లో రూ.40,232 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు చేసుకున్నట్టు ప్రకటించింది. కానీ వాటిలో ఏ ఒక్క కొత్త కంపెనీ ఇంతవరకు ప్రారంభమైన దాఖలాలు లేవు. జనవరిలో దావోస్‌లో, తాజాగా అమెరికా, దక్షిణ కొరియా దేశాల పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వం రికార్డుస్థాయిలో రూ. 76,232 కోట్ల పెట్టుబడులు సాధించినట్టు బుధవారం ప్రకటన జారీ చేసింది. ఇందులో చాలా కంపెనీలు గతంలో ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాలు చేసుకున్నవే కావడం గమనార్హం. వాస్తవానికి ప్రభుత్వం చెబుతున్నట్టుగా ఇవి పెట్టుబడులు కాదు, కేవలం ఒప్పందాలు మాత్రమే. ప్రభుత్వంతో ఆయా కంపెనీలు చేసుకున్న అవగాహనా ఒప్పందాల(ఎంఓయు)కు ఎటువంటి చట్టబద్ధత ఉండదు. ఈ ఎంఓయులు ఏ మేరకు కార్యరూపం దాల్చుతాయో అనేది సదరు కంపెనీ ఇక్కడ భూములు కొనుగోలుచేసి కంపెనీ ప్రారంభించేవరకు చెప్పడం కష్టం.

చట్టబద్ధత లేని ఎంఓయూలతో కంపెనీలు వచ్చేనా?

చాలా కంపెనీలు ఎంఓయూలు కుదుర్చుకోవడంలో చూపిన ఉత్సాహం కంపెనీ ఏర్పాటుపై చూపడంలేదు. హడావుడిగా పెట్టుబడులు ప్రకటించి, ప్రభుత్వంతో ఎంఓయులు కుదుర్చుకొని అనంతరం ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ ఒడిదుడుకులు, ఇతర రాష్ట్రాలు ఇచ్చే రాయితీలు తదితర అనేక అంశాల వల్ల వెనక్కు పోతున్నాయి. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఎంఓయులన్నీ పెట్టుబడులుగా చెప్పేందుకు అవకాశం లేదు. ఉమ్మడి లక్ష్యంతో రెండు, లేక అంతకన్నా ఎక్కువ పక్షాలు కలిసి పని చేసేందుకు అంగీకరిస్తూ సంతకాలు చేస్తే దీనికి చట్టబద్ధత ఉంటుంది. ఏ పక్షమైనా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే న్యాయస్థానానికి వెళ్లి నష్టపరిహారం కోరవచ్చు. ఎంవోయుకు విషయానికొస్తే, ఇది కేవలం ఇరు పక్షాలు పరస్పర అవగాహనతో సూత్రప్రాయంగా కుదుర్చుకునే ఒప్పందం మాత్రమే. దీనికి కచ్చితమైన నియమ నిబంధనలు ఏవీ ఉండవు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంతో పలు కంపెనీలు చేసుకుంటున్న ఎంవోయులకు ఏ మేరకు ప్రాధాన్యం ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఆ రెండు కంపెనీలపై అనుమానాలు: క్రిశాంక్

అమెరికా పర్యటనలో రెండు కంపెనీలతో సీఎం రేవంత్‌రెడ్డి చేసుకున్న ఒప్పందాలపై అనుమానాలున్నాయని బీఆర్‌ఎస్ పార్టీ నేత మన్నె క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ రెండు కంపెనీల్లో ఒకటి స్వచ్ఛ్ బయో కాగా మరొకటి వాల్ష్‌కర్రా అని పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి సమాలోచనలు జరిపే కంపెనీల జాబితాను సీఎంవో విడుదల చేసిందని, అందులో సిగ్నా, ఆర్‌సీఎం, ఆగ్గా, ప్రాక్టర్ అండ్ గాంబుల్, ర్యాపిడ్, సహ 15 కంపెనీలు ఉన్నాయని ఈ రెండు కంపెనీల పేర్లు వెల్లడించలేదని తెలిపారు.

..మళ్లీ మొండిచెయ్యే!

మొదటిపేజీ తరువాయి...

సంఖ్య 12.93 లక్షలు తగ్గింది! దీంతో రుణమాఫీపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమకు రుణమాఫీ అవుతుందో లేదోనని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

2 లక్షల రుణమాఫీ 6 లక్షల మందికే...

తొలి రెండు విడతల రుణమాఫీలో అర్హుల సంఖ్యలో భారీగా కోత పడటంతో కనీసం చివరిదైన మూడో విడతలోనైనా తమకు న్యాయం జరుగుతుందేమోనని రైతులు ఆశపడ్డారు. కానీ, మూడో విడతలోనూ భారీ కోతలకు సర్కార్ రంగం సిద్ధం చేసినట్టు అర్థమవుతున్నది. ఈ విడతలో ఆరు లక్షల మంది రైతులను మాత్రమే అర్హులుగా తేల్చారు. వీరికి రూ.ఆరు వేల కోట్లను మాఫీ చేయనున్నారు. దీంతో ఈ విడతలోనూ చాలా మంది రైతులకు మొండిచెయ్యి ఎదురవుతున్నది. ఈ విడతతో రుణమాఫీ పూర్తవుతుందా? మిగిలిపోయిన రైతులకు మరో విడత అమలు చేస్తారా? అనేదానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో ఈ విడతలో రుణమాఫీ పొందని వారి పరిస్థితి ఏమిటనే ఆందోళన రైతుల్లో నెలకొన్నది.

మాఫీ 24 లక్షల మందికే!

రాష్ట్రంలో పంట రుణాలు తీసుకున్న రైతులు 70 లక్షల మంది ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా వెల్లడించారు. ఈ లెక్కన కాస్త అటూ ఇటూగా 70 లక్షల మందికి రుణమాఫీ కావాలి. కానీ, మూడు విడతల్లో కలిపి ప్రభుత్వం సుమారు 24 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేస్తున్నది. ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేస్తామన్న ప్రభుత్వం తొలి విడతలో జూలై 18న రూ.లక్ష వరకు రుణాలు ఉన్నవారిలో 11.34 లక్షల మందికి మాత్రమే రూ.6,034.96 కోట్ల రుణాలను మాఫీ చేసింది. జూలై 30న రెండో విడతలో రూ.1.5 లక్షల వరకు రుణం ఉన్నవారిలో 6.40 లక్షల మందికి మాత్రమే రూ.6,190 కోట్లు మాఫీ చేసింది. మూడో విడతలో భాగంగా రూ.2 లక్షల వరకు రుణాలను ఈ నెల 15న మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సుమారు ఆరు లక్షల మంది రైతులకు చెందిన రూ.ఆరు వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ లెక్కన మూడు విడతల్లో కలిపి రుణమాఫీ పొందిన రైతుల సంఖ్య 23.75 లక్షలు మాత్రమే. దీంతో దాదాపు 46.25 లక్షల రైతులు రుణమాఫీకి నోచుకోలేకపోతున్నారు. పోనీ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పిన లెక్క ప్రకారం రుణం తీసుకున్న రైతుల సంఖ్య 44 లక్షలు అనుకున్నా ప్రభుత్వం 20.25 లక్షల మంది రైతులను రుణమాఫీకి దూరం చేస్తున్నదనే విమర్శలున్నాయి. వాస్తవానికి 2018తో పోల్చితే ప్రస్తుతం రైతుల సంఖ్య భారీగా పెరిగింది. రైతుబంధు లెక్కల ప్రకారం 2018లో కేవలం 50 లక్షల మంది రైతులు ఉండగా ఇప్పుడు ఈ సంఖ్య 70 లక్షలకు చేరింది. అయినప్పటికీ రుణమాఫీలో అర్హుల సంఖ్య తగ్గడం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

31వేల కోట్లకు చేసేది 18 వేల కోట్లే!

వాస్తవానికి రూ.2 లక్షల రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం తొలుత తెలిపింది. కానీ, రూ.18 వేల కోట్లతో రుణమాఫీ కథ ముగించేలా కనిపిస్తున్నది. ప్రభుత్వం చెప్పిన రూ.31 వేల కోట్లతో పోల్చితే రూ.12,775 కోట్లు తగ్గడం గమనార్హం. ఈ మేరకు రైతులకు నష్టం జరిగిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రుణమాఫీ కింద రైతులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన దానికంటే కాంగ్రెస్ ఇస్తున్న మొత్తం చాలా తక్కువగా ఉండటం గమనార్హం. బీఆర్‌ఎస్ సర్కారు చేసిన రూ.లక్ష రుణమాఫీతో పోల్చితే కాంగ్రెస్ సర్కార్ రూ.2 లక్షల రుణమాఫీకి రూ.919 కోట్లు తక్కువగా ఖర్చు చేస్తుండటం గమనార్హం. కాంగ్రెస్ సర్కారు రైతు రుణమాఫీలో అడ్డగోలు కోతలు పెట్టి, లక్షల మంది రైతులను అనర్హులుగా తేల్చి, వారి కడుపులు కొట్టిందనే విమర్శలు పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి.

నేడు 2 లక్షల వరకు రుణమాఫీ

ఇప్పటికే రెండు విడతల్లో రూ.1.5 లక్షల వరకు రైతుల రుణమాఫీ చేసిన ప్రభుత్వం గురువారం రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయనున్నది. రూ.2 లక్షల వరకు రుణమాఫీలో భాగంగా సుమారు ఆరు లక్షల మంది రైతులకు చెందిన రూ.6 వేల కోట్ల రుణాలను మాఫీ చేయనున్నట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

సివిల్‌సప్లైలో 166 మంది ఉద్యోగులకు పదోన్నతులు


పౌరసరఫరాల శాఖ ఉద్యోగులు 166 మందికి పదోన్నతులు కల్పిస్తూ కమిషనర్ డీఎస్ చౌహాన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పదోన్నతులతో ఖాళీ అయిన పోస్టులను ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. రేషన్ బియ్యం సబ్సిడీ కోసం ప్రభుత్వం రూ. 2వేల కోట్లు విడుదల చేసిందని వెల్లడించారు. -హైదరాబాద్, నమస్తే తెలంగాణ

రాష్ట్రం నుంచి రాజ్యసభకు సింఘ్వీ

- రాజస్థాన్ నేత ఎంపికపై తెలంగాణ నేతల ఆగ్రహం
- తెలంగాణలో ఒక్క నేత దొరకలేదా అంటూ మండిపాటు



హైదరాబాద్, ఆగస్టు 14(నమస్తే తెలంగాణ): తెలంగాణకు చెందినవారికి దక్కాల్సిన రాజ్యసభ సభ్యత్వాన్ని ఉత్తరాదికి చెందిన తమ పార్టీ నేతకు కట్టబెట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. సీనియర్ నేత కే కేశవరావు రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి జరిగే ఎన్నికలో అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభిషేక్ సింఘ్వీ ఎంపికపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు అంతర్గతంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణకు వచ్చిన అవకాశాన్ని రాజస్థాన్‌కు చెందిన నేతకు ఇవ్వడమేంటని ప్రశ్నిస్తున్నారు. లేకలేక వచ్చిన అవకాశం, ఒకే ఒక్క స్థానానికి జరుగుతున్న ఎన్నికలో ఆ అవకాశాన్ని కూడా తెలంగాణ నేతలకు ఇవ్వకపోవడంపై మండిపడుతున్నారు. రాజ్యసభకు పంపించేందుకు తెలంగాణ నుంచి ఒక్క నేత కూడా దొరకలేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. రాజ్యసభ సీటును ఆశించిన పలువురు నేతలు అటు కేంద్ర, ఇటు రాష్ట్ర పార్టీల అధిష్ఠానంపై గుర్రుగా ఉన్నట్టు తెలిసింది. వైఎస్ హయాంలో కూడా ఇదే విధంగా తెలంగాణకు దక్కాల్సిన రాజ్యసభ పదవులను ఇతర రాష్ట్రాలవారికి కట్టబెట్టిన వైనాన్ని వారు గుర్తు చేసుకుంటున్నారు.

తొలి రోజు నామినేషన్లు నిల్

రాష్ట్రంలో జరుగనున్న ఏకైక రాజ్యసభ స్థానం ఉపఎన్నికకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్‌తోపాటు నామినేషన్ల స్వీకరణను ప్రారంభించగా తొలి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

బస్సులో ఎల్లిపాయ పొట్టుతీస్తే తప్పా?

- కూరగాయలు అమ్మినా తప్పులేదు
- ఫ్రీబస్‌లో స్త్రీనిధి సర్వసభ్య సమావేశంలో మంత్రి సీతక్క



హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): బస్సుల్లో మహిళలు ఎల్లిపాయల పొట్టు తీయడం తప్పెలా అవుతుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖల మంత్రి సీతక్క ప్రశ్నించారు. మహిళలు తమ ప్రయాణ సమయాన్ని వృథా చేసుకోకుండా పనులు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కొందరు కుట్లు, అల్లికలు చేసుకుంటున్నారని పేర్కొన్న మంత్రి.. కూరగాయలు అమ్ముకున్నా తప్పేమీ లేదని అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బుధవారం జరిగిన స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ 11వ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత ప్రయాణాన్ని అవహేళన చేస్తూ కొందరు వీడియోలు రూపొందించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, మహిళా సాధికారతను తట్టుకోలేకే ఆ పథకంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు చేయూతనిస్తుంటే ఎందుకంత అక్కసు వెళ్లగక్కుతున్నారని ప్రశ్నించారు. సచివాలయంలో ప్రారంభమైన మహిళా శక్తి క్యాంటీన్లను జిల్లాలకు విస్తరిస్తున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమరశంఖం

- సెప్టెంబర్ 2 నుంచి నిరసనలకు శ్రీకారం
- సమస్యల పరిష్కారానికి దశలవారీ ఉద్యమాలు
- పాలక పక్షాల ఎదుట 10 ప్రధాన డిమాండ్లు
- ముగిసిన ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ సమావేశాలు



హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ కార్యవర్గ ముగింపు సమావేశంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నాయకులు

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్త ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) సమరశంఖం పూరించింది. సెప్టెంబర్ 2 నుంచి నిరసనలకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. సమస్యల పరిష్కారానికి దశలవారీ ఉద్యమాలు చేపట్టాలని, సమ్మెలే శరణ్యమని పిలుపునిచ్చింది. హైదరాబాద్‌లో జరుగుతున్న ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఫెడరేషన్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుభాశ్‌లాంబ, శ్రీకుమార్ మాట్లాడారు. ఉద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సెప్టెంబర్ 2న దేశవ్యాప్తంగా మధ్యాహ్న భోజన సమయంలో నిరసనలకు సమాఖ్య పిలుపునిచ్చారు. 10 ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఐదేండ్లకోసారి పీఆర్సీ అమలుచేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీచేయాలని, ఆదాయపు పన్ను పరిమితిని 10 లక్షలకు పెంచాలని, ప్రైవేటీకరణను నిలిపివేయాలని, నల్లచట్టాలను రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశాల్లో టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కొండల్‌రెడ్డి, ఉమాదేవి, మాధవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా జేఏసీ ఉద్యమ కార్యాచరణ: మారం జగదీశ్వర్

తెలంగాణలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాలన్నీ కలిసి జేఏసీగా ఏర్పడినట్టు టీఎన్జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఏఐఎస్‌జీఈఎఫ్ ముగింపు సమావేశంలో వెల్లడించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించనున్నట్టు తెలిపారు. వివిధ సమస్యలపై ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో దశల వారీగా కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు.

విరుద్ధమైన చట్టాలను రద్దుచేయాలి: ఎస్‌ఎం హుస్సేని

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త చట్టాల్లో ఉద్యోగుల హక్కులకు భంగం కలిగించే చట్టాలను రద్దుచేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం హుస్సేని (ముజీబ్) ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ప్రతినిధులు ఆమోదించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమంలోని ఉద్యోగులు, కార్మికులు, రైతుల హక్కులకు విరుద్ధమైన సెక్షన్లను రద్దుచేయాలని ఆ తీర్మానంలో ఆయన కోరారు.

సాగునీరు ఇవ్వాలని నిరసన


సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం లింగగిరి మేజర్ కాల్వకు సాగునీటిని అందజేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్‌రెడ్డి బుధవారం రైతులతో కలిసి కాల్వలో దిగి నిరసన తెలిపారు. 3 కిలోమీటర్ల వరకు చెత్తాచెదారంతో నిండిపోవటంతో నీరు రాని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. - హుజూర్‌నగర్

జీతాలు లేక ఐదు నెలలుగా పస్తులే..



ఐదు నెలలుగా వేతనాలివ్వడం లేదని మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖాన అవుట్‌సోర్సింగ్ వైద్య సిబ్బంది కలెక్టర్‌ను కలిసి గోడువెల్లబోసుకున్నారు. జీతాలు రాకపోవడంతో పస్తులుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం దవాఖాన ఎదుట నిరసన తెలిపారు. - మహబూబ్‌నగర్

రెగ్యులర్ టీచర్లను వెంటనే కేటాయించాలి

రెగ్యులర్ టీచర్లను కేటాయించాలని కోరుతూ బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం రంగాపురం ప్రాథమిక పాఠశాల ఎదుట విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఇద్దరు ఉపాధ్యాయులు పదోన్నతిపై వెళ్తే.. 20 రోజులుగా వేరే పాఠశాల నుంచి రోజుకో టీచర్‌ను పంపడంపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. - పాల్వంచ



గృహజ్యోతికి కొత్త దరఖాస్తులు



హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): గృహజ్యోతి పథకానికి అర్హులై ఉండి గతంలో దరఖాస్తు చేసుకోలేని వారికి తిరిగి అవకాశం కల్పించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. జెన్‌కో ఆధ్వర్యంలో విద్యుత్తు ప్లాంట్లల్లో ఏర్పడే సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు త్రిసభ్య కమిటీని వేయాలని ఆదేశించారు. 2023 డిసెంబర్‌కు ముందు గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై నివేదించాలని సూచించారు. జల విద్యుత్తు కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు ఎదురైతే అలసత్వం వహించొద్దని, వెంటనే తన దృష్టికి తేవాలని చెప్పారు. సమీక్షలో ఇంధనశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): దివంగత అడిషనల్ డీసీపీ మురళి కుమారుడు పీ పృథ్వీరాజ్‌కు ప్రభుత్వం నాయబ్ తహసీల్దార్‌గా ఉద్యోగం ఇచ్చింది. మురళి గతేడాది నవంబర్ 28న విధుల్లో ఉండగా మరణించారు. పోలీస్ శాఖ అభ్యర్థన మేరకు ఆయన కుమారుడికి నాయబ్ తహసీల్దార్ ఉద్యోగం ఇస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు.

18న సర్వాయి పాపన్న జయంతి

హైదరాబాద్, ఆగస్టు14 (నమస్తే తెలంగాణ):సర్దార్‌సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి సంవత్సరం ఆగస్టు 18న జయంతి ఉత్సవాలు, ఏప్రిల్ 2న వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది.

కేసీఆర్‌ను కలిసిన జీసీసీ మాజీ చైర్మన్

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర గిరిజన సహకార సంస్థ మాజీ చైర్మన్ వాల్యానాయక్ దంపతులు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బుధవారం కలిశారు. ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఆయనను కలిసి తన కుమారుడు అరుణ్‌కుమార్ వివాహ ఆహ్వాన పత్రికను వారు అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తండాబాట కార్యక్రమం సందర్భంగా కేసీఆర్ వాల్యానాయక్ నివాసంలో బస చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 18న హయత్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో వివాహం, శంషాబాద్‌లో రిసెప్షన్‌ను ఏర్పాటు చేసినట్టు ఈ సందర్భంగా వాల్యానాయక్ కేసీఆర్‌కు వివరించారు. వాల్యానాయక్ వెంట మాజీ ఎంపీపీ కమల, ఆయన కుటుంబసభ్యులు జేవేందర్, ఆనంద్‌నాయక్, అరుణకుమార్, అనిత ఉన్నారు.

సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలి: సీఎస్

హైదరాబాద్,ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు కలెక్టర్లు పటిష్ఠమైన నిఘా ఉంచాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి ఆదేశించారు. బుధవారం ఆమె కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలను, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ ప్రగతిని సమీక్షించారు. కలెక్టర్లతోపాటు జిల్లాలోని ఇతర ఉన్నతాధికారులు అన్ని పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు సోకే జ్వరాల నివారణకు సకాలంలో స్పందించాలని, తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. ఆహారం, పారిశుధ్యాన్ని కూడా తనిఖీ చేయాలని తెలిపారు.



ప్రతిగడపకూ స్వాతంత్ర్య ఫలాలు చేరాలి

మొదటిపేజీ తరువాయి...

పోరాట స్ఫూర్తితో శాంతియుతమార్గంలో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, ప్రజల సహకారంతో పదేండ్ల అనతికాలంలోనే దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో సబ్బండ వర్గాల అభ్యున్నతి దిశగా దేశ పాలకులు కార్యాచరణను మరింత చిత్తశుద్ధితో అమలు చేయాలని, ఆ ఫలితాల సాధన ద్వారానే స్వాతంత్ర్య పోరాట త్యాగధనులకు మనం అర్పించే ఘన నివాళి అని కేసీఆర్ పేర్కొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అండ

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్ • 44 మంది కుటుంబాలకు బీమా సొమ్ము అందజేత

హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బుధవారం ములుగు నియోజకవర్గం చుంచుపల్లె గ్రామానికి చెందిన మానసకు, దుబ్బాక నియోజకవర్గం పెద్ద గుండవల్లి గ్రామానికి చెందిన మల్లవ్వకు బీమా మంజూరుపత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్ తెలిపారు. ఇటీవల మరణించిన 44 మంది పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున బీమా క్లెయిమ్ సొమ్ము మంజూరు పత్రాలను బుధవారం తెలంగాణ భవన్‌లో పార్టీ నాయకులతో కలిసి అందజేశారు. పార్టీ కార్యకర్తలు చనిపోతే వారి కుటుంబం రోడ్డున పడకుండా ఉండేందుకు పార్టీ అధినేత కేసీఆర్ కార్యకర్తలందరికీ ఇన్సూరెన్స్ చేయించాలని నిర్ణయించినట్టు తెలిపారు. కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల సాయం అందించే విధంగా పార్టీ బీమా ప్రీమియం చెల్లించిందని తెలిపారు. ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చే సమాచారం ఆధారంగా దరకాస్తులను ఇన్సూరెన్స్ కంపెనీలకు పంపి, వాటి ఆమోదం రాగానే బీమా మంజూరు పత్రాన్ని అందిస్తారని, ఆ తర్వాత రెండు లక్షల చెక్కును మృతిచెందిన పార్టీ కార్యకర్త ఇంటికెళ్లి పార్టీ ముఖ్య నేతలు అందిస్తారని తెలిపారు. చనిపోయిన ఎందరో కార్యకర్తల కుటుంబాలకు ఈ బీమా సొమ్ముతో మేలు జరిగిందని తెలిపారు.

లోకం పోకడ



హరీశ్ మాటల్లో తప్పేమున్నది?

- ఉన్నమాటంటే ఉలుకెందుకు?
- 'సీతారామ' సహా అన్ని అంశాలపై బహిరంగ చర్చకు మేము సిద్ధం
- జీవో 33ను వెంటనే రద్దు చేయాలి
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ధ్వజం



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో భిక్షమయ్యగౌడ్, చింతల

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : 'సీతారామ ప్రాజెక్టుపై హరీశ్‌రావు అన్న మాటల్లో తప్పేమున్నది?, ఉన్నమాటంటే ఉలుకెందుకు? ఓ మంత్రి కంటతడి పెట్టడం ఎందుకు?.. హరీశ్ మాట్లాడిన దాంట్లో అభ్యంతరకర పదాలు ఏమున్నయ్?' అంటూ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. సీతారామ సహా అన్ని అంశాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి ఒక్క లేఖయినా రాసిందా? అంటూ నిలదీశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ నేతలు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, తుంగ బాలుతో కలిసి జగదీశ్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయని, కిరణ్ కుమార్‌రెడ్డికంటే బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వం రేవంత్ రెడ్డిది అని విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే సీతారామ పనులు దాదాపుగా పూర్తయ్యాయని, కనీసం బటన్ నొక్కేప్పుడైనా కేసీఆర్ కష్టం గురించి చెప్పాలని మంత్రులను కోరామని తెలిపారు. 'గురుకులాల్లో పరిస్థితులకు కూడా కేసీఆర్ కారణమని భట్టి అంటున్నారు.. ఇంతకన్నా దారుణం ఉంటుందా?, రోజూ మీరు పళ్లు తోముకోకుంటే కూడా కేసీఆర్‌దే బాధ్యతనా?' అంటూ ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా ఇంకా బీఆర్ఎస్ మీదే ఆరోపణలు చేస్తూ కాలం గడుపుతున్నదని, ఇప్పటి కోసం తొమ్మిది నెలల కిందే వండిపెట్టాల్సి ఉండేనా? అంటూ దుయ్యబట్టారు. ఉత్తమ్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, కనీసం అధికారులతో ఆయన మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టుపై కేసీఆర్ ప్రభుత్వం 2018 నుంచి 2022 దాకా వరుసగా కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపితే ఈ అనుమతులు వచ్చాయని, కాంగ్రెస్ వచ్చాక సీతారామ సహా ఏ ప్రాజెక్టు కోసమైనా కేంద్రానికి ఒక్క ఉత్తరమైనా రాసిందా? అని నిలదీశారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింతపై తప్పటడుగు వేసి బీఆర్ఎస్ ఒత్తిడితో వెనక్కి తగ్గారని, కాంగ్రెస్ హయాంలో లాగా కేసీఆర్ పాలనలో ఏ ప్రాజెక్టు అంచనాలను కూడా పది, పదిహేను రెట్లు పెంచలేదని గుర్తుచేశారు. కమీషన్లు ఇవ్వడం, తీసుకోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటని, కాలువలు తవ్వక ముందే మొబిలైజేషన్ అడ్వాన్సులు చెల్లించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదని, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు పదహారు చోట్ల కొబ్బరికాయలు కొట్టినా పనులు జరిగాయా? అంటూ నిలదీశారు. కేసీఆర్ పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారని, కాంగ్రెస్ నేతలు ఇంకా చంద్రబాబు, వైఎస్సార్ భజన చేస్తున్నారని దుయ్యబట్టారు. వాళ్లిద్దరూ తెలంగాణలో ఒక్క ఎక్కరానికైనా నీళ్లిచ్చారా? అని ప్రశ్నించారు. వైఎస్సార్ హయాంలో ఆంధ్రా, రాయల సీమ ప్రాజెక్టులు పూర్తయ్యాయని, తెలంగాణ ప్రాజెక్టులు పెండింగ్‌లో పడ్డాయని, రాయలసీమకు 350 టీఎంసీల సామర్థ్యమున్న ప్రాజెక్టులను పూర్తి చేశారని, తెలంగాణకు ఏం చేశారని, వైఎస్, చంద్రబాబు హయాంలో తెలంగాణలో మూడున్నర క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న ఒక్క చెరువునైనా కట్టారా? అంటూ నిలదీశారు. 'ఎవరి హయాంలో తెలంగాణ ప్రాజెక్టులు పూరయ్యాయో చర్చించేందుకు ఉత్తమ్ గాని, భట్టి గాని వస్తారా? వారు ఎక్కడికి రమ్మన్నా మేం సిద్ధం' అంటూ సవాల్ విసిరారు. నీళ్లిస్తే వడ్లు పండుతాయని, వడ్లు పండితే ఎక్కడ బోనస్ ఇవ్వాల్సి వస్తుందోన్న భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం ఉన్నా సాగునీరు ఇవ్వడం లేదని విమర్శించారు . తెలంగాణ పాలిట ద్రోహులెవరో, దొంగలెవరో తేలాల్సిందేనని చెప్పారు. ఎస్ఆర్‌బీసీ, ఎస్ఎల్‌బీసీ ఒకేసారి మొదలైతే ఎస్ఆర్‌బీసీ పూర్తయ్యింది గాని, ఎస్ఎల్‌బీసీ ఇంకా పూర్తి కాలేదని, ఎస్ఎల్‌బీసీపై కాంగ్రెస్ మంత్రులు హంతకులే సంతాప సభ పెట్టినట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టుపై మంత్రులు మాట్లాడిన ప్రతిదీ అబద్ధమేనని, వారి మాటలపై ఎక్కడైనా చర్చకు తాము సిద్ధమేనని జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ సోయి లేదని, తెలంగాణలోనే తెలంగాణ బిడ్డలను స్థానికేతరులను చేసే విధంగా జీవో 33 తెచ్చిందని, తెలంగాణకు ఇంతకన్నా ద్రోహం మరోటి ఉంటుందా అని ప్రశ్నించారు. రేవంత్ తన ఆంధ్రా మిత్రులనో, చంద్రబాబునో సంతృప్తి పరిచేందుకే జీవో 33 తెచ్చారా? అని నిలదీశారు. ఇప్పటికైనా సోయి తెచ్చుకొని జీవో 33ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.7°c	23.5°c
రంగారెడ్డి	37.0°c	23.1°c
మెదక్	36.8°c	23.6°c
నిజామాబాద్	33.3°c	24.9°c
కరీంనగర్	33.0°c	26.0°c
హైదరాబాద్	32.2°c	26.1°c
మహబూబ్‌నగర్	32.0°c	23.0°c
నల్లగొండ	32.0°c	24.4°c
ఖమ్మం	31.0°c	25.0°c
వరంగల్	26.0°c	22.0°c

ఏడు రోజులపాటు వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా ఏడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో వచ్చే నాలుగైదు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో అత్యధికంగా 6.67 సెం.మీ, చిన్నగూడురులో 4.36 సెం.మీ, నర్సింహులపేటలో 2.83 సెం.మీ, దంతాలపల్లిలో 2.79 సెం.మీ, రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌లో 3.96 సెం.మీ, నల్లగొండ జిల్లా గుర్రంపోడులో 3.49 సెం.మీ, గట్టుప్పల్‌లో 3.13 సెం.మీ, యాదాద్రి-భువనగిరి జిల్లా నారాయణపూర్‌లో 2.64 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది.

అవమానించబోయి..

మొదటిపేజీ తరువాయి...

ఆహ్వాన పత్రిక సిద్ధం చేసింది. ఇందులో మాజీ సీఎం కేసీఆర్‌కు హోదాకు తగిన ప్రాధాన్యం దక్కలేదు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు పాల్గొంటున్నట్టు అందులో పేర్కొన్నారు. మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహను విశిష్ట అతిథులుగా ప్రస్తావించారు. ప్రతిపక్ష నేతగా, క్యాబినెట్ ర్యాంకుకు సమాన హోదా ఉన్న కేసీఆర్ పేరును ఆహ్వాన పత్రికల్లో సాధారణ ఎమ్మెల్యేల వరుసలో చేర్చారు. పైగా 'గజ్వేల్ శాసన సభ్యులు' అని మాత్రమే సబోధించారు. ఈ నిర్ణయంపై అటు రాజకీయ పక్షాల నుంచి, ఇటు నిపుణుల నుంచి, సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ప్రభుత్వ సలహాదారుకన్నా ప్రధాన ప్రతిపక్ష నేత హోదానే పెద్దదని గుర్తు చేశారు. పైగా మాజీ సీఎం, ప్రస్తుత ప్రధాన ప్రతిపక్ష నేత కాబట్టి మంత్రులతో సమానంగా హోదా కల్పించాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రొటోకాల్ నిబంధనలను పరిశీలించాలని సూచించారు. క్యాబినెట్ మినిస్టర్లకు సమాన స్థాయిలో మాజీ ప్రధానులు, రాజ్యసభ, లోక్‌సభలో ప్రతిపక్ష నేతలకు గౌరవం ఇవ్వాలని నిబంధనల్లో ఉన్నాయని గుర్తు చేశారు. సంబంధిత పత్రాలను షేర్ చేశారు. ప్రభుత్వం యథేచ్ఛ గా, ఉద్దేశపూర్వకంగానే నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్టు స్పష్టం అవుతున్నదని మండిపడ్డారు.

నాలుక కరుచుకున్న ప్రభుత్వం

కేసీఆర్‌కు గౌరవం దక్కకపోవడంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకున్నది. ఆహ్వాన పత్రికల్లో మార్పులు చేసింది. కేసీఆర్ పేరును విశిష్ట అతిథుల జాబితాలో చేర్చింది. ముఖ్య అతిథిగా కేకేను పేర్కొంటూ.. ఆ తర్వాతి స్థానంలో కేసీఆర్ పేరును మార్చింది. 'తెలంగాణ రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నాయకులు' అనే హోదాను కూడా చేర్చింది. అయితే, ముందుగా బయటకు వచ్చిన ఆహ్వాన పత్రిక అసలుది కాదని జిల్లా అధికారులు సర్దిచెప్పుకునే ప్రయత్నం చేశారు. దీంతో మొదట వచ్చింది అసలుది కాకపోతే.. డిజైన్, అక్షరాలు, రంగులు, పేర్లు, పరిమాణం అచ్చు గుద్దినట్టు ఎలా ఉన్నాయని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించి నవ్వులపాలు కావొద్దని సూచిస్తున్నారు.



భద్రాద్రి జిల్లా మణుగూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

నేడైనా నిజం ఒప్పుకోండి

Iవ పేజీ తరువాయి...

చేసిందేమీలేదని స్పష్టంచేశారు. కానీ కేసీఆర్ నిర్మించిన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించినట్టుగా జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 'సీతారామ నీళ్లొచ్చే వరకు ఉద్యమిస్తాం

ప్రాజెక్టుకు డిజైన్ చేసిందెవరు? కేసీఆర్ ప్రభుత్వం కేటాయించిన నిధులెన్ని? కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన నిధులెన్ని? ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాత్ర ఎంత? కాంగ్రెస్ ప్రభుత్వం పాత్ర ఎంత? సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్న మూడు మోటర్లు బిగించింది బీఆర్ఎస్ ప్రభుత్వమా? కాంగ్రెస్ ప్రభుత్వమా?' వంటి అనేక విషయాలను ఉమ్మడి జిల్లా ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఒకే విడతలో రూ.2 లక్షల రుణమాఫీ అంటూ ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పూర్తి స్థాయిలో మాఫీ చేయకుండా కాలయాపన చేస్తున్నదని దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికీ 40 శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పీ, డీసీసీబీ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషయ్య, బీఆర్ఎస్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరందాలి

ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు నీరు వచ్చేవరకు ఉద్యమిస్తామని స్థానిక మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు నీటిని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రియానాయక్, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌లు మాట్లాడుతూ.. భద్రాద్రి జిల్లా మీదుగా గోదావరి నది ప్రవహిస్తుండటంతో ఆ నీటిని జిల్లాలోని ప్రతీ ఎకరాకు పారించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి నిర్మించారని తెలిపారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు తమ స్వార్థం కోసం సీతారామ నీటిని భద్రాద్రి జిల్లాకు కాకుండా.. ఖమ్మం జిల్లాకు తరలించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి నీటిని పక్క జిల్లాకు తరలిస్తే ఊరుకునేది లేదని, రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బోడ బాలు, తాతా గణేశ్, బానోత్ రామ, కిషన్, జాలాది అప్పారావు, లాలు, కిరణ్, శివకృష్ణ, రవి, లచ్చు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు. చిత్రంలో జడ్పీ, డీసీసీబీ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషయ్య

భద్రాద్రికి నీళ్లివ్వని సీఎంకు పూసుగూడెంలోనే బుద్ధిచెప్తాం

పినపాక నియోజకవర్గం, భద్రాద్రి జిల్లా రైతులకు సీతారామ నీళ్లివ్వకుండా అన్యాయం చేస్తున్నపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పూసుగూడెంలోనే బుద్ధి చెప్తామని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు హెచ్చరించారు. భద్రాద్రి జిల్లాలోని పినపాక నియోజకవర్గానికి చెందిన సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఇక్కడి రైతులకు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు వారి నియోజకవర్గాలకు తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ భద్రాద్రి జిల్లా మణుగూరులో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి బుధవారం ఆయన పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. తొలుత పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.8 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టును నిర్మించారని చెప్పారు. ఈ ప్రాజెక్టు నీళ్లను ఖమ్మం జిల్లా మంత్రులు తమ నియోజకవర్గాలకు తీసుకెళ్లాలని చూడటం సిగ్గుచేటని విమర్శించారు. సీతారామ ప్రాజెక్ట్ డిజైన్ ప్రకారం తొలుత స్థానిక రైతులకు, ముఖ్యంగా భద్రాద్రి జిల్లా రైతులకు నీళ్లు ఇవ్వాలని, ఆ తరువాతే ఖమ్మం జిల్లాకు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోశం నర్సింహారావు, అడపా అప్పారావు, ముత్యం బాబు, వట్టం రాంబాబు పాల్గొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నేడు సీఎం పర్యటన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరప్రదాయినిగా నిర్మాణంలో ఉన్న సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన పలు పంప్‌హౌజ్‌లను ప్రారంభించి వైరాలో ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా సాగునీటిని విడుదల చేయనున్నారు. వైరా వేదికగా రూ.2 లక్షల రైతు రుణమాఫీ మూడోవిడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

కళ్లెం వేస్తున్న పెద్దలెవరు?

మొదటిపేజీ తరువాయి...

విస్తీర్ణంలో భూములు ఉండగా.. ఇందులో పలు సంస్థలకు చెందిన భూములు కూడా ఉన్నాయి. వాటికి సంబంధించి ఎలాంటి వివాదం లేదు. కానీ, నాగన్‌పల్లి పరిధిలోని లావుని పట్టా భూముల్లో రహదారుల నిర్మాణం చేపట్టడంతో వివాదం నెలకొన్నది. నిబంధనలకు ఇది విరుద్ధం కావడంతో రెవిన్యూ శాఖ అధికారులు 11.36 ఎకరాల విస్తీర్ణంలోని పలువురు రైతులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ఈ భూములను నిబంధనలకు విరుద్ధంగా బదలాయింపు చేసినందున పదిహేను రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఈ నెల 7న నోటీసులు ఇచ్చారు. గడువు తీరిన తర్వాత భూములు స్వాధీనం చేసుకుంటామని చెప్తున్నారు. కానీ, అనాజిపూర్ గ్రామ పరిధిలోని సీలింగ్ పట్టాల వ్యవహారంలో రెవిన్యూ శాఖ స్పందించకపోవడం విస్మయానికి గురి చేస్తున్నది. ఈ గ్రామ పరిధిలోని పలు సర్వే నంబర్లలో 586 ఎకరాల భూమి ఉంటే, అందులో సీలింగ్ పట్టా 146.35 ఎకరాల వరకు ఉన్నది. వీటిని గతంలోనే ప్రభుత్వం నిరుపేద రైతులకు పంపిణీ చేసింది. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా కొనుగోళ్లు జరిగాయనే ఆరోపణలున్నాయి. వీటిపై రెవిన్యూ శాఖ అధికారులు దృష్టిసారించడం లేదు. పట్టా భూముల నెపంతో సీలింగ్ భూముల వైపు ఎవరినీ వెళ్లనీయడంలేదని పలువురు రైతులు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఈ భూముల్లో భారీ యంత్రాలతో చదును చేసేందుకు చేపడుతున్న పనులతో వచ్చే మట్టి, పెద్ద పెద్ద రాళ్లను ఇందిరాసాగర్ బఫర్ జోన్ పరిధిలో వేస్తున్నారనే అంశంపై అధికార యంత్రాంగం దృష్టిసారించకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. నీటిపారుదల శాఖ అధికారులుగానీ, హైడ్రా గానీ ఇప్పటివరకు ఇందిరాసాగర్ పరిరక్షణకు చర్యలు తీసుకోలేదంటే తెర వెనక పెద్దల ఒత్తిళ్లు ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రుణమాఫీతో వెలుగులోకి నకిలీ పట్టాలు

ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి అసైన్డ్ భూముల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతున్నది. సర్వే నంబరు 189లో 179.33 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఇందులో గతంలోనే నాగన్‌పల్లి గ్రామానికి చెందిన సుమారు 60 మంది రైతులకు ప్రభుత్వం 120 ఎకరాల విస్తీర్ణంలో పట్టాలు పంపిణీ చేసింది. మరో 59.33 ఎకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నది. ఆ ఖాళీ భూములకు సంబంధించి గతంలోనే భారీఎత్తున నకిలీ పట్టాల పంపిణీ జరిగిన వ్యవహారం తాజాగా చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలోనే నకిలీ పట్టాల పంపిణీ జరగ్గా... ఆ రైతుల పేర్లు రెవిన్యూ రికార్డుల్లోకి కూడా ఎక్కాయి. దీంతో వారికి పాసు పుస్తకాలు జారీ కావడంతో వారంతా బ్యాంకు రుణాలు తీసుకున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 2014లో రుణమాఫీ చేసింది. ఆ సందర్భంగా భూమిలేని వారి పేర్లు రుణమాఫీ జాబితాలో ఎందుకు ఉన్నాయంటూ నాగన్‌పల్లి గ్రామస్తులు ఆరా తీయడంతో నకిలీ పట్టాల వ్యవహారం వెలుగు చూసింది. వెంటనే గ్రామస్తులు అప్పటి కలెక్టర్ రఘునందన్‌రావుకు ఫిర్యాదు చేయగా ఆయన విచారణకు ఆదేశించారు. నకిలీ పట్టాల పంపిణీ నిజమని తేలడంతో పలువురు రైతుల పట్టాలను రద్దు చేయడంతోపాటు అప్పటి వీఆర్వో రఫీక్‌ను సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా రద్దు చేసిన వారిలో నిజమైన రైతులు కూడా ఉన్నామంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించగా.. ఇప్పటికీ ఆ వ్యవహారం కోర్టులో పెండింగ్‌లోనే ఉన్నది. అయితే వంద అడుగుల రహదారి నిర్మాణం తెరపైకి వచ్చినప్పుడు ఇద్దరు రైతులు ఆ భూమి తమదంటే తమది అంటూ ఘర్షణకు దిగారు. దీనిపై ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

తీర్పునకు లోబడే ఎమ్మెల్సీ నియామకాలు

- స్టే విధిస్తూనే షరతు పెట్టిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాల కేసులో సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. ఎమ్మెల్సీల నియామకాల ప్రక్రియను కొనసాగిస్తే అవి తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉండాలని షరతు విధిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లను బుధవారంజస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలేతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. కోర్టు తుది ఆదేశాలు ఇచ్చే వరకూ హైకోర్టు ఆదేశాలపై యథాతథ స్థితి (స్టేటస్ కో) ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోరారు. స్టేటస్ కో కాదని, స్టే ఆదేశాలు ఇస్తామని సుప్రీంకోర్టు చెప్పగా అందుకు సిబల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. స్టే ఇస్తే తిరిగి ఎమ్మెల్సీల నియామకాలు చేసే అవకాశం ఉన్నదని సుప్రీం ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. శాసనమండలి సభ్యులుగా దాసోజు, కుర్రను నియమించేందుకు గవర్నర్ నిరాకరించారని, రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా గవర్నర్ చర్యలు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో స్టే ఇస్తే పిటిషనర్లను కాకుండా గవర్నర్ వేరే వారిని ఎమ్మెల్సీలుగా నియమించే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిఫార్సు చేసిన ఇద్దరు వ్యక్తుల నియామక గెజిట్‌ను కూడా తెలంగాణ హైకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. ఆ ఇద్దరినే నియమించేందుకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని సిబల్ అన్నారు.

అయాచితం శ్రీధర్‌కు సబిత పరామర్శ



అయాచితం శ్రీధర్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, ఆగస్టు 14: అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్‌ను బుధవారం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పరామర్శించారు. హైదరాబాద్ కొత్తపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో ఉన్న ఆయన మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నేతలు అరవింద్‌శర్మ, నగేశ్, రామనర్సింహ, సాజీద్, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఐరాస శాశ్వత ప్రతినిధిగా పర్వతనేని హరీశ్
ఓయూ పూర్వ విద్యార్థికి కీలక పదవి

› 7



మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

గురువారం THURSDAY 15.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 71 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

ఆర్మీ కెప్టెన్ వీరమరణం

జమ్ముకశ్మీర్‌లో ఎదురుకాల్పులు

ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాది హతం

4 నెలల్లో 20 మంది జవాన్ల మృతి › 7

రాష్ట్రం నుంచి రాజ్యసభకు సింఘ్వి › 5

రాజస్థాన్ నేత ఎంపికపై తెలంగాణ నేతల ఆగ్రహం

తెలంగాణలో ఒక్క నేత కూడా దొరకలేదా అంటూ నిలదీత





సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఇల్లందు నియోజకవర్గానికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి జిల్లా టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు నిర్వహించిన ధర్నాలో పాల్గొని కార్యాలయ అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

నేడైనా నిజం ఒప్పుకోండి

మోటార్లు బిగించిందెవరు?.. మాటలు చెప్తున్నది ఎవరు?

- అబద్ధాలు ఆపి సీతారామపై సీఎం వాస్తవాలు చెప్పాలి
- దానిని కట్టిందెవరో ప్రజలకు వివరించాలి: తాతా మధు
- నీళ్ల కోసం బీఆర్‌ఎస్ ఆందోళన.. ఇల్లందులో బైక్ ర్యాలీ
- నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు నీరివ్వాలి :హరిప్రియ
- పినపాకకు ఇవ్వకుండా ప్రాజెక్టు నీళ్లెలా తరలిస్తారు?
- మణుగూరు ధర్నాలో బీఆర్‌ఎస్ నేత రేగా కాంతారావు

ఖమ్మం, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/టేకులపల్లి/మణుగూరు టౌన్/ఖమ్మం: సీతారామ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి గురువారం వైరాలో జరిగే సభలో ప్రజలకు వాస్తవాలను వివరించాలని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు ఉద్యమసారథి కేసీఆర్ మానసపుత్రిక అని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ఆయనే స్వయంగా రూపకల్పన చేసి నిర్మించిన ఎత్తిపోతల పథకం సీతారామ అని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం › 2వ పేజీలో



ముమ్మాటికీ గుడ్డి దర్బారే!

- **సుంకిశాల మునిగిన 5 రోజులకు సర్కార్ దృష్టికి**
- **అధికారిక ఉత్తర్వుల్లోనూ దొర్లిన పొరపాట్లు**
- **సాగర్ ఇన్‌ఫ్లో ఎక్కువ చూపిన కమిటీ నివేదిక**
- **పనుల వద్ద సివిల్ ఇంజినీర్లను నియమించని బోర్డు**
- **దిద్దుబాటు చర్యలకు దిగిన రేవంత్ ప్రభుత్వం**
- **తాజాగా నలుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు**
- **ప్రాజెక్టు డైరెక్టర్‌ను నాన్-ఫోకల్ పోస్టుకు బదిలీ**
- **ఏజెన్సీ మీద చర్యలపై సర్కారు దోబూచులాట**
- **2న జరిగితే 7న దృష్టికి వచ్చిందని అంగీకారం**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ మునకపై రాష్ట్ర ప్రభుత్వం తీరు ఆది నుంచీ గుడ్డి దర్బార్‌ను తలపిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా బుధవారం జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులతో పాటు ప్రభుత్వానికి సమర్పించిన కమిటీ నివేదికలోనూ పొరపాట్లు దొర్లినట్టు స్పష్టమవుతున్నది. సంఘటన జరిగిన రోజు అటు ఉన్నతాధికారులకుగాని, ఇటు ప్రభుత్వానికిగాని ఎలాంటి సమాచారం లేదని ప్రభుత్వమే › 6 వ పేజీలో

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు NAMASTE TELANGANA

గురువారం THURSDAY 15.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 14 || సంచిక (Issue): 71 || వెల (Price) రూ.6.50 | స్వాతంత్ర్య దినోత్సవం

గురువారం, సూర్యోదయం: 5-59, సూర్యాస్తమయం: 6-42. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం శుక్ల పక్షం తిథి: దశమి ఉదయం 10-27 వరకు, తదుపరి ఏకాదశి. నక్షత్రం: జ్యేష్ఠ పగలు 12-53 వరకు. వర్జ్యం: లేదు. రాహుకాలం: పగలు 1-55 నుంచి పగలు 3-30 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-13 నుంచి ఉదయం 11-04 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-17 నుంచి సాయంత్రం 4-08 వరకు. అమృతకాలం: లేదు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

హెడ్ కానిస్టేబుల్ యాదయ్యకు రాష్ట్రపతి మెడల్



ఈసారి తెలంగాణకు మాత్రమే పీఎంజీ అవార్డు

వివిధ విభాగాల్లో రాష్ట్రానికి మొత్తం 29 పతకాలు


› 3

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

అవమానించబోయి.. అభాసుపాలై

- మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రొటోకాల్ పాటించని సర్కారు
- స్వాతంత్ర్య వేడుకల్లో ప్రతిపక్షనేతకు దక్కని ప్రాధాన్యం
- క్యాబినెట్ హోదా ఉన్నా ఎమ్మెల్యేల వరసలో పేరు ముద్రణ
- విమర్శలు రావడంతో దిగొచ్చిన రేవంత్ ప్రభుత్వం
- విశిష్ట అతిథిగా పేర్కొంటూ మరో ఆహ్వాన పత్రిక ముద్రణ

తొలి ఆహ్వాన పత్రికలో గౌరవ అతిథుల జాబితాలో ఎమ్మెల్యేల పేర్లతో పాటు కేసీఆర్ పేరు ముద్రణ. విమర్శల తర్వాత కేసీఆర్‌ను విశిష్ట అతిథిగా పేర్కొంటూ మార్చిన ఇన్విటేషన్





హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ప్రతిపక్ష నేతలకు 'ప్రొటోకాల్'పై ప్రభుత్వం మరోసారి తన వైఖరిని బయటపెట్టుకున్నది. మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను అవమానించాలని ప్రయత్నించింది. అయితే, విమర్శలు రావడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టింది. స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా మెదక్ జిల్లా కేంద్రంలో గురువారం జరిగే వేడుకలకు సంబంధించి ప్రభుత్వం

› 2వ పేజీలో

ప్రతిగడపకూ స్వాతంత్ర్య ఫలాలు చేరాలి



గాంధీజీ స్ఫూర్తితో తెలంగాణ సాకారం: కేసీఆర్

రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ఎందరో మహనీయుల పోరాటాలు, మరెందరో బలిదానాల ఫలితంగా సాధించుకున్న దేశ స్వాతంత్ర్య ఫలాలు చివరి గడపకూ చేరిననాడే సంపూర్ణ సార్థకత చేకూరుతుందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభిప్రాయపడ్డారు. దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. మహాత్మాగాంధీ

› 2వ పేజీలో

పొరుగు రాష్ట్రాలతో కాదు..

ప్రపంచంతోనే మా పోటీ

పదేండ్లలో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మారుస్తా

ప్రపంచ అవసరాలు తీర్చే నాలుగో ఫ్యూచర్ సిటీగా హైదరాబాద్

కాగ్నిజెంట్ నూతన ప్రాంగణ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్



హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ఒక వైపు దేశ ఆర్థిక వ్యవస్థ మూడు ట్రిలియన్ డాలర్లకు చేరుకొనేందుకు అష్టకష్టాలు పడుతూ ఉంటే.. వచ్చే పదేండ్లలో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.84 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా మారుస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. అదే తన విజన్ అని అన్నారు. పద్నాలుగురోజుల విదేశీ పర్యటన నుంచి తిరిగివచ్చిన సీఎం.. ఇకపై తమ పోటీ పొరుగు రాష్ట్రాలతో కాదని ప్రపంచంతోనేనని ప్రకటించారు. కోకాపేటలో కాగ్నిజెంట్ నూతన ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి

› 5వ పేజీలో

కళ్లెం వేస్తున్న పెద్దలెవరు?

నాగన్‌పల్లి-అనాజిపూర్ ఎపిసోడ్‌లో అధికారుల ఉదాసీనత

పీవోటీ కింద సేకరిస్తామంటూ రెవెన్యూ శాఖ కాలయాపన

ఇందిరాసాగర్ పరిరక్షణపైనా దృష్టిసారించని హైడ్రా

తెరపైకి నాగన్‌పల్లి అసైన్డ్ భూముల నకిలీ పట్టాల బాగోతం



ఇందిరాసాగర్ చెరువు వద్ద ముమ్మరంగా సాగుతున్న పనులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 14: రంగారెడ్డి జిల్లా 'అసైన్డ్ భూముల్లో వెంచర్' వ్యవహారంలో అధికార యంత్రాంగం నిర్లిప్తత ప్రదర్శిస్తున్నదా? దీనికి 'ఔను' అనే సమాధానమే వినిపిస్తున్నది. పీవోటీ కింద భూములు స్వాధీనం చేసుకుంటామంటూ రెవిన్యూ శాఖ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటే, అవుటర్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న నీటి వనరు పరిరక్షణలో దూకుడు ప్రదర్శిస్తున్న హైడ్రా మాత్రం ఇందిరాసాగర్ వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో అధికార యంత్రాంగం దూకుడుకు ఎవరైనా కళ్లెం వేస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా నాగన్‌పల్లి అసైన్డ్ భూములకు సంబంధించి తాజాగా మరో కీలక మలుపు చోటుచేసుకున్నది. ప్రభుత్వపరంగా జరిగిన పట్టాల పంపిణీ కాకుండా గతంలో పెద్ద ఎత్తున నకిలీ పట్టాలు కూడా పంపిణీ చేసినట్టు తెలుస్తున్నది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం-అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల సరిహద్దులోని భూముల వ్యవహారం తెరపైకి వచ్చి వారం దాటుతున్నా, అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టకపోవడంతో దీని వెనక ప్రభుత్వంలోని కొందరు పెద్దల అండదండలు ఉన్నాయనే ప్రచారం జరుగుతున్నది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజిపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 261, 260-281 వరకు 586 ఎకరాల

› 2వ పేజీలో

రైతన్నకు మళ్లీ మొండిచెయ్యే!

రుణమాఫీలో కాంగ్రెస్ మార్క్ మాయాజాలం

- బీఆర్ఎస్ లక్ష మాఫీకి 36.68 లక్షల మంది అర్హులు
- కాంగ్రెస్ 2 లక్షల మాఫీకి 23.75 లక్షల మందేనట!
- బీఆర్ఎస్ హయాం కన్నా 13 లక్షలు తగ్గిన అర్హులు
- రుణమాఫీ పరిమితి పెంచితే అర్హుల సంఖ్య పెరగాలి
- నాడు లక్ష మాఫీకే రూ.19,440 కోట్లు అంచనా
- నేడు రూ.18,224 కోట్లతోనే రేవంత్ సర్కార్ సరి!



హైదరాబాద్, ఆగస్టు 14(నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీలో కాంగ్రెస్ మార్క్ మాయాజాలం స్పష్టంగా కనిపిస్తున్నది. నిజానికి రైతులకు మాఫీ చేసే రుణ మొత్తం పెరిగితే అర్హుల సంఖ్య కూడా పెరగాలి. కానీ, కాంగ్రెస్ మార్క్ రుణమాఫీలో అర్హుల సంఖ్య భారీగా తగ్గుతున్నది. బీఆర్ఎస్ హయాంలో చేసిన రుణమాఫీకి అర్హులైన రైతులతో పోల్చితే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీకి అర్హులైన రైతుల సంఖ్య భారీగా తగ్గిపోయింది. బీఆర్ఎస్ సర్కారు 2018లో రూ.లక్ష వరకు రుణమాఫీకి 36.68 లక్షల మంది రైతులను అర్హులుగా తేల్చింది. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు రూ.2 లక్షల వరకు రుణమాఫీకి మూడు విడతల్లో కలిపి సుమారు 23.75 లక్షల మంది రైతులకు మాత్రమే వర్తింపజేస్తున్నది. బీఆర్ఎస్ హయాం కంటే కాంగ్రెస్ ఏలుబడిలో రుణమాఫీ పొందే రైతుల

› 5వ పేజీలో

బస్సులో ఎల్లిపాయ పొట్టు తీయడం తప్పా?



ఫ్రీబస్‌లో కూరగాయలు అమ్ముకున్నా తప్పులేదు

స్త్రీనిధి సర్వసభ్య సమావేశంలో సీతక్క

› 5